ఆంధ్రజ్యోతి 5 ANDHRAJYOTHY
ప్రకాశం జిల్లా వార్తలు
శుక్రవారం 4, ఏప్రిల్ 2025

జిల్లాలో ఈ వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇక్కట్లు తీరనున్నాయి. అందుకు అవసరంగా జిల్లా యంత్రాంగం కోరిన రూ.11.20 కోట్లు నిధులు మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సాగర్ కాలువల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల కోసం కూడా మరో రూ.9.83 కోట్లు మంజూరుకు అంగీకారం తెలిపారు. దీంతో జిల్లాకు మూడేళ్లుగా ఆగిపోయిన తాగునీటి ట్యాంకర్లతో నీటి సరఫరాకు మళ్లీ ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది.



నీటికి నిధులు

జిల్లాలో తీరనున్న దాహార్తి

రూ.11.20 కోట్లు మంజూరుకు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్

- మళ్లీ మొదలుకానున్న ట్యాంకర్ల నీటి సరఫరా
- వైసీపీ హయాంలో ఈ తరహా నిధులకు బ్రేక్
- సాగర్ కాలువల్లో పనులకు రూ.9.83 కోట్లు
- ఇటీవల సమావేశంలో నిధుల అవసరాన్ని నివేదించిన కలెక్టర్ అన్సారియా



ఒంగోలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లావాసులకు ఊరటనిచ్చే కబురు. నీటి కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేందుకు అనుమతిచ్చింది. దీంతో అవసరమైన చోట్లా ట్యాంకర్లతో నీటి సరఫరాకు మార్గం సుగమమైంది. జిల్లాలో కాలాలతో సంబంధం లేకుండా పశ్చిమ ప్రాంతంలో కొన్నిచోట్ల ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాల్సి ఉంది. వేసవిలో అధికంగా ఈ పరిస్థితి ఉంటుంది. భూగర్భ జలాలు లేని గ్రామాలు అనేకం ఆ ప్రాంతంలో ఉన్నాయి. 800 నుంచి వెయ్యి అడుగులు వేసినా నీరులేని పరిస్థితి పలు గ్రామాల్లో ఉంది. భూగర్భజలం అందని స్థాయికి వెళ్లిపోయిందని, ఇక అక్కడ బోర్లు వేయకూడదని రాష్ట్రంలోని 300 గ్రామాలను ప్రకటించగా, అలాంటివి జిల్లాలోనే 93 ఉన్నాయి. అవన్నీ పశ్చిమ ప్రాంతంలోనే ఉన్నాయి.

చేతులెత్తేసిన గత ప్రభుత్వం

అనేక ఏళ్లుగా జిల్లాలో చాలా గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారు. మనుషుల అవసరాలకే మిగతా 6లో...

కలెక్టర్ల సదస్సులో ప్రస్తావన

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి నిధుల విడుదల అవసరంగా గుర్తించిన కలెక్టర్ అన్సారియా ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళ, బుధవారాల్లో జరిగిన కలెక్టర్ల సదస్సులో ప్రత్యేకంగా మాట్లాడే సమయంలో సమస్య తీవ్రతను, నిధుల అవసరాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాగర్ కాలువల్లో నీటి సరఫరా అంతంతమాత్రంగా ఉంటుందని తెలిపారు. చాలాచోట్ల పూడిక పెరిగి, చిల్లచెట్లు పడి, కాలువలు దెబ్బతిని నీటి సరఫరాకు కలుగుతున్న ఆటంకాన్ని కూడా వివరించారు. అత్యవసర పనుల కింద జూన్‌లోపు పనులు చేసేందుకు రూ.9.83 కోట్లు కోరారు. ఈ రెండింటికి సీఎం చంద్రబాబు ఓకే అన్నారు. వెలిగొండ నిర్వాసితులకు చెల్లింపు, ట్రిపుల్ ఐటీ, యూనివర్సిటీ నిర్మాణాలు, డెయిరీ పునరుద్ధరణ వంటి అంశాలను కూడా ప్రధానంగా కలెక్టర్ ఆ సమావేశంలో సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అయితే భారీగా నిధులు అవసరం కావడంతో ఆ అంశాలను నోట్ చేసుకొని పరిశీలించాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించినట్లు సమాచారం.



యాంజియోగ్రామ్ పరీక్షలు చేసే వైద్య పరికరం

ఇక గుండె పదిలం

- జీజీహెచ్‌లో రూ.6 కోట్లతో క్యాథ్ లాబ్ ఏర్పాటు
- యాంజియోగ్రామ్.. స్టంట్ ఇన్‌ప్లాంటేషన్ సేవలు ఇక్కడే
- 10న ప్రారంభించనున్న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హృద్రోగులకు శుభవార్త. ప్రైవేటు వైద్యశాలల్లో వేలకు వేలు చెల్లించి చేయించే గుండె పరీక్షలు ఒంగోలులోని జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్)లో లభించనున్నాయి. యాంజియోగ్రామ్, స్టంట్ ఇన్‌ప్లాంటేషన్ లాంటి ఖరీదైన వైద్యసేవలు ఇక నుంచి ఇక్కడే లభించనున్నాయి. గుండె ఆపరేషన్‌లను సైతం జీజీహెచ్‌లోనే నిర్వహించే విధంగా అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. అందుకోసం రూ.6 కోట్లు విలువైన క్యాథ్ ల్యాబ్‌ను ఈనెల 10న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించనున్నారు. ఇప్పటి వరకు జీజీహెచ్‌లో గుండెకు సంబంధించిన వైద్యసేవలు పూర్తి స్థాయిలో లభించలేదు. యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్ట్, గుండెకు స్టంట్ వంటి సేవలు పొందాలంటే ప్రైవేటు వైద్యశాలల్లో లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉండేది. ఇక నుంచి ఆ పరిస్థితి లేకుండా క్యాథ్ ల్యాబ్ సేవలు జీజీహెచ్‌లోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు జీజీహెచ్‌లో గుండె సంబంధిత వైద్యసేవలను అందిస్తున్నారు. ఆయన ఎప్పటికప్పుడు క్యాథ్ ల్యాబ్ పనితీరును పరిశీలిస్తున్నారు. గుండె సంబంధిత వ్యాధులకు వైద్య సేవలను ఉచితంగా మిగతా 6లో...

హృద్రోగులకు ఇదొక వరం



ఇటీవల కాలంలో గుండెపోటు మరణాలు అధికమయ్యాయి. ఈ క్రమంలో పేదలకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు, ఖరీదైన వైద్యాన్ని కూడా ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావించింది. ఈమేరకు ఒంగోలులోని జీజీహెచ్‌లో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేయడం పేదలకు వరం లాంటిది. కరోనరీ ఆర్టరీ వ్యాధి, గుండెపోటు, ఛాతి నొప్పి, కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్, వ్యాస్కులర్ డిసీజ్, పల్మనరీ, హైపర్ టెన్షన్, రక్తం గడ్డకట్టడం వాటిని గుర్తించడానికి, చికిత్స చేయడానికి క్యాథ్ ల్యాబ్ ద్వారా సేవలు అందిస్తారు.

- డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, కార్డియాలజిస్ట్, జీజీహెచ్, ఒంగోలు

దక్షిణాది పొగాకు వేలం ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా మార్కెట్ కుదుట పడలేదు. రోజువారీ అమ్మకాల కోసం వేలం కేంద్రాలకు వస్తున్న బేళ్లలో సగటున 20 శాతం తిరస్కరణలు జరుగుతున్నాయి. దక్షిణాది నల్లరేగడి నేలల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. దీనికితోడు కీలక వ్యాపారులు ఇంకా తమ వాటాకు అనుగుణంగా కొనుగోళ్లు చేయడం లేదు. దీంతో బోర్డు అధికారులు పరిమితంగానే బేళ్లను వేలానికి అనుమతిస్తున్నారు. ఈ సమయంలో ఒక్కో కేంద్రానికి సగటున ఐదారు వందల బేళ్లు అలా దక్షిణాదిలోని 11 కేంద్రాలకు 6వేల బేళ్లు రోజువారీ అమ్మకాలకు తీసుకురావాల్సి ఉండగా ఒక్కో కేంద్రానికి సగటున 400 బేళ్లలోపే అనుమతిస్తున్నారు.



పొగాకు మార్కెట్‌లో ఒడిదొడుకులు

మొదట్లో ఆశాజనకం.. ప్రస్తుతం అయోమయం


- దక్షిణాది వేలం కేంద్రాల్లో భారీ సంఖ్యలో నోబిడ్లు
- ఇంకా పూర్తిగా కొనుగోళ్లకు దిగని ప్రధాన కంపెనీలు
- వేలానికి తెచ్చే బేళ్లను నియంత్రిస్తున్న బోర్డు అధికారులు

తిరస్కరణం

ఒంగోలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్ పొగాకు కొనుగోళ్ల దక్షిణాదిలో రెండు విడతలుగా ప్రారంభించారు. మొత్తం ఈ ప్రాంతంలోని 11 కేంద్రాల్లో తొలి విడతగా ఈనెల 10న ఒంగోలు-1, పొదిలి, కొండపి, కందుకూరు-1 కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రారంభించగా మిగిలిన ఏడు కేంద్రాలలో ఈనెల 19వ తేదీ నుంచి చేపట్టారు. ప్రారంభ గరిష్ఠ ధర కిలో రూ.280 పలికింది. గతేడాది రూ.230తో ప్రారంభించిన వ్యాపారులు ఈ ఏడాది రూ. 280తో ప్రారంభించడంతో రైతులు సంతోషపడ్డారు. మార్కెట్ గత మూడేళ్ల ఆశాజనకంగా సాగడంతో ఈ సీజన్‌లో భారీగా పంట సాగు చేసి ఉత్పత్తిని గణనీయంగా రైతులు పెంచారు.

మార్కెట్‌పై రైతుల్లో ఆందోళన

దక్షిణాదిలో 67వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగుకు, 105 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇవ్వగా రైతులు దాదాపు 90వేల హెక్టార్లలో సాగుచేశారు. సుమారు 162 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తి అంచనా వేస్తున్నారు. అలా భారీగా సాగు, ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో మార్కెట్‌లో ధరలపై రైతుల్లో ఆందోళన తొలుత ఉంది. కొనుగోళ్ల ప్రారంభరోజున వ్యాపారులు గరిష్ఠ ధరను కిలో రూ.280 ఇవ్వడంతో రైతులు కొంత కుదుటపడ్డారు. ఈ సీజన్ ధరలు ఇబ్బంది ఉండదన్న ఆనందం వ్యక్తం చేశారు. కానీ ఆ ఆనందం వారిలో ఎక్కువ రోజులు మిగలలేదు. వారం పదిరోజులుగా మార్కెట్ ఒడిదుడుకులు ఎదుర్కొంటూ గరిష్ఠ ధర కిలో రూ.280 అలాగే కొనసాగుతున్నా కనిష్ఠ ధరలు క్రమంగా రూ.260 నుంచి రూ.240కి తగ్గాయి. దీనికితోడు బేళ్ల తిరస్కరణ కూడా అధికంగానే ఉం టోంది. కొన్నిరకాల మేలురకం, మీడియం మిగతా 6లో...





దోర్నాలలో మిరప పంటకు పరదాలు కప్పుతున్న మహిళా రైతు

ఎండ.. గాలి.. వాన

- పశ్చిమ ప్రాంతంలో భిన్న వాతావరణం
- వైపాలెం, పెద్దారవీడు మండలాల్లో ఒక మోస్తరు వర్షం
- ఇతర ప్రాంతాల్లోనూ జల్లులు

ఒంగోలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం పగటిపూట భిన్న వాతావరణం నెలకొంది. పశ్చిమ ప్రాంతంలో ఈ పరిస్థితి అధికంగా కనిపిస్తోంది. వారం పదిరోజుల నుంచి ఉన్నట్లు గురువారం కూడా మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగానే ఉంది. ఉదయం పది గంటల నుంచే 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా మధ్యాహ్నానికి 38 డిగ్రీలకుపైగా చాలా ప్రాంతాల్లో ఉంటోంది. అనంతరం వాతావరణంలో మార్పు వచ్చింది. సాధారణంగా రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. గురువారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత మార్పు కనిపించింది. ఎండ తీవ్రత తగ్గి వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం మిగతా 6లో...

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో ఖరీఫ్ గింజలు 8,879 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- రూ.20.59 కోట్లకుగాను రూ.18.75 కోట్లు జమ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని పది మండలాల్లోని 45 రైతుసేవా కేంద్రాల్లో ఈ కొనుగోళ్లు చేశారు. మూడు నెలల పాటు ఈ ప్రక్రియ గత నెల 31వ తేదీతో ముగిసింది. జిల్లాలో 8,879 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశారు. అందుకోసం రైతులకు రూ.20.59 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.18.75 కోట్లు రైతుల ఖాతాకు జమ చేశారు. మరో రూ.1.84 కోట్లు మాత్రమే బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వారం పదిరోజుల్లో చెల్లించే అవకాశముంది.

- **వైసీపీ ప్రభుత్వంలో రైతు పరిస్థితి అగమ్యగోచరం**

వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్ల చేసినా ఎప్పుడు ఆ డబ్బులు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. దీంతో రైతులు నెలల తరబడి డబ్బుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించేందుకు రైతులు భయపడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల చేయడమే కాకుండా వారం పదిరోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తూ వస్తున్నారు. దీంతో ఈసారి ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల కొంత మేర పెరిగినట్లు సమాచారం. రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్ల కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు.



సర్పంచ్ ఆత్మహత్య

వెలిగండ్ల, ఏప్రిల్ 3 : (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఇమ్మడిచెరువు సర్పంచ్ తోకల బాలకృష్ణ(37) బెంగళూరులో ఉరివేసుకుని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. వైసీపీ బలపర్చిన సర్పంచ్‌గా గెలుపొందిన బాలకృష్ణ భార్యాపిల్లలతో బెంగళూరుకు వలస వెళ్లారు. అప్పుడప్పుడు సమావేశాలకు వచ్చి వెళ్తుండేవారు. కుటుంబంలో మనస్పర్థలు వచ్చి క్షణికావేశంతో వెళ్లి ఫ్యానుకు ఉరివేసుకున్నారు. బంధువులు తలుపులు తీసి లోపలకు వెళ్లేసరికి మృతిచెంది ఉన్నారు. పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రం వెళ్లి మృతిచెందడంపై భార్య దుర్గాభవాని, ఇద్దరు పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



బాలకృష్ణ (ఫైల్)

హత్య చేసి నేలబావిలో పడేశారు

- అర్జున్‌రెడ్డి మృతదేహాన్ని గుర్తించిన బంధువులు
- వివాహేతర సంబంధమే హత్యకు కారణం

7

డీఆర్ఆర్ఎం విద్యార్థులకు అవస్థలు!

- 'పది' మూల్యాంకనంతో ఇబ్బందులు
- టెంట్ల కిందే చదువులు

నీటికి నిధులు

(5వ పేజీ తరువాయి)
కాక పశుసంపదకు కూడా కొన్ని గ్రామాల్లో నీటి సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. ఇలాంటి పరిస్థితి ఉన్నచోట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీటి సరఫరాకు ప్రకృతి విపత్తుల నిధి ద్వారా కేటాయిస్తున్నారు. అయితే మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా ప్రకటించి ఉంటేనే నిధులు ఇస్తామని చెప్పి వాటిని ఆపేసింది. అయితే అన్నివిధాలా భారం భరించాల్సిన అప్పటి వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది. స్థానిక సంస్థల నుంచి సమకూర్చుకోవాలని సూచించింది. దానివల్ల కరువు ప్రాంతంగా ప్రకటించకపోయినా నీటి ఇక్కట్లు ఉండే మన జిల్లా, చిత్తూరు జిల్లా ఇతర కొన్నింటిలో ప్రభుత్వం నుంచి నిధులు రాక, స్థానికంగా అందుబాటులో లేక నీటి సరఫరా తగ్గించి వేశారు. అయితే సమస్య తీవ్రతతో ప్రజలు ఆందోళన ప్రజాప్రతినిధుల సిఫార్సులతో ట్యాంకర్లతో తోలక తప్పలేదు. అలా ప్రస్తుతం జిల్లాలో మూడేళ్లుగా రూ.21 కోట్లు బకాయిలు ఉన్నాయి. తిరిగి ఈ ఏడాది వేసవిలో 14 మండలాల్లోని 270 గ్రామాల్లో నీటి రవాణా చేయాల్సి వస్తుందని, అందుకు రూ.11.20 కోట్లు అవసరంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కలెక్టర్‌కు నివేదించారు.

తిరస్క'రణం'

(5వ పేజీ తరువాయి)
గ్రేడ్ బేళ్లను గ్రేడింగ్ సరిలేదంటూ బయ్యర్లు తిరస్కరిస్తున్నారు.

22 శాతం వరకు తిరస్కరణ

- గత రెండు, మూడేళ్ల గ్రేడ్ చేయకుండా తెచ్చినా ఎగబడి కొన్న వ్యాపారులు ప్రస్తుతం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ బేళ్లను తిరస్కరిస్తున్నారు.
- ఈ వారంరోజులు నిత్యం 17 నుంచి 22 శాతం బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి.
- ఈనెల 24న మార్కెట్‌లోని 11 కేంద్రాలకు 2,873 బేళ్లు తీసుకరాగా 17.57శాతంతో 503 బేళ్లు తిరస్కరించారు.
- 25వ తేదీన 4,307 బేళ్లలో 18శాతం మేర తిరస్కరించారు.
- 28వ తేదీన తెచ్చిన బేళ్లలో ఏకంగా 22.87 శాతం తిరస్కరించారు. ఆ రోజున 4,333 బేళ్లు తీసుకురాగా 991 వెనక్కి వెళ్లకు తప్పలేదన్నమాట.
- శనివారం బేళ్ల సంఖ్యను తగ్గించి 3,052 బేళ్లను మాత్రమే వేలంకు అనుమతించగా అందులోనూ 17.75శాతం తిరస్కరించారు.
- ఇలా తిరస్కరణలు అధికంగా ఉండటంతోపాటు పలు కీలక కంపెనీల బయ్యర్లు కూడా మార్కెట్లో కొనుగోళ్లకు పూర్తిస్థాయిలో రాలేదు. దీంతో బోర్డు అధికారులు రోజువారీ వేలం కేంద్రాలకు అనుమతించే బేళ్లను నియంత్రిస్తున్నారు. ఎస్‌బీఎస్ రీజియన్‌లో ఈ పరిస్థితి అధికంగా కనిపిస్తోంది.

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో ఐదుగురు అరెస్టు


పరారీలో మరో నిందితుడు జీఆర్పీ కానిస్టేబుల్

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురిని అరెస్టు చేయగా, మరో నిందితుడు జీఆర్‌పీ కానిస్టేబుల్ పరారీలో ఉన్నారు. గురువారం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎండి మొయిన్ ఆ కేసు వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని గవినివారి పాలెంకు చెందిన చీదర బోయిన నాగేశ్వరరావు ప్రస్తుతం ఢిల్లీలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల సెలవులపై వచ్చారు. ఇతనికి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, వీరయ్య, భరత్, వేణు, కుమార స్వామి, జీఆర్పీ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణకు గతంలో స్థలం వివాదం ఉంది. ఈక్రమంలో గత నెల 30వ తేదీన జరిగిన గొడవలో ఆరుగురు ఇతనిపై కత్తితో దాడి చేసి గాయపరిచారు. దీనిపై నమోదైన కేసులో ఐదుగురుని ఈపూరుపాలెం పోలీసులు అరెస్టు చేశారు. అలాగే జీఆర్పీ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

వెయ్యేళ్ల నాటి రాతి విగ్రహాలు లభ్యం

- కర్ణాటకకు చెందిన మడియాల మాచయ్య విగ్రహాలు గంగదొనకొండలో లభ్యం
- గుడి కట్టాలని పలువురు వినతి

కురిచేడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సుమారు వెయ్యి ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రంలో నివసించిన వీరశైవాచార సంపన్నుడు అయిన ఓ రజకుడు మడియాల మాచయ్య శిల్పాల చరిత్ర ఆధునిక ప్రపంచానికి తెలిసింది. కురిచేడు


మడియాల మాచయ్య విగ్రహాలు

మండలం గంగదొనకొండ గ్రామంలోని గంగమ్మ దేవాయలంలో ఉన్న ఆయన శిల్పాలను ప్రముఖ చరిత్రకారుడు తురిమెళ్ల శ్రీనివాస శర్మ గురువారం పరిశీలించి వాటి చరిత్రను వివరించారు. అవి 11వ శతాబ్దానికి చెందిన మడియాల మాచయ్య విగ్రహాలుగా గుర్తించారు. వివరాల్లోకెళ్తే...

గంగదొనకొండ.. ఒకప్పుడు చారిత్రాత్మక పట్టణం.. కురిచేడు మండలంలో ఉన్న ఆ గ్రామంలో 10వ శతాబ్దం నాటి గంగమ్మ గుడి ఉంది. కాటమరాజు నుంచి రాయల యుగం వరకు రాజులందరూ గంగదొనకొండ గంగమ్మ దేవతను సేవించిన వారే. గంగదొనకొండ, పాలేటి గంగ, గుంటిగంగ ఈ మూడు ప్రాంతాలు ఆనాటి రాజుల ఆదరణలో ప్రత్యేక పట్టణాలుగా విలసిల్లాయి.

ఈ విగ్రహాలను పరిశీలిస్తే ఏనుగు తొండాన్ని చీలుస్తున్నట్లు మాచయ్య కనిపిస్తాడు. ఇతని తలకు కొప్పు ఉన్నది. భుజాన దుస్తుల మూట కనబడుతుంది. అలాగే పక్కనే గుడ్డల మూటతో ఉన్న మహిళ కనబడుతుంది. ఆమె మాచయ్య భార్య అయి ఉండవచ్చు. ఇదే విధంగా ఉన్న మరొక శిల తల లేకుండా ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని కొలనుపాక గ్రామంలో వీరశైవ రజక మఠంలో కూడా మాచయ్య విగ్రహం ఉన్నట్లు తెలుస్తుంది.

మాచయ్య చరిత్ర ఇలా...

పాల్కురికి సోమనాథుని బసవేశ్వర పురాణం ప్రకారం కర్ణాటక రాష్ట్రంలో 11వ శతాబ్దంలో బసవేశ్వరుడు జన్మించాడు. తల్లి గర్భంలోనే మూడేళ్లు ఉండి జన్మించడంతో అందరూ అతనిని మృత శిశువుగా భావించారు. ఓ జంగముడు ఈ బాలుని మెడలో శివలింగ ధారణ చేసి ఓం నమఃశివాయ అంటూ జపించగా వెంటనే బాలుడు ఏడ్పు లంఘించుకుని బతికి బట్టకట్టాడు. బసవుని దయతో జన్మించడంతో బసవేశ్వరుడిగా నామకరణం చేశారు. ఆ బసవేశ్వరుడు వీరాచార సంపన్నుడు. మహారాష్ట్రలోని బిజ్జలుని మహారాజు ఆస్థానంలో బసవేశ్వరుడు ఉద్యోగం సంపాదించాడు. తదుపరి మంత్రి అయ్యాడు. బిజ్జలుడు చాణుక్యులతో పోరాడి వారి రాజ్యానికి చక్రవర్తి అయ్యాడు. ఆ సమయంలో బసవేశ్వరుడు కూడా మహారాష్ట్ర నుంచి కర్ణాటకలోని కల్యాణి నగరానికి వచ్చాడు. బసవేశ్వరుడి వద్ద అనేక మంది శైవ మత ఆరాధకులు ఉండేవారు. వీరిలో ప్రముఖుడు మడియాల మాచయ్య, ఇతడు ఒక రజకుడు. కుల వృత్తి చేసి జీవించేవాడు. ఇతను కేవలం శైవుల గృహాల దుస్తులు మాత్రమే ఉతికేవాడు. శైవ ఆరాధనకు దుస్తులను శుభ్రపరిచి పరమ పవిత్రంగా వాటిని మూటకట్టుకుని చాకిరేవునుంచి వచ్చేటపుడు ఎవరూ ఎదురు పడరాదని, తాకరాదని చాటింపు వేయించాడు. అలా తాకిన వారిని సంహరిస్తానని ప్రతినబూనాడు. ఒకరోజు పొరుగూరి బాటసారి తెలియక మాచయ్య దుస్తులు శుభ్రపరచి రేవు నుంచి వచ్చేటపుడు భుజంపై చేయివేశాడు. తన వ్రతభంగమైనదని తలచిన మాచయ్య ఆ వ్యక్తిని సంహరించాడు. ఈ విషయాన్ని గ్రామ తలారులు మహారాజైన బిజ్జలునికి తెలిపారు. కోపోద్రిక్తుడైన బిజ్జలుడు వైష్ణవుల గృహాలలోని విడిచిన దుస్తులన్నింటిని మూటకట్టించి ఓ ఏనుగుపై ఎత్తించి మావటినిచ్చి పాపాపరిహారార్థం మాచయ్య వాటిని శుభ్ర పరచాలని ఆదేశించారు. అలా ఏనుగుతో సహా వెళ్లిన భటులు రాజాజ్ఞను తెలుపగా మాచయ్య వైష్ణవుల దుస్తులను శుభ్రపరచడానికి నిరాకరించాడు. అప్పుడు ఏనుగును మాచయ్య మీదకు ఉసిగొలిపారు. శివభక్తి పరాయణుడైన మాచయ్య ఓం నమఃశివాయ అంటూ ఏనుగు తొండాన్ని రెండుగా చీల్చి దాని దేహాన్ని తునాతునకలు చేసి చంపాడు. ఎవరూ తనపైకి ఏనుగును పంపారో వారిని సంహరిస్తానని బిజ్జలుని కోసం వెతికాడు. ఈ విషయం తెలుసుకున్న బసవేశ్వరుడు బిజ్జలుడిని తోడ్కొని వచ్చి మాచయ్య ఆగ్రహాన్ని తగ్గించి శాంతపరిచాడు. తన శైవ భక్తితో ఏనుగును, తాను చంపిన మనిషిని బతికించాడు. మాచయ్య భక్తికి మెచ్చిన బిజ్జలుడు మాచయ్యకు పాదాభివందనం చేసి ఆయన శిష్యునిగా మారాడు.



అప్పటి నుంచి అందరూ మాచయ్యను దైవ స్వరూపునిగా చూడటం ప్రారంభించారు. ఈ క్రమంలో రజకులకు ఆరాధ్య దైవం అయ్యాడు. మాచయ్య విగ్రహాలు కర్ణాటక ప్రాంతంలో ఉన్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో అరుదుగా ఉన్నాయి. మాచయ్య విగ్రహం కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామంలో వెలసిన గంగమ్మ దేవాలయంలో రెండు ఉన్నాయి. ఈ విగ్రహాలు ఎప్పటి నుంచి ఉన్నాయో, ఎవరు తీసుకువచ్చారో మాత్రం గ్రామస్థులు చెప్పలేకపోతున్నారు.

ఓపెన్ ఇంటర్ స్పాట్‌కు నాల్గో వంతు హాజరు

- నేడు హాజరవుతారని ఆశాభావం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం స్థానిక ఏబీఎం జూనియర్ కళాశాలలో ప్రారంభమైంది. మొదటి రోజు మూల్యాంకనానికి నియమితులైన ఉపాధ్యాయుల్లో కేవలం నాల్గో వంతు మాత్రమే హాజరయ్యారు. దీంతో మూల్యాంకనం కేంద్రం వెలవెలబోయింది. మొత్తం 150 మందిని నియమించగా మొదటి రోజు కేవలం 41 మంది మాత్రమే హాజరయ్యారు. మూల్యాంకానికి 25 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 125 మంది సీఈవోలు, 25 మంది పరిశీలకులను నియమించారు. మొత్తం 150 మందికి గాను 41 మంది వచ్చారు. మూల్యాంకానికి ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీలు, హైస్కూలు ప్లస్‌లలో పనిచేస్తున్న వారిని నియమించగా వీరిలో ఏపీ మోడల్ స్కూలు, కేజీబీవీ వారు ప్రస్తుతం రెగ్యులర్ ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకానికి హాజరయ్యారు. వీరికి గురువారంతో ముగియనుందని, శుక్రవారం నుంచి హాజరవుతారని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషు, బయాలజీ, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్ సబ్జెక్టులకు 11 మంది సీఈలు, 45 మంది ఏఈలు అవసరం ఉంది. ఏపీ మోడల్ స్కూళ్ల అధ్యాపకులను పాఠశాలలకు వెళ్లి సీనియర్ ఇంటర్ విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యా డైరెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంత మంది మూల్యాంకానికి హాజరవుతారో, మూల్యాంకనం ఎప్పటికి పూర్తవుతుందో అంతు చిక్కడం లేదు. మూల్యాంకానికి 15వేల పేపర్లు రాగా ఈనెల 7 నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

పది స్పాట్‌కు 40 మంది కొరత

డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో గురువారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకానికి 40 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు అవసరమని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. బయాలాజికల్ సైన్స్‌కు 20 మంది, గణితం, ఇంగ్లీషు సబ్జెక్టులకు పదిమంది చొప్పున 20 మంది ఏఈలు అవసరమన్నారు. వీరిని శుక్రవారం స్పాట్‌కు రప్పించేందుకు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సంబంధిత టీచర్లతో ఫోన్‌లో మాట్లాడారు. శుక్రవారం స్పాట్‌కు హాజరుకాకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం నుంచి సోషల్ మూల్యాంకనం ప్రారంభమవుతుందని డీఈవో తెలిపారు.

స్టేషన్‌కు వచ్చేవారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలి

- ఎస్పీ దామోదర్
- కొండపి, పొన్నలూరు పోలీస్ స్టేషన్‌ల సందర్శన
- కొండపిలో మహిళా పోలీసులకు హెల్మెట్‌ల పంపిణీ

కొండపి, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, వారి బాధలను సావధానంగా విని వారికి న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలని ఎస్పీ దామోదర్ పోలీసులకు సూచించారు. గురువారం రాత్రి కొండపి పోలీస్‌స్టేషన్‌ను ఆయన సాధారణ తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఆయన మాట్లాడారు. స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్‌లను ఆదేశించారు. అంతకుముందు ఆవరణలో పాడుబడిన పోలీసు క్వార్టర్లను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో చలివేంద్రాన్ని ఎస్పీ ప్రారంభించారు.

గ్రామాల్లో మహిళా పోలీసులదే కీలక పాత్ర

గ్రామాల్లో మహిళా పోలీసులదే కీలకపాత్రని మహిళా పోలీసులను ఉద్దేశించి ఎస్పీ అన్నారు. మహిళా పోలీసులతో ఆయన కొండపి స్టేషన్‌లో అరగంటపాటు సమావేశం అయ్యారు. ప్రధానంగా సైబర్ నేరగాళ్ల వలలో పడి డబ్బులు పోగొట్టుకునే వారికి అవగాహన కలిగించాలన్నారు. మహిళా పోలీసులకు ద్విచక్ర వాహనాలు ఉన్నాయా? అని ఎస్పీ అడిగి ఉన్నవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తమ కుటుంబ సభ్యులతోపాటు, పరిసర ఇళ్లవారికి, గ్రామంలోని వాహనదారులకు హెల్మెట్ ధరించేలా అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులకు హెల్మెట్‌లను ఎస్పీ పంపిణీ చేశారు.

పొన్నలూరులో...


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ గురువారం సాయంత్రం సందర్శించారు. పోలీసు సిబ్బందితో మాట్లాడారు. స్టేషన్‌లో పెండింగ్ కేసులు లేకుండా చూడాలని, అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెంచాలని ఎస్సై అనుక్‌కు సూచించారు.

పురాతన దారిని ఆక్రమించిన గ్రానైట్ క్వారీ

- మల్లాయపాలెం రైతులు అధికారులకు ఫిర్యాదు
- పరిశీలించిన మైనింగ్, రెవెన్యూ అధికారులు

బల్లికురవ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పురాతన కాలం నుంచి పొలాలకు వెళ్లే దారిని ఆర్గా గ్రానైట్ క్వారీ అడ్డగోలుగా ఆక్రమించి పంటల భూములకు వెళ్లకుండా చేస్తుందని కొత్త మల్లాయపాలెం గ్రామానికి చెందిన జూపల్లి గంగాధర్ మరి కొందరు రైతులు అధికారులకు వరుస ఫిర్యాదులు చేశారు.


ఆక్రమించిన దారిని పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

రైతుల ఫిర్యాదులపై గురువారం జిల్లా మైనింగ్ ఆర్ఐ రాజేంద్రప్రసాద్, సర్వేయర్ నాగలక్ష్మి ఆర్గా గ్రానైట్ క్వారీని పరిశీలించారు. ఈసందర్భంగా గ్రానైట్ క్వారీ యజమాని అయిన బాచిన కృష్ణ చైతన్యతో అధికారులు మాట్లాడారు. క్వారీ యజమాని వద్ద ఉన్న రికార్డులు అందించాలని వారు కోరారు. అనంతరం రైతులతో వారు మాట్లాడారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు ఎన్నో దశాబ్దాల నుంచి పొలాలకు వెళ్లే దారి సర్వే నెంబరు 871లో ఉందని, వైసీపీ హయాంలో కొందరు అధికారులు తమకు దారి లేకుండా చేశారని తహసీల్దార్, ఆర్డీవో రికార్డులో పురాతన దారి ఉందని నివేదిక ఇచ్చారని తక్షణమే తమకు దారిని కేటాయించాలని లేకుంటే ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ పరిశీలనలో రెవెన్యూ సర్వేయర్ నారాయణరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి పాల్గొన్నారు. ఈ ఫిర్యాదులపై మైనింగ్ ఆర్ఐ రాజేంద్ర ప్రాద్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. సర్వే చేసేందుకు మండల సర్వేయర్ లేకపోవడంతో మరో మారు వస్తామని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

భార్య, అత్తపై కత్తితో దాడి

- అపస్మారక స్థితిలో భార్య, రక్త గాయాలతో అత్త
- భర్త రేపల్లె యడ్లలంక వాసి

పేరాల(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కొంత కాలంగా కుటుంబంలో నెలకొన్న మనస్పర్థల కారణంగా కట్టుకున్న భార్యను, అడ్డు వచ్చిన అత్తను కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ఈ ఘటన గురువారం రాత్రి పేరాల్లోని మసీదు సెంటర్ సమీపంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా పరిధిలోని రేపల్లె యడ్లలంకకు చెందిన తోకల కరుణాకర్, పేరాలకు చెందిన సంధ్య 2013లో ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి ఒక బాబు. గత రెండు సంవత్సరాల కిందట నెల కొన్న వివాదాల కారణంగా భార్య సంధ్య తల్లి లక్ష్మి వద్దకు వచ్చేసింది. అయితే అప్పటి నుంచి అప్పుడప్పుడు భర్త కరుణాకర్ భార్య వద్దకు వచ్చి గొడవపడుతుంటాడు. ఈక్రమంలోనే పథకం ప్రకారం కత్తితో భార్య పొట్టలో, తొడపై కత్తితో పొడిచాడు. అడ్డు వచ్చిన అత్త లక్ష్మి రెండు చేతులపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. అయితే అపస్మారకంగా ఉన్న భార్యను, తీవ్ర రక్త గాయాలైన లక్ష్మిని స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. సంధ్యను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ నాగభూషణం హాస్పిటల్‌కు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఏరియా హాస్పిటల్లో అపస్మారక స్థితిలో ఉన్న సంధ్య

డీజిల్ చోరీపై వాగ్వివాదం

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : టిప్పర్లలో డీజిల్ చోరీపై డ్రైవర్లు, యజమానుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. విజయవాడ - బెంగళూరు హైవే నిర్మాణ పనులకు అద్దంకి పట్టణానికి చెందిన వ్యక్తులు టిప్పర్‌లను ఏర్పాటు చేశారు. తాళ్లూరు మండలం గుంటిగంగ వద్ద టిప్పర్‌లు గ్రావెల్ తరలింపునకు ఉంచగా, డ్రైవర్‌లు డీజిల్ దొంగలించి అమ్ముకుంటున్నట్లు యజమానులకు సమాచారం అందింది. దీంతో గురువారం మధ్యాహ్నం అద్దంకి పట్టణంలోని మేదరమెట్ల రోడ్డులో టిప్పర్‌ల యజమానులు, డ్రైవర్‌లు వాగ్వివాదానికి దిగారు. సీఐ సుబ్బరాజు వారిని హెచ్చరించి పంపించివేశారు.

అవీఇవీ

త్వరలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు : జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో త్వరలో రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ఆమేరకు గురువారం రాత్రి ఒక ప్రకటనను విడుదల చేశారు. ధాన్యం సేకరించేందుకు 27 మండలాల్లోని 249 రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో 2024-25 రబీసీజన్‌లో రైతులు 32,425 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారని, 76,397 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారన్నారు. జిల్లాలో పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. గ్రేడ్ ఎ రకం మద్దతు ధర క్వింటా రూ.2,320, సాధారణ రకం మద్దతు ధర క్వింటా రూ.2,300లకు కొనుగోలు చేస్తామని, జిల్లాలోని రైతులు తాము పండించిన వరి ధాన్యానికి బహిరంగ మార్కెట్లో ధర ఎక్కువగా ఉంటే విక్రయించుకోవచ్చని తెలిపారు. ఒకవేళ బహిరంగ మార్కెట్లో ధర కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉంటే రైతులు తమ పంటను కొనుగోలుకేంద్రాల ద్వారా మద్దతు ధరకు అమ్ముకోవచ్చని జేసీ వెల్లడించారు.

వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియారిటీ జాబితాలు

- 9 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఒంగోలు విద్య, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాలను ప్రకాశం స్కూలు ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ సమాచారం ఆధారంగా ఈ జాబితాలను తయారు చేశామని పేర్కొన్నారు. జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 9వ తేదీలోపు తెలియజేయాలని ఆయన కోరారు. అభ్యంతరాలపై ఆధారాలతో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని డీఈవో తెలిపారు.

'పనిచేయనవి మాకెందుకు'?

- సెల్‌ఫోన్లను అధికారులకు తిరిగి అప్పగించిన అంగన్వాడీలు


సెల్‌ఫోన్లు తిరిగి ఇచ్చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఒంగోలు నగరం, ఏప్రిల్ 3 : "ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఇచ్చిన ఫోన్లు ఏమాత్రం ఉపయోగపడటం లేదు.. 11 రకాల రిజిష్టర్లకు చెందిన వివరాలను యాప్‌లో నమోదు చేయాలి.. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన బీఎస్ 20 వర్షన్ యాప్ ద్వారా ఉదయం, సాయంత్రం ఫేస్ రికగ్నిజేషన్ చేయాల్సి ఉంది. మూడేళ్ల క్రితం ఇచ్చిన సెల్‌ఫోన్లలో ఈ యాప్‌లు పనిచేయటం లేదు. దీంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. పనిచేయని ఫోన్లు మాకెందుకంటూ" గురువారం సాయంత్రం జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లను పీడీ కార్యాలయంలో అప్పగించే కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టులకు చెందిన సెక్టారు నాయకులు ఈ ఫోన్లను పీడీ కార్యాలయానికి తీసుకువచ్చారు. పనిచేయని ఫోన్లు మాకెందుకు అంటూ తిరిగి అప్పగించారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు యాప్‌లను సపోర్టు చేయకపోవటంతో తమ సొంత ఫోన్లతో పనిచేస్తున్నారని యూనియన్ నాయకులు చెప్పారు. తాము ఇబ్బంది లేకుండా పనిచేసేందుకు, కేంద్రాలను సక్రమంగా నడిపేందుకు 5జీ సెల్‌ఫోన్లను అందజేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, మాకొండయ్య, యూనియన్ నాయకులు ఎం.ధనలక్ష్మి, ఎల్లమ్మ, శేషమ్మ, మధుర పోలమ్మ, శోభ మల్లేశ్వరి, రమాదేవి, ప్రభావతి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఇక 'గుండె' పదిలం...


కార్పొరేట్ ఆసుపత్రి తరహాలో నిర్మించిన క్యాథ్ ల్యాబ్ వార్డు

(5వ పేజీ తరువాయి)
అందించనున్నారు.

- గుంటూరుకు వెళ్లే అవసరం లేదు

ఒంగోలు జీజీహెచ్‌లో క్యాథరైజేషన్ ప్రయోగశాలను(క్యాథ్ ల్యాబ్) ఏర్పాటుకు మెషిన్‌లు అందుబాటులోకి తీసుకొచ్చారు. జీజీహెచ్‌లో ఒక కార్డియాలజిస్ట్, సాంకేతిక నిపుణుడు, ఇద్దరు టెక్నీషియన్లు, ఎనిమిది మంది ఈసీజీ సాంకేతిక నిపుణులు ఉన్నప్పటికీ యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ స్టంట్ ఇంప్లాంటేషన్ వంటి అధునాతన వైద్య శస్త్ర చికిత్సలకు అధునాతన సామగ్రి లేనందున ఇన్నాళ్లూ గుంటూరు జీజీహెచ్‌కు హృద్రోగులను పంపేవారు. ఈసీజీ నుంచి 2డీఎకో, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీ, స్టంట్ ఇంప్లాంటేషన్ వంటి అధునాత వైద్య సేవలతోపాటు అవసరమైన వారికి గుండె ఆపరేషన్లు జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఎండ.. గాలి.. వాన..

(5వ పేజీ తరువాయి)
మూడు గంటల తర్వాత చల్లటి గాలులు వీచి పలుచోట్ల జల్లులు పడ్డాయి. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో పలుచోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటల సమయానికి ఎర్రగొండపాలెంలో 39.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా పెద్దారవీడు మండలం స్థానికవరంలో 25.25, ఎర్రగొండపాలెం మండలం కొలుకలలో 22.75, గోళ్లముడిపిలో 15.0 మిల్లీమీటర్లు నమోదైంది. కనిగిరి, దర్శి, కొనకనమిట్ల, దోర్నాల, పామూరు, దొనకొండ, పొదిలి, తర్లుబాడు తదితర మండలాల్లోనూ మధ్యాహ్నం తర్వాత వాతావరణం మారడంతో పాటు జల్లులు పడ్డాయి. ఒకటి రెండు రోజులు ఇలాంటి వాతావరణమే ఉండవచ్చని తెలుస్తోంది. జిల్లాలో తూర్పు ప్రాంతంలో కూడా సాయంత్రం ఎండ తీవ్రత తగ్గి చల్లబడింది.

కూలీల ఆటోను ఢీకొన్న పొట్టు లారీ

- ఐదుగురు మహిళా కూలీలకు గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కూలీలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా పొట్టు లారీ ఢీకొనటంతో 5గురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి మండలం ధర్మవరానికి చెందిన మహిళా కూలీలు ఆటోలో మిర్చి కోతలకు అద్దంకి వైపు వస్తున్నారు. పట్టణం సమీపంలోని కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీల వద్ద గురువారం ఉదయం ఎదురువస్తున్న పొట్టు లారీ అంచు బయటకు ఉండటంతో కూలీల ఆటోను తగిలింది. ఆటోలో ఉన్న నాగిపోగు మరియమ్మ, జంగ్రాజుపల్లి కోటేశ్వరమ్మ, ఎం. మరియమ్మ, బిరుదు చిట్టెమ్మ, మురికిపూడి శ్రీదేవిలకు గాయాలు కావటంతో అటు వైపు వస్తున్న మరో ఆటోలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగిపోగు మరియమ్మ, జంగ్రాజుపల్లి కోటేశ్వరమ్మలను ఒంగోలు తరలించారు.

పరిహారంలో పంగనామం



రోడ్డు నిర్మాణం చేయకుండా వదిలివేయటంతో పెరిగిన చిల్లచెట్లు

మేదరమెట్ల-నార్కెట్‌పల్లి (నామ్) రోడ్డులో అసంపూర్తి పనులు దశాబ్దకాలంగా అడుగుముందుకు పడలేదు. సుమారు 15 ఏళ్లుగా పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తూనే ఉన్నారు. రాష్ట్ర విభజన జరగక ముందు 2010 జూలైలో హైదరాబాద్-విజయవాడ హైవేకు లింక్‌గా నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లి నుంచి అద్దంకి మీదుగా మేదరమెట్ల వద్ద చెన్నై-కోల్‌కత్తా హైవే వరకు కలిపేలా సుమారు 212 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.



టోల్ రోడ్డు ముగిసినట్లు ఏర్పాటు చేసిన బోర్డు

పదేళ్ల నుంచి టోల్ మాత్రం పకడ్బందీగా వసూళ్లు

2014 సంవత్సరం నాటికి సుమారు 190 కి.మీ మేర పనులు పూర్తికావటంతో నల్గొండ జిల్లా మాడుగులపల్లి, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తుమ్మలచెరువు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏల్చూరు వద్ద టోల్ గేట్‌లు ఏర్పాటుచేశారు. సుమారు దశాబ్దకాలంనాడు టోల్ గేట్‌లు ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి టోల్ ఫీజు వసూలు చేస్తున్నారు. అనంతరం పలు సందర్భాలలో 13.425 కిలోమీటర్ల దూరం పనులు పూర్తి చేశారు. మొత్తమ్మీద సుమారు ఎనిమిదిన్నర కిలోమీటర్ల దూరం పనులు నిలిచిపోయాయి. అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)


రోడ్డు మూసి వేసి ఏర్పాటు చేసిన డైవర్షన్

మేదరమెట్ల-నార్కెట్‌పల్లి హైవే పనులూ 15 ఏళ్లుగా అసంపూర్తే

- రోడ్డు ప్రారంభించాకే పలుచోట్ల వదిలేసిన పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు
- టోల్ ఫీజులు వసూలు ప్రారంభించి దశాబ్దకాలం
- రైతులకు ఇంకా చెల్లించని నష్టపరిహారం


రెండురోడ్లలో వెళ్లాల్సిన వాహనాలు ఒకే రోడ్డులో ఎదురెదురుగా ప్రయాణం

'అద్దంకి'లోనే సింహభాగం నిలిచిన పనులు..

నామ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా నిలిచిపోయిన పనులలో అత్యధికశాతం అద్దంకి నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి. అద్దంకి పట్టణంతో పాటు అద్దంకి మండలం గోపాలపురం, చక్రాయపాలెం, సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. అద్దంకి పట్టణం మధ్య నుంచి వెళ్లే రోడ్డు తొలుత ప్రకటించిన అలైన్‌మెంట్ మార్పు చేసి పాత రోడ్డులోనే కొనసాగించారు. అదే సమయంలో గోపాలపురం, చక్రాయపాలెం, ఏల్చూరు వద్ద భూసేకరణ పూర్తికాకపోవడంతో రోడ్డు విస్తరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. గోపాలపురం వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టకుండా వదిలివేయటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అక్కడ వరకు వేగంగా వచ్చిన వాహనాలు గుంతల రోడ్డు, స్పీడ్ బ్రేకర్లు గుర్తించకుండా ముందుకు పోతుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అసంపూర్తిగా రోడ్డు వదిలివేసిన ప్రాంతంలో డైవర్షన్ బోర్డులు, టోల్ రోడ్డు ముగిసింది అని బోర్డులు పెట్టి వదిలేయడం గమనార్హం. ఆయా ప్రాంతాలలో కనీసం పూర్తి స్థాయిలో మరమ్మతులు కూడా చేపట్టకపోవటంతో వాహనచోదకులు మరింత ఇబ్బంది పడుతున్నారు.

మంత్రి హామీ ఇచ్చినా తొమ్మిది నెలల్నుంచి కదలని అధికారులు

సుమారు 14ఏళ్లుగా పరిహారం కోసం రైతులు ఎదురు చూస్తునే ఉన్నారు. పలు సందర్భాలలో పరిహారం కోసం రైతులు రోడ్డెక్కినా ఫలితం కనిపించలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతుల గోడు అసలు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకిలో నిర్వహించిన తొలి సమీక్షలో పరిహారం చెల్లింపుపై అధికారులు చొరవ తీసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో రైతులలో ఆశలు చిగురించాయి. 9 నెలలు అయినా అధికారులలో మాత్రం కదలిక రాలేదు. దీంతో రైతులకు ఎదురు చూపులే మిగిలాయి. ఇప్పటికైనా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మరింత చొరవ తీసుకొని రైతులకు పరిహారం చెల్లించడంతో పాటు అసంపూర్తి రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

---

600 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

రంగంలోకి దిగిన సబ్ కలెక్టర్

కంభం గోడౌన్‌కు బియ్యం తరలింపు


బియ్యంతో స్వాధీనం చేసుకున్న లారీ

బేస్తవారపేట,ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట జంక్షన్‌లో 600బస్తాల రేషన్‌బియ్యంతో ఉన్న లారీని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ పట్టుకున్నారు. లారీ ద్వారా బియ్యం తరలిపోతున్నట్లు తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు నేదురుమల్లి జయరాజ్ సబ్ కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెను వెంటనే ఆయన బేస్తవారపేట చేరుకొని లారీని, బియ్యంను సీజ్ చేశారు. నంద్యాల ప్రాంతం నుంచి సుమారు 600 బస్తాల ప్రభుత్వ బియ్యం లారీ ద్వారా బేస్తవారపేటలోని ఒక రైస్ మిల్లులో రిసైక్లింగ్ చేసి తమిళనాడు ప్రాంతానికి తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ లారీని నిలిపి వివరాలు సేకరించగా నంద్యాల ప్రాంతంలో బియ్యం కొనుగోలు చేసి వాటిని బేస్తవారపేటలో రీసైక్లింగ్ చేసి పంపుతున్నామని బియ్యం తరలిస్తున్న నిర్వాహకులు చెప్పారు. దీంతో అందుకు సంబంధించిన బిల్లులు సక్రమంగా లేకపోవడంతో బియ్యం,లారీని సీజ్ చేసి కంభం గోడౌన్‌కు తరలించారు.ఈ దాడిలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ వెంట ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ రామనారాయణరెడ్డి,తహసీల్దార్ జిత్రేంద,సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌ఆర్‌ఎం స్కూలు విద్యార్థులకు అవస్థలు

ఏటా పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం సమయంలో ఇబ్బందులు

టెంట్ల కింద చదువులు

పరీక్షలు రాసేదెలా

ఒంగోలువిద్య, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం అన్న సామెతగా ప్రతి ఏటా పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సమయంలో ఈ పాఠశాల విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. అక్కడ గురువారం నుంచి మూల్యాంకనం ప్రారంభమైంది. పాఠశాలలో 6నుంచి 9 తరగతులు చదువుతున్న 400 మందికి పైగా విద్యార్థులు సంతపేట రైలు పట్టాల వద్ద ఉన్న మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. ఆ పాఠశాలలో విద్యార్థులు కూర్చొనేందుకు తరగతి గదులు లేకపోవడంతో ఆవరణలో షామియానాలు వేసి కూర్చోబెట్టారు. విద్యార్థులు ఎక్కువ మంది కావడంతో అక్కడే కిక్కిరిసి కూర్చున్నారు. షామియానాలు కావడంతో ఎండవేడిమి, ఉక్కపోతకు ఇబ్బందులుపడ్డారు. ఈనెల 7నుంచి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చొనేందుకు సరిపోని స్థలంలో పరీక్షలు రాయడం ఎలా అని వారు వాపోతున్నారు. విద్యార్థుల కోసం టెంట్లు వేసినా అవి సరిపోకపోవడంతో కొందరు ఎండలోనే కూర్చున్నారు. కిక్కిరిసిన వాతావరణంలో మధ్యాహ్న భోజనం తినేందుకు కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విద్యార్థులకు అన్ని వసతులు ఉన్న పాఠశాలకు తరలించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.


చాలీచాలని షామియానాల కింద విద్యార్థులు

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఎస్పీ ఏఆర్ దామోదర్

పలు స్టేషన్‌ల తనిఖీ

కనిగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. గురువారం స్థానిక సీఐ, డీఎస్పీ కార్యాయాలతో పాటు కనిగిరి, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల పోలీసు స్టేషన్‌లను తనిఖీ చేశారు. అనంతరం కనిగిరిలో పోలీసు సిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. టెక్నాలజీపై అవగాహన పెంపోం దించుకోవాటంతో పాటు వృత్తిపరంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీసుశాఖపై నమ్మకం, గౌరవం పెంచాలన్నారు. పెండింగ్, ప్రత్యేక కేసులపై డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్‌కు తగు సూచనలు చేశారు. ఆసమయంలో డీఎస్పీ కార్యాలయం ముందుగా వెళ్తున్న జడ్పీ హైస్కూల్ విద్యార్థినులతో ఎస్పీ కొద్దిసేపు ముచ్చటించారు. క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకోవాలని సూచించారు.



డీఎస్పీ కార్యాలయంలో అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ దామోదర్

అనంతరం స్థానిక సర్కిల్ కార్యాలయం, పీఎస్‌లను సందర్శించిన ఎస్పీ దామోదర్ హెచ్‌ఎంపాడు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లను సందర్శించిన ఎస్పీ సిబ్బందికి చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల పూర్వాపరాలపై విచారించారు. హెచ్‌ఎంపాడు పోలీస్ స్టేషన్‌ను కనిగిరి నుంచి తరలించాలని మండల ప్రజలు, నాయకులు ఎస్‌టీఆర్ ఆధ్వర్యంలో ఎస్పీని కలసి కోరారు. దీంతో ఎస్పీ దామోదర్ హనుమంతునిపాడు గ్రామానికి వెళ్ళి పరిశీలించారు. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే కనిగిరి నుంచి పీఎస్‌ను హనుమంతునిపాడుకు తరలిస్తామని హామీ ఇచ్చారు. సందర్శించిన ప్రతి పీఎస్‌లో ఎస్పీ మొక్కలు నాటారు.

గురువారంవేకువజామున స్థానిక కాస్మోపోలిటన్ క్లబ్‌లో ఎస్పీ టెన్నిస్ ఆడారు. స్థానిక సాయిబాబా దేవాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సీఐ ఖాజావలి, ఎస్‌ఐలు టి. శ్రీరాం, మాధవరావు, సిబ్బంది, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాల మేరకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఈబీసీ, కాపు కార్యాచరణ ప్రణాళిక కింద బ్యాంక్‌లకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో బీసీ కార్పొరేషన్, బ్యాంకుల అధికారులతో గురువారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద మంజూరు చేసిన యూనిట్లను గ్రౌండింగ్ చేయాలన్నారు. స్వయం ఉపాధి పథకాల కింద 1,864 యూనిట్లను మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను ఆయా బ్యాంకులకు పంపినట్లు చెప్పారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈనెల 9వ తేదీలోపు సుమారు వెయ్యి యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. ఈనెల 11న జ్యోతిరావుపూలే జయంతి రోజున సంబంధిత లబ్ధిదారులకు యూనిట్స్ మంజూరు ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని బీసీ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం రమేష్, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

హత్య చేసి నేలబావిలో పడేశారు

అర్జున్ రెడ్డి మృతదేహాన్ని గుర్తించిన బంధువులు

వివాహేతర సంబంధమే హత్యకు కారణం!

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా మారాడని పథకం ప్రకారం భర్తను భార్యతోపాటు ఆమె ప్రియుడు హత్య చేసి నేలబావిలో మృతదేహాన్ని పడేశారు. ఒంగోలు నగరం నుంచి దశరాజుపల్లి వెళ్లే రోడ్డులో అప్పాయికుంట సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ముళ్లపొదల్లో ఈ ఘాతుకం చోటుచేసుకుంది. ఒంగోలురూరల్ మండలం పాతపాడుకు చెందిన మూరబోయిన అర్జున్‌రెడ్డి(55)ను హత్యకు గురయ్యాడు. గురువారం ఉదయం నిందితుడు రమేష్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు బావిలో ఉన్న మృతదేహాన్ని పోలీసులు వెలికితీశారు. మృతదేహం అర్జున్‌రెడ్డిదిగా మృతుడి కుమార్తెలు, కుమారుడు గుర్తించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పథకం ప్రకారమే హత్య...

పాతపాడుకు చెందిన కావూరి రమేష్‌రెడ్డి, అర్జునరెడ్డి భార్య మధ్య 20 ఏళ్లగా వివాహేతర సంబంధం ఉంది. ఐదునెలల నుంచి అర్జున్‌రెడ్డిని అడ్డుతొలగించుకోవాలని వారిద్దరూ పథకం రూపొందించారు. గత నెల 19న పాతపాడు నుంచి అర్జున్ రెడ్డి ఆటోలో ఒంగోలు బయలుదేరాడు. ఆయన వెనకనే రమేష్‌రెడ్డి మోటార్ సైకిల్‌పై వచ్చాడు. కరవది వరకు వచ్చిన తరువాత ఆటో ఆపి అర్జున్‌రెడ్డిని మోటర్ సైకిల్ ఎక్కించుకున్నాడు. ఆ తర్వాత ఒంగోలు నగరంలో కొత్తపట్నం బస్టాండ్ వద్దకు వచ్చి అక్కడ మద్యం కొనుగోలు చేశారు. అక్కడ నుంచి అప్పాయికుంటకు వెళ్లే దారిలో వాలీబాల్ కోర్టు సమీపంలో ముళ్లపొదల్లోకి వెళ్లారు. అర్జున్ రెడ్డితో మద్యం తాగించిన రమేష్‌రెడ్డి తనతో తెచ్చిన పురుగుల మందును చెవులో పోశాడు. అపస్మారక స్థితికి వెళ్లిన అర్జున్‌రెడ్డి కణత మీద బండరాయితో మోదాడు. అతను మృతి చెందాడని నిర్ధారించుకున్నాక.. అప్పటికే పాతపాడు నుంచి ఒంగోలు వచ్చిన అర్జున్ రెడ్డి భార్యకు ఈ విషయం చెప్పడంతో ఆమె కూడా అక్కడకొచ్చింది. వారిద్దరూ కలిసి మృతదేహాన్ని నేలబావిలో పడవేసినట్లు రమేష్‌రెడ్డి పోలీసుల విచారణలో చెప్పినట్లు సమాచారం.


మృతదేహాన్ని పడేసింది ఈ బావిలోనే...


అర్జున్‌రెడ్డి(ఫైల్)


మృతదేహం పడేసిన బావి వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

నిందితులను అదుపులోకి తీసుకున్నాం

ఒంగోలు తాలుకా సీఐ అజయ్ కుమార్

గత నెల 29న అర్జున్ రెడ్డి సోదరుడు వెంకటేశ్వరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసుగా నమోదు చేశామని తెలిపారు. అర్జున్ రెడ్డి కనిపించిన రోజు నుంచి గ్రామంలో రమేష్ రెడ్డి, నిందితురాలు కనిపించచడం లేదన్నారు. దీంతో విచారణ ప్రారంభించి ఇరువురిని గురువారం అదుపులోకి తీసుకున్న తరువాత హత్య బయట పడిందని చెప్పారు. 2012లో కూడా రమేష్‌రెడ్డి.. భార్యను హత్య చేసిన కేసు తాలూకా పోలీసు స్టేషన్‌లో అతనిపై నమోదై ఉందన్నారు.

కలెక్టర్ అన్సారియాకు అభినందనలు



కలెక్టర్ అన్సారియాకు బొకే అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బంగారు బాల్యం కార్యక్రమానికి స్కోచ్ అవార్డు అందుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియాను ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు కలెక్టర్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాసయాదవ్, భూపాల్‌రెడ్డి, రజిత, మానస, నగర అధ్యక్షుడు శ్రీనివాసరావు, శ్రీకాంత్‌రెడ్డి, బాబురావు, గౌరీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- స్కోచ్ అవార్డును అందుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియాను మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సృజన్‌మాదిగ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సమితి నాయకులు కొలకలూరి విజయ్‌కుమార్, పత్రా బంగారం, రావినూతల జయకుమార్, మంద సుధాకర్, వంశీ, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల గుర్తింపునకు సర్వే

మద్దిపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలో అట్టడుగున్న ఉన్న 20 శాతం మంది పేద కుటుంబాలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ గురువారం తెలిపారు. ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే ఈ సర్వే రెండు దశలుగా జరుగుతుందని, సచివాలయ సిబ్బంది 27 ప్రశ్నలతో కూడిన సర్వే చేస్తారన్నారు. ఈ విధంగా గుర్తించిన వారిని అత్యధిక ఆదాయం కలిగిన 10 శాతం కుటుంబాల సహకారంతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తారన్నారు. సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పరిశీలకులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని గుడివాడలో ఈనెల 11వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. గురువారం ఒంగోలులోని భారతీయ వ్యాయామ కళాశాలలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా నిర్వహించిన ఎంపిక పోటీలలో పలువురు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా భాస్కర్‌రావు, డీఎస్‌డీవో రాజేశ్వరీ, పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్, కార్యదర్శి భక్తధృవుడు, ఉపాధ్యక్షులు పవన్‌కుమార్, ఆర్టీవో సుశీల అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తులు

ఒంగోలు నగరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అత్యాచార కేసులు, వాటి నివారణ కోసం ఏర్పాటు చేయబోతున్న విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారిత అధికారి ఎం.లక్ష్మానాయక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కమిటీలో ఎస్సీఎస్టీ వర్గాలకు చెందిన నాన్ అఫిషియల్ సభ్యులు ఐదుగురు, ఎన్‌జీవో సంఘాలకు చెందిన ముగ్గురు సభ్యులుగా ఎంపిక చేస్తారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ వర్గాల్లో సామాజిక సేవా దృక్పథం, పౌర హక్కుల చట్టం, అత్యాచార నిరోధక చట్టాల పట్ల అవగాహన కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు చేపట్టిన సాంఘిక సేవా కార్యక్రమాల వివరాలను తగిన ఆధారాలను దరఖాస్తుతో పాటు జత చేయాలని సూచించారు. దరఖాస్తులో విద్యార్హత, కులం, నివాసం, నిరుద్యోగ, సాంఘిక సేవా కార్యక్రమాల వివరాలను ఈ నెల 15వ తేదీలోగా ఒంగోలులోని ప్రగతిభవన్‌లో గల సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని కోరారు. కమిటీలో సభ్యులుగా ఎంపికైన వారికి ప్రభుత్వం ఎలాంటి గౌరవ వేతనం అందజేయదని పేర్కొన్నారు.

రేపు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలు

ఒంగోలునగరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ 118వ జయంతి కార్యక్రమాలను ఈ నెల 5వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎం.లక్ష్మానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం ఒంగోలు నగరం నెల్లూరుబస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. 10.40 గంటలకు స్థానిక అంబేడ్కర్‌భవన్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం సభ జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సంఘాల నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

గుణాత్మక విద్యను బోధించాలి

మద్దిపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన నూతన విద్యా విధానం అమలు చేసేందుకు పాఠశాల నిర్వహణ కమిటీ యాజమాన్యాలు సహకరించాలని ఎంఈవో ఎంవీఆర్.ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం మద్దిపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుణాత్మక విద్య అందించేందుకు ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక్కొక్క ఉపాధ్యాయుని నియమిస్తుందని, మండలంలో 8 పాఠశాలల నిర్వహణ కమిటీలు సహకరించాలని, దీనివల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలు పలువురు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రాయితీలపై హోటల్స్ అసోసియేషన్ హర్షం

● సీఎం చంద్రబాబుకు అధ్యక్షుడు ఆర్‌వీ.స్వామి ధన్యవాదాలు

గుణదల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు హోటల్ రంగానికి రాయితీలు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ.స్వామి తెలిపారు. విజయవాడలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏటా రూ.66లక్షలు ఎక్సైజ్ సుంకం చెల్లిస్తున్నామని, దానికి తగ్గట్లుగా హోటల్ వ్యాపారాలు ఉండకపోవడంతో నష్టం వస్తోందన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో స్టార్ హోటల్స్ చెల్లిస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని రూ.66 లక్షల నుంచి రూ.25లక్షలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. హోటల్ రంగానికి మరిన్ని రాయితీలు ఇస్తుండటంతో ఏపీలో స్టార్ హోటల్స్ ఏర్పాటు చేసేందుకు పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 54 స్టార్ హోటల్స్ ఉన్నాయని, త్వరలోనే ఏపీలో 50 వేల రూమ్‌ల నిర్మాణం జరగాలన్న పట్టుదలతో ముఖ్యమంత్రి పర్యాటక శాఖకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. గేట్‌వే హోటల్ అధినేత రాజయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా ఐటీ కంపెనీలు పెరగాల్సి ఉందని, తద్వారా టూరిజం అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. సముద్ర తీరం వెంబడి రిసార్ట్స్ ఏర్పాటుకు అనుకూల వాతావరణం ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెడితే దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉండటం ఖాయమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై యువత దృష్టి పెట్టాలని గ్రీన్ హోటల్ అధినేత గోకరాజు గంగరాజు అన్నారు. చంద్రబాబు టూరిజంపై రాయితీలు ప్రకటించిన నేపథ్యంలో అమరావతిలో 17 స్టార్ హోటల్స్ రానున్నాయని తెలిపారు. అర్ధరాత్రి 12 గంటల వరకు హోటల్స్ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరడంతో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు సానుకూలంగా స్పందించి అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఈ తరహాలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉంటే తాము ఏపీ అభివృద్ధికి మరింతగా చేయూత ఇవ్వగలమని వెల్లడించారు.

మొక్కజొన్నకు 'మద్దతు' కరువు

పంట చేతికొచ్చే సమయంలో ధర పతనం ● మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతుల వినతి



పల్లామల్లిలో మొక్కజొన్నలను ఆరబోస్తున్న రైతు

చీమకుర్తి, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చిన సమయానికి ధర రోజురోజుకు దిగజారుతుండటంతో మొక్కజొన్న పంటను పండించిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళారులు రంగప్రవేశం చేయటంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా తక్కువకు ధర పడిపోయింది. కందులను మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావటంలో జాప్యం జరుగుతుండటం దళారులకు వరంగా మారింది. మొక్కజొన్నలు కొనుగోలుకు మార్కెట్‌లో అంతగా డిమాండ్ లేదంటూ రైతులను మభ్యపెడుతూ అవకాశాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. పంట చేతికొచ్చిన తర్వాత నిల్వ చేయటం కష్టంగా మారటంతో రైతులు చేసేదేమి లేక మద్దతు ధర కన్నా తక్కువ రేటుకే అమ్ముకొంటున్నారు. దీనికి తోడు రాబోయే రెండురోజుల్లో వర్షం పడుతుందని వాతావరణశాఖ నుంచి వస్తున్న వార్తలు మొక్కజొన్న రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. పంట చేలో ఆరబోసిన ధాన్యాన్ని వర్షం పడితే తడవకుండా చేయటం కష్టమని రేటు తగ్గినా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చీమకుర్తి మండలంలో పల్లామల్లి, గాడిపర్తివారిపాలెం, నేకునంబాదు, ఇలపావులూరు, గోనేపల్లివారిపాలెం తదితర గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో మొక్కజొన్న పంటను రబీ సీజన్‌లో ముందస్తుగా సాగు చేశారు. ఈ పంటకు ఇపుడు కోత సమయం ఆసన్నమయి ముమ్మరంగా కోతలు సాగుతున్నాయి. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషంగా ఉన్న రైతులకు రోజురోజుకు దిగజారుతున్న ధర దిగాలు రేపుతోంది. వచ్చే లాభాలు కాస్తా కళ్ల ముందే ఆవిరి అవుతుండంతో విచారం వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్నకు ప్రభుత్వం మద్దతు ధరగా రూ.2,225ను నిర్ణయించారు. ఇటీవల వరకూ మద్దతు ధరకు పైనే కొనుగోలు జరిగాయి. కాని వారం రోజుల నుంచి ధర తగ్గుతూ వచ్చి ప్రస్తుతం రూ.2050కు అటుఇటూగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అదీ తేమశాతం అంటూ వంకలు పెడుతుండటమే కాకుండా కొనుగోలు చేసిన తర్వాత రైతుకు డబ్బులు ఇవ్వటానికి వారంరోజులకు పైగా గడువు పెడుతుండటం గమనార్హం. మార్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన కందులకు మద్దతు ధర ఇవ్వటమేకాక 48గంటలలోనే నగదును రైతుల ఖాతాలో జమ చేస్తున్నారు. మొక్కజొన్నలను కూడా ఇదేరీతిలో కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి మండల వ్యవసాయశాఖాధికారి భాస్కర్‌ను వివరణ కోరగా.. మొక్కజొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయుటకు అనుమతి కోసం ప్రభుత్వానికి ఉన్నతాధికారులు నివేదించారని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కొనుగోలు ప్రక్రియ చేపడతామని చెప్పారు.

పెన్షనర్ల వర్గీకరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

● బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లను వర్గీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఎన్‌సీసీపీఏ పిలుపు మేరకు గురువారం ఒంగోలులోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పెన్షనర్లను వర్గీకరించడం దుర్మార్గమని, దీనివల్ల రిటైర్డ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు. 2017నుంచి పెండింగ్‌లో ఉన్న పెన్షన్ రివిజన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందితే ముందుగా రిటైర్డ్ అయిన ఉద్యోగులకు తీవ్ర నష్టమని, అందువల్ల ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఐబీఎస్ఎన్ఎల్‌పీడబ్ల్యూఏ అసోసియేషన్ చీఫ్ అడ్వయిజర్ కె.అంజయ్య, అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, ఎన్.వెంకటరావు, పి.వెంకటయ్య, ఎన్.బాలసుబ్రహ్మణ్యం, ఆరోగ్యం, కేవీ.రమణయ్య, జేసీహెచ్.యలమంద, ఐ.శ్రీనివాసరావు, ఓవీ.సుబ్బారావు, ఎన్ఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎస్.అబ్దుల్‌రౌఫ్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీసర్వే

● తహసీల్దార్ మురళి



అనకర్లపూడిలోని సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మురళి



కరవదిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీటీ శ్రీనివాసరావు, రైతులు

కొండపి, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పారదర్శకంగా పరిష్కరించేందుకే ప్రభుత్వం రీసర్వే కార్యక్రమం చేపట్టిందని తహసీల్దార్ పి.మురళి పేర్కొన్నారు. మండలంలోని అనకర్లపూడి సెంటర్‌లో గురువారం రైతులు, గ్రామస్థులతో జరిగిన రీసర్వే అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు రీసర్వే జరిగేటపుడు తప్పనిసరిగా భూములకు సంబంధించిన పాస్ పుస్తకాలు, ఆధార్ నంబరు, ఫోన్ నంబరు, ఫొటో తీసుకువచ్చి అధికారులకు ఇవ్వాలన్నారు. అదేవిధంగా చనిపోయిన పట్టాదారు వారసులు భాగపంపిణీ చేసుకుని వెంటనే ఆన్‌లైన్‌లో పేరుమార్పునకు నమోదు చేసుకోవాలని సూచించారు. సర్వే కార్యక్రమాన్ని ఎప్పటికపుడు గ్రామంలోని రైతులకు వాట్సాప్ గ్రూప్ మెసేజ్‌లు, ఇతర మార్గాల ద్వారా సమాచారం అందిస్తామని తహసీల్దార్ తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సదస్సులో రీసర్వే డీటీ కాశయ్య, మండల సర్వేయర్ రాజు, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, వీఆర్వో జి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు కొర్రపాటి వసంతరాయుడు పాల్గొన్నారు.

రీసర్వే చేయించుకోవాలి

ఒంగోలు(రూరల్): రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, తగిన ఆధారాలతో తమ భూములను రీసర్వే చేయించుకోవాలని డీటీ శీలం శ్రీనివాసరావు కోరారు. గురువారం ఒంగోలు మండలం కరవదిలో భూరీసర్వేపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ రీసర్వేతో భూముల కొలతలు సక్రమంగా వస్తాయన్నారు. రీసర్వే అనంతరం కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఐవోఎస్ ఎస్.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ విష్ణువర్ధన్, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

● జేసీకి చేజర్ల రైతుల వినతి



జేసీ గోపాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): చేజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించినా కొనుగోళ్లలో వేగవంతం లేదని, దీంతో గ్రామంలో ధాన్యం నిల్వలు పేరుకుపోయి ఉన్నాయని, అందువల్ల ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈమేరకు గురువారం ఒంగోలులో జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చేజర్ల ఎత్తిపోతల పథకం కింద 600 ఎకరాలలో వరిపంట సాగు చేయగా ఇప్పుడు ధాన్యం ఇంటికి చేరిందన్నారు. గ్రామంలో 70నుంచి 80లారీల ధాన్యం నిల్వ ఉందని, వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. ఇటీవల చేజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారని, కానీ ఎలాంటి ఉపయోగం లేదని చెప్పారు. రోజుకు ఒక లారీ ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తే ఇంత కొనుగోలుకు ఎంత సమయం పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. అవసరమైతే రైస్‌మిల్లర్‌లను ఎక్కువ మందితో కొనుగోలు చేయించాలని కోరారు. అకాల వర్షం పడతే ఆరుబయట గల ధాన్యం తడిసి పోయో ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, రైతులు గద్దె వెంకటకృష్ణ, చేజర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

దిగజారిన బర్లీ పొగాకు ధరలు

● ఆవేదన వ్యక్తం చేస్తున్నరైతులు



మద్దిపాడులోని బర్లీ పొగాకు మండీ

మద్దిపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధరలు లేక రైతుల దిగాలు పడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు మరొకవైపు, వాతావరణం అననుకూల పరిస్థితులు, ఇదేకాక అధిక పెట్టుబడులు పెట్టి బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు మనోవేదకు గురవుతున్నారు. వెల్లంపల్లి వేలం కేంద్రం పరిధిలో దాదాపు పది వేల ఎకరాలు పైన బర్లీ పొగాకును సాగు చేశారు. గతంలో బర్లీ పొగాకు ఒక మోస్తరు రేటు పలకడంతో రైతులు విస్తారంగా ఈ పంటను సాగు చేశారు. గతంలో క్వింటా రూ.18వేలు ధర పలికటంతో అధిక రేట్లతో భూములు కౌలుకు తీసుకుని బర్లీ పొగాకు సాగు చేశారు. అయితే ప్రైవేటు పొగాకు కంపెనీ యాజమాన్యం మాత్రం రూ.11వేల నుంచి రూ.14వేల ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఖర్చులు విపరీతంగా పెరిగి గిట్టుబాటు ధర రాకపోవడంతో అందిన కాడికి అప్పులు తెచ్చి కౌలు చెల్లిస్తున్నారు. నాణ్యమైన పొగాకును కూడా కొనుగోలు చేయడం లేదు. దీంతో తెచ్చిన అప్పులు ఎలా తీరుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం చొరవ చూపి బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీల ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని బీమ్ సేవా సమితి, బీమ్ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ క్రికెట్ టోర్నీని గురువారం స్థానిక మంగమూరు రోడ్ లోని మర్రిచెట్టు వద్ద డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, డాక్టర్ బి.రవి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు కుల మతాల మధ్య ఉన్న అంతర్యాలను దూరం చేస్తాయన్నారు. మొదటి రోజు వెంగముక్కలపాలెం అంబేడ్కర్ టీమ్, అగ్రిగేటర్స్ టీమ్‌లు పోటీపడ్డాయి. కార్యక్రమంలో నిర్వాహకులు దాసరి కోటేశ్వరరావు, ఎం.ఆదినారాయణ, కమిటీ సభ్యులు పి.శ్రీనివాసులు, ఎస్.కృపారావు, ఆర్.వల్లారయ్య, అంగలకుర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో రజక సంఘం రాష్ట్ర మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 20, 21 తేదీల్లో జరగనున్న రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం టంగుటూరి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ పట్టణాల్లో రజకుల కనీస వేతన చట్టం అమలు, ఇస్త్రీ రేట్లు పెంపు, ఆధునిక దోబీగాట్లు నిర్మాణం, దోబీ పోస్టుల భర్తీ, సాంఘిక న్యాయం, సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు, భూపంపిణీ, ఇళ్ల స్థలాల పంపిణీ వంటి అంశాలపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. జిల్లాలోని రజకులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంద రమణమ్మ, డాక్టర్ కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, మంచికలపాటి శ్రీనివాసరావు, చిట్యాల కొండయ్య, యోగమ్మ, పోలయ్య, యానాదిరావు, ఉప్పుగుండూరు శ్రీను, చీమకుర్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒడా చైర్మన్ పదవిని యాదవులకు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి అండగా ఉన్న యాదవులకు ఒడా చైర్మన్ పదవిని కేటాయించాలని యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. పార్టీ ఆవిర్భావం నుంచి యాదవులు అత్యధికంగా టీడీపీకి ఓట్లు వేస్తూ గెలుపులో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఒక ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని, ఎన్నికల ముందు టీడీపీలో కీలకంగా పనిచేసిన యాదవ సంఘం నాయకులకు నామినేటెడ్ పదవులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శ్రీహర్షిణి విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో దివీస్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 12 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. వారికి ఏడాది రూ.3.16లక్షల ప్యాకేజీ లభిస్తుంది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా విద్యార్థులకు డిగ్రీ పట్టాతో పాటు ఉద్యోగ ఆఫర్ లెటర్‌తో బయటకు పంపడం లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. తమ కళాశాలలో విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయంసాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ దాది అంజనేయులు, పీజీ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై వృద్ధుడి మృతి

ఒంగోలు క్రైం, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వృద్ధుడు ఒంగోలు రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాపై మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. సుమారు 60ఏళ్ళ గల వృద్ధుడు మృతి చెంది పడి ఉన్నాడు. ఈ మేరకు రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అరుణకుమారి తెలిపారు. వివరాలు తెలిసిన వారు తమకు తెలియజేయాలని ఆమె కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడి



మాట్లాడుతున్న ఏవో పావని

సంతనూతలపాడు, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే నాణ్యమైన అధిక దిగుబడి వస్తుందని ఏవో పావని తెలిపారు. గురువారం సంతనూతలపాడు వెలుగు కార్యాలయంలో వీవోఏలు, ఎన్యుమరేటర్లకు జరుగుతున్న జీనోపాధుల ప్రణాళిక శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను వివరించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం టి.బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

100మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సంతనూతలపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట సమీపంలోని పీర్లమాన్యంలో ఒంగోలు బెతాం నర్సింగ్‌హోమ్ డాక్టర్ ఎన్.ఉదయిని ఆధ్వర్యంలో మహిళ ఉద్యమ నాయకురాలు మోటూరు ఉదయం వర్ధంతి సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తొలుత ఉదయం చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం వందమందికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు షేక్ నాగూర్‌బి, రాజేశ్వరి, మస్తాన్, ఫరీదా, లక్ష్మీ, మస్తాన్‌బి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



వాటర్‌ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజశేఖరరావు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో కె.రాజశేఖరరావు ఆదేశించారు. ఒంగోలు మండలం దేవరంపాడు, బొద్దులూరివారిపాలెం గ్రామాల్లో ఎంపీడీవో, ఈవోఆర్డీ బాలచెన్నయ్యలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వాటర్‌ట్యాంక్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

అవీ..ఇవీ



మధుసూదన్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

సాహితీ కృషీవలుడు మధుసూదన్

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సాహితీకృషీవలుడు డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో విశ్వావసు ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతిష్టాత్మక సూర్యమ్మ స్మారక సాహితీ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్‌కు గురువారం సన్మానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత వయోజన విద్యా సంచాలకులు డాక్టర్ ఏవీరారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ మధుసూదన్ సాహిత్య రంగానికి ఎనలేని కృషి చేశారని, ఎంతో మంది సాహిత్య కళాకారులను ఒకేతాటిపై నడిపే ప్రయత్నం చేశారని కొనియాడారు. సన్మాన గ్రహీత మధుసూదన్ మాట్లాడుతూ తాను చిన్ననాటి నుంచి తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ సాహిత్య రంగంపై మక్కువ పెంచుకున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలకు అందించిన బీరువాలతో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

పెద్దదోర్నాల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వపు విద్యార్థులు గురువారం బీరువాలను అందించారు. 1981-82 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు ఇటీవల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ క్రమంలో తాము చదివిన పాఠశాలకు 20 వేల రూపాయల విలువ కలిగిన 2 బీరువాలను ప్రధానోపాధ్యాయురాలు అనసూయదేవికి అందజేశారు. అనంతరం ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు రావిక్రింది సత్యనారాయణ, సుదర్శన్, షేక్ కాశీం, పెరుమాళ్ల సత్యనారాయణ, గాదె బ్రహ్మారెడ్డి, ఈదర పెద్ద అంజనేయులు, శ్రీనివాసాచారి, ఎన్ కాశయ్య, సుబ్రహ్మణ్యం,ఉపాధ్యాయ సిబ్బంది నాగమూర్తి, రామానాయక్, చంద్రమౌళి పాల్గొన్నారు.



సుందరయ్య కాలనీవాసులకు
చట్టాల గురించి వివరిస్తున్న టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మార్కాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగిఉన్నప్పుడే నేర నియంత్రణ సాధ్యమవుతుందని మార్కాపురం టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు అన్నారు. స్థానిక సుందరయ్య కాలనీలో గురువారం నేర నియంత్రణ ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజమోహన్‌రావు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా రూపొందించిన చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. చట్టాలు, నియమాలు, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరి ధర్మం అన్నారు. మత్తు పదార్థాలు సేవించి గొడవలు చేయడం, సంఘ విద్రోహ శక్తులతో కలిసి పనిచేయడం లాంటివి తీవ్రమైన నేరాల కింద పరిగణిస్తామన్నారు. సైబర్‌క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలు చేసి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య కాలనీవాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రామాయణ కావ్యం గురించి పోటీ పరీక్ష రాస్తున్న మహిళలు

వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

గిద్దలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బద్వేల్ రోడ్డులోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి వారు నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా శ్రీరామాయణ కావ్యం నుంచి పోటీ పరీక్ష నిర్వహించగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రథమ బహుమతిగా రూ. 2వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 1500, తృతీయ బహుమతిగా 1000 రూపాయలు అందజేసినట్లు దేవస్థాన కార్యనిర్వాహక అధ్యక్షులు రాచపూటి నరసింహారావు తెలిపారు.

నేడు మండల సమావేశం

గిద్దలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ కడప లక్ష్మి అధ్యక్షతన తమ కార్యాలయంలో జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టేది?

వడ్డీపై రాయితీ ఇచ్చినా కొంతవరకే రాబడి

ఇంకా రూ.4.58 కోట్ల మేర బకాయిలు

సమస్యలతో అల్లాడుతున్న శివారు కాలనీలు

మార్కాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నుల వసూళ్లలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కాపురం మున్సిపాలిటీ వెనుకబడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం పన్నులపై రాబడిని పెంచేందుకు బకాయిలపై 50 శాతం మేర వడ్డీ రాయితీ ఇచ్చింది. అయినా వసూళ్లలో పెద్దగా మార్పు రాలేదు. గతేడాదితో పోల్చితే కొంతమేర మాత్రమే పన్నుల వసూళ్లు పెరిగాయి. గత వైసీపీ పాలనలో ఐదేళ్లు పన్నుల వసూళ్లపై పెద్దగా దృష్టిసారించింది లేదు. దీంతో మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయి. కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో పట్టణ ప్రజలు ఆదరించారు. వారి ఆశలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే తగినన్ని నిధులు అందుబాటులో ఉండాలి. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన నిధులతో మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైన్లు, పారిశుధ్యం, తాగునీటి నిర్వహణ తదితర పనులకు ఉపయోగించుకునే వెసులుబాటు ఉంది. మున్సిపాలిటీ యంత్రాంగం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించిన దాఖలాలు కనిపించలేదు.

60 శాతంలోపే పన్ను వసూలు

మార్కాపురం మున్సిపాలిటీలో మొత్తం 18,345 అసెస్‌మెంట్లు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం డిమాండ్ బకాయిలతో కలిపి రూ.11.20 కోట్లు పన్నులు వసూలు చేయాల్సిఉంది. కానీ మార్చి నెలాఖరుకు రూ.6.62 కోట్ల మేర మాత్రమే వసూలయ్యాయి. మొత్తం మీద 59.13 శాతం మేర వసూళ్లు సాధించారు. ఇంకా బకాయిలు రూ.4.58 కోట్ల మేర ఉన్నాయి. వాస్తవానికి గత ఐదేళ్లలో సక్రమంగా పన్నుల వసూళ్లు చేయక 2024-25 ఆర్థిక సంవత్సరానికి ముందు మొత్తం రూ.4.27 కోట్ల మేరకు బకాయిలు పేరుకుపోయాయి. వాటికి సంబంధించి ప్రత్యేక దృష్టిపెట్టామని మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం చెబుతున్నా వసూలు చేసింది రూ.1.21 కోట్లు మాత్రమే. పాత బకాయిలు ఇంకా రూ.3.06 కోట్లు వసూలు చేయాల్సిఉంది. పాత బకాయిల వసూళ్ల కోసం ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇచ్చినా 32 శాతం మేర మాత్రమే వసూలు చేయగలిగారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.6.93 కోట్లు డిమాండ్ ఉండగా రూ.5.41 కోట్లు వసూలు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించే రూ.1.52 కోట్ల మేర బకాయి పడినట్లు అయింది.



మార్కాపురం మున్సిపాలిటీ



భగత్‌సింగ్ కాలనీ సమీపంలో
డ్రైన్‌లేక రోడ్డుపైనే పారుతున్న మురుగు

రోడ్లు, డ్రైన్లు లేక శివారు కాలనీలు విలవిల

మార్కాపురం మున్సిపాలిటీలో ప్రధాన పట్టణం మినహా శివారు కాలనీల్లో పక్కా రోడ్లు, డ్రైన్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 12వ వార్డు మొదలుకొని 17వ వార్డు వరకు, 27వ వార్డు నుంచి 32 వార్డు వరకు, 2, 3వ వార్డుల్లో మౌలిక వసతులు మృగ్యంగా మారాయి. ఆయా వార్డుల్లో సుమారు 60 శాతం మేర పక్కా రోడ్లు, డ్రైన్లు లేవు. వాటి అభివృద్ధికి ప్రత్యేక నిధులు వచ్చే పరిస్థితి ప్రస్తుతం కనిపించడంలేదు. పన్నుల రూపంలో సక్రమంగా వసూళ్లు సాధిస్తే ఆయా వార్డుల్లో మున్సిపాలిటీ సాధారణ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెసులుబాటు కలిగేది. మున్సిపాలిటీ యంత్రాంగం నిర్లక్ష్యం ఫలితంగా పన్ను వసూళ్లు సక్రమంగా లేక అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవరోధం ఏర్పడుతోంది.

కంభం ఏఎంసీ చైర్మన్ పదవిపై సర్వత్రా ఆసక్తి

కంభం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంభం ఏఎంసీ చైర్మన్ ఎన్నికపై ప్రస్తుతం కూటమి నేతల్లో సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. నామినేటెడ్ పోస్టుల్లో భాగంగా ఉగాది పండుగకు గిద్దలూరు చైర్మన్ ఎంపిక జరుగగా కంభం ఏఎంసీకి ఎవరినీ ప్రకటించక పోవడం చర్చనీయాంశంగా మారింది. కంభం వ్యవసాయ మార్కె ట్ యార్డు పరిధిలో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఎంపికైన 5 మంది చైర్మన్లు కంభం, అర్ధవీడు మండలాలకు చెందిన వారే ఉన్నారు. దీనితో ఈసారి బేస్తవారపేట మండలానికి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా చేస్తారనే ప్రచారం సాగుతోంది. గత ప్రభుత్వంలో మార్కెడ్ యార్డుల అభివృద్ధికి ఎటువంటి నిధులు కేటాయించక పోవడం, చైర్మన్ లేక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. 2001-2002 వరకు అర్ధవీడుకు చెందిన టీడీపీ నాయకులు దండుగ వెంకటరెడ్డి, 2002-2007 వరకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే చప్పిడి వెంగయ్య కుమారుడు చప్పిడి రవిశేఖర్, 2007-2010 వరకు అర్ధవీడుకు చెందిన కాంగ్రెస్ నాయకులు బొగ్గు రామచంద్రరెడ్డి, 2015-16 వరకు కంభం మండలం జంగంగుంట్లకు చెందిన నెమలిదిన్నె చెన్నారెడ్డి, 2020-2022 వరకు తురిమెళ్లకు చెందిన వైసీపీ నాయకులు ఏలం వెంకటేశ్వర్లు మార్కెట్ కమిటీ చైర్మన్లుగా పని చేశారు. 2022 నుంచి ఇప్పటివరకు చైర్మన్ ఎన్నిక జరుగలేదు. గిద్దలూరు మార్కెట్‌యార్డు చైర్మన్‌గా బీసీకి చెందిన బి.బాలయ్యను ఎంపిక చేయడంతో కంభం ఏఎంసీ చైర్మన్‌గా ఓసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారిని ఎంపిక చేయవచ్చని భావిస్తున్నారు.



కంభం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం



నిరసన తెలుపుతున్న కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు

నూతన పే కమిషన్ బిల్లును ఉపసంహరించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు తీవ్ర నష్టం కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పే కమిషన్ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద బీఎస్ఎన్ఎల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయూనియన్ నాయకులు కె.శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా నూతన కమిషన్ బిల్లులో విశ్రాంత ఉద్యోగులకు వేతనాలకు సంబంధించి సవరణ లేకుండా చేయటం బాధాకరం అన్నారు. యూనియన్ నాయకులు కృష్ణారావు మాట్లాడుతూ.తమ హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐబీడీపీఏఎస్, ఎన్‌పీడబ్ల్యూఏ, ఏఐబీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు చెందిన ప్రతినిధులు షేక్ ఇమామ్, ఎం.హుస్మాన్ బేగ్, షేక్ సలీమ్, పి.శంకర్‌రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు అందె నాసరయ్య, జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవతవకలకు పాల్పడిన వారిపై చర్యలు

సామాజిక తనిఖీలో

డ్వామా పీడీ జోసఫ్ కుమార్

మార్కాపురం రూరల్, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులలో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ జోసఫ్ కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఉపాధి పథకంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డ్వామా పీడీ జోసఫ్ కుమార్‌కు సామాజిక తనిఖీ బృందం పనులు, వేతనాల చెల్లింపులను వివరించారు. ఈ సందర్భంగా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్‌లో చేసిన పనుల కొలతలలో కొన్ని గ్రామ పంచాయతీలలో వ్యత్యాసం వచ్చినట్లు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. గతంలో తీసిన గుంతలో వర్షపు నీరు నిల్వ ఉండటం వలన కూడా లోతు, పొడవు, వెడల్పులలో వ్యత్యాసం వచ్చాయని తెలిపారు. కొన్ని గ్రామ పంచాయతీలలో మస్టర్ రోల్‌లో కొట్టి వేతలు వేసి వేతన చెల్లింపులు జరిగినట్లు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. ఈ మధ్య కాలంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు మారడం వలన పాత ఫీల్డ్ అసిస్టెంట్‌లు రికార్డులను సక్రమంగా అందజేయకపోవడం కొంత సమస్యగా ఉందని తెలిపారు. మండల పరిధిలో 540 పనులకు గాను 10 కోట్ల 16 లక్షల 83 వేల 261 రూపాయలు కూలీలకు వేతనాలు, 1 కోటి 65 లక్షల69 వేల 613 రూపాయలు వర్కు మెటీరియల్ మొత్తం కలిపి 11 కోట్ల 82 లక్షల 52 వేల 874 రూపాయల పనులు 2023-2024 ఆర్థిక సంవత్సరంలో పనుల జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీడీ వండర్‌మాన్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఉద్యానశాఖ అధికారి రమేష్, ఏపీవో జీవరత్నం, సామాజిక తనిఖీ ప్రతినిధులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజా వేదికలో సామాజిక తనిఖీ సిబ్బంది చెబుతున్న
వివరాలను వింటున్న డ్వామా పీడీ జోసఫ్ కుమార్, అధికారులు



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రిస్టియన్లు

పాస్టర్స్ జేఏసీ శాంతి ర్యాలీ

గిద్దలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పలు అనుమానాలు ఉన్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని కోరుతూ పాస్టర్స్ జేఏసీ ఆధ్వర్యంలో గిద్దలూరులో శాంతిర్యాలీ నిర్వహించారు. క్రిస్టియన్ జేఏసీ, పాస్టర్స్ జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో ప్లకార్డులు చేబూని శాంతి ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్ఐ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వివిధ చర్చిల పాస్టర్లు ఎఫ్రాయిమ్‌రావు, శ్యామూల్‌నారాయణ, జాషువా, కరుణ, ఫిలిప్ పాల్గొనగా క్రైస్తవులు భారీగా పాల్గొన్నారు.



తర్లుపాడులో మిర్చిపై కప్పిన పట్టలు, ఆరుబయటే ఉన్న పొగాకు

ఈదురుగాలులు, వర్షం

● తడిచిన పొగాకు, మిర్చి

తర్లుపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం ఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న మిర్చి, ర్యాకర్స్‌లో ఉన్న పొగాకు తడిచిపోయింది. దీంతో పొగాకు, మిర్చి రైతులకు కొంతమేర నష్టం వాటిల్లింది. ఆకస్మికంగా ఉరుములు, గాలులతో కూడిన వర్షం రావటంతో కల్లాల్లో ఉన్న మిరపకాయలకు పట్టలు కప్పుకునే టైంకూడా లేకపోవటంతో వర్షార్పణం అయ్యింది. ర్యాకర్స్‌లో ఉన్న పొగాకు కూడా తడవటంతో కలర్ మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దోర్నాలలో మోస్తరు వర్షం

పెద్ద దోర్నాల :మండలంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మూడు రోజులుగా వీస్తున్న వడగాలులు, ఉష్ణోగ్రత వల్ల ఉక్కపోతకు గురయ్యారు. వర్షంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.కాగా మరో పక్క కల్లాల్లోని మిరపకాయలు తడిసిపోతాయని రైతులు ఉరుకుల పరుగులతో టార్పాలిన్ పట్టలు కప్పుకునేందుకు అవస్థలు పడ్డారు.

గాలి వానకు నిలిచిన విద్యుత్ సరఫరా

పుల్లలచెరువు : అకాల వర్షాల కారణంగా మండలంలో గాలివానకు పుల్లలచెరువు మండలంలో విద్యుత్ పూర్తిగా నిలిచిపోయింది. గురువారం మండల వ్యాప్తంగా గాలితో కూడిన వర్షం కురిసింది. పుల్లలచెరువులో గాలి వానకు రేకుల షెడ్డు కూలిపోయింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చికి రైతులు పట్టలు కప్పుకున్నారు. సాయంత్రం 4 గంటలకు ఆగిన విద్యుత్ రాత్రి 7 గంటల వరకు కుడా రాలేదు.

పండ్ల తోటలకు జీవం

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెంలో గురువారం సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు గంటపాటు ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. ఎర్రగొండపాలెంలో ప్రధాన రోడ్ల పై వర్షం నీరు ప్రవహించింది. అకాలంగా వచ్చికురిసిన వర్షం మండలంలో బత్తాయి, బొప్పాయి, జామ తోటలకు జీవం పోసిందని పండ్లతోటలు సాగుచేసిన రైతులు ఊరట చెందుతున్నారు. మండలంలోని బోయలపల్లి, గోళ్ళవీడపి, పందివానిపల్లె గ్రామాల్లో టమాటా, వంగ సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గురుకుల పాఠశాలలో పనుల పరిశీలన

కంభం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంభం బాలికల గురుకుల పాఠశాలలో ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా పథకంలో భాగంగా మంజూరైన కెమిస్ట్రీ ల్యాబ్, ప్లేగ్రౌండ్, స్కాడ్స్ అండ్ గ్రైడ్స్, ర్యాంప్ విత్ వెల్డింగ్ పనులను ఎంఈవో-2 శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పీఎంశ్రీ నిధులు మౌలిక వసతుల ఏర్పాటుకు ఉపయుక్తంగా ఉంటాయని, పనులను వేగవంతంగా చేపడుతున్నందుకు ప్రిన్సిపాల్ చాముండేశ్వరిని అభినందించారు.

ఉచిత కోచింగ్ సెంటరు ప్రారంభం

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) ఎర్రగొండపాలెంలో విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ఎంసెట్ కోచింగ్ సెంటరును ఎంపీడీవో శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న ప్రోత్సాహన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. డిప్యూటీ తహసీల్దారు మల్లిఖార్జునాయుడు మాట్లాడుతూ వెనుకబడిన ఏరియాలో ఎంసెట్ పరీక్షకు వెళ్లే విద్యార్థులకు కోచింగ్ సెంటరు ఏర్పాటు చేయడం ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

ఏసీ ఫ్రీజర్ బాక్స్ అందజేత

తర్లుపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని శ్మశానవాటిక అభివృద్ధికి వాసవి సత్రాల సముదాయ జాయింట్ సెక్రటరీ పోలేపల్లె జనార్దన్ ఏసీ ఫ్రీజర్ బాక్సును అందజేశారు. తమ తల్లిదండ్రులు పోలేపల్లి వెంకటరామయ్య, బాలమ్మ జ్ఞాపకార్థం ఫ్రీజర్ బాక్సును అందజేసినట్లు తెలిపారు. తర్లుపాడులో ఇప్పటి వరకు ఏసీ ఫ్రీజర్ బాక్సు లేకపోవటంతో మార్కాపురం, కంభం నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. తర్లుపాడు హిందూ శ్మశానంలో మండలంలోని హిందువులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ శ్మశాన అభివృద్ధి కమిటీ చైర్మన్ కశ్శెట్టి జగన్‌బాబు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జవ్వాజి విజయభాస్కర్‌రావు, నేరెళ్ల సాంబశివరావు, దోగిపర్తి మల్లికార్జునరావు, ఎస్.సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఏసీ ఫ్రీజర్ బాక్సును అందజేస్తున్న పోలేపల్లి జనార్దన్

సృజనాత్మకతను వెలికితీయాలి

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలని భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ నాగరాజు పేర్కొన్నారు. స్థానిక భాష్యం పాఠశాలలో అచీవ్‌మెంట్ ఫెస్ట్ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో సాధించిన బహుమతులను ప్రదర్శించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో తాము పొందిన బహుమతులతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ ఇన్‌చార్జ్ హేమసుధ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

100 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లంఊటను ఎక్సైజ్ పోలీసులు గుర్తించి ధ్వంసం చేశారు. అందిన సమాచారం మేరకు గిద్దలూరు ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు ఆధ్వర్యంలో మండలంలోని బురుజుపల్లె గ్రామసమీపంలో నాటుసారా తయారీకి బెల్లంఊటను తయారు చేస్తుండగా ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి ధ్వంసం చేశారు. అక్కడ ఉన్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు.



బెల్లం ఊటను తయారు చేస్తున్న వ్యక్తిని
అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

దర్శి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సామంతపూడిలో బుధవారం రాత్రి ఆంజనేయస్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది. సామంతపూడి నిమ్మారెడ్డిపాలెం తదితర గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. మహిళలు పొంగళ్లు పెట్టి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా టీడీపీ వర్గీయులు ఒకటి , వైసీపీ వర్గీయులు మరొక ప్రభ ఏర్పాటుచేశారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు పాల్గొని పూజలు చేశారు. భక్తుల కోసం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సమస్యల సత్వర పరిష్కారానికి ఇంటింటికి రెవెన్యూ

దర్శి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం నిర్వహిస్తుందని ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. దర్శి పట్టణంలోని క్రిష్టియన్ పాలెంలో గురువారం ఇంటింటికి రెవెన్యూ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ వీఆర్వో మురళి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్స్ సంఘం అధ్యక్షుడిగా కేశవ

దొనకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం మండల ఫీల్డ్ అసిస్టెంట్స్ సంఘం నూతన కమిటీని గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లపునేని కేశవ, ఉపాధ్యక్షుడిగా దయ్యాల బాలయ్య, కార్యదర్శిగా బాదం సత్యనారాయణ రెడ్డి, మరికొందరు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు బాధ్యతగా పనిచేస్తానని కేశవ పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా బ్రహ్మయ్య

దొనకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా యర్రబాలెం గ్రామానికి చెందిన బత్తుల బ్రహ్మయ్య యాదవ్ ఎంపికయ్యారు. ఈమేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్చార్జ్ యలగాల నూకానమ్మ, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా బ్రహ్మయ్య యాదవ్ మాట్లాడుతూ మండలంలో బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

నేడు సీఎస్‌పురంలో ప్రజాదర్బార్

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగే ప్రజాదర్బార్ కార్యక్రమంఓ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

కురిచేడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ రజనీకుమారి కోరారు. రెండో విడత రీసర్వేను మండలంలోని దేకనకొండ గ్రామంలో నిర్వహిస్తున్నారు. రైతుల అవగాహన కోసం గురువారం తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసిల్దార్ రజనీకుమారి, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కురిచేడులో ఉరుములతో వర్షం

కురిచేడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలంలో గురువారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి వాతావరణం మారి ఆరు గంటల తరువాత ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడవకుండా రైతులు పట్టలు కప్పి జాగ్రత్త చేశారు.

జూదరుల అరెస్టు

ముండ్లమూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసుపుగల్లులో పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందటంతో ఎస్ఐ వై.నాగరాజు తన సిబ్బందితో వెళ్లి స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పేకాట రాయుళ్ళు పట్టుబడ్డారు. వారి నుంచి రూ 3వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

రోడ్లపై చెత్త వేయొద్దు!

తాళ్లూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పరిరక్షణకు ప్రజలు సహకరించి చెత్తను రోడ్లపై వేయవద్దని ఈవోపీఆర్డీ కల్లూరి సుందరరామయ్య తెలిపారు. తాళ్లూరులో చెత్తను తీసుకెళుతున్న ట్రాక్టర్ వద్ద ఉండి పారిశుధ్యానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు వివరించారు. వ్యాపారస్తులు, ప్రజలు రోడ్లపై చెత్తను వేయకుండా చెత్త బుట్టల్లో వేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధు రావన్నారు.

చివరి తడి కోసం రైతుల పాట్లు

- నిలిచిన సాగర్ జలాలు
- కాలువల్లో అడుగంటిన నీరు
- మరో వారం రోజుల్లో సరఫరా చేస్తేనే పంట చేతికొస్తుంది
- ఆందోళనలో రైతులు

ముండ్లమూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాలు బంద్ కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మోదేపల్లి మేజరుకు వారాబందీ విధానంతో సరఫరా అవుతున్న సాగర్ జలాలు గతనెల 31న నిలిపివేశారు. అధికారులు ముందుగా ప్రకటించిన విధంగానే సాగర్ నీటిని నిలిపివేయడంతో వరి సాగుచేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట చివరి దశంలో ఉంది. ఈదశలో నీటి తడి అవసరమని రైతులు పేర్కొంటున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి సాగర్ కాలువలో పూర్తిగా నీరు అడుగంటిపోయింది. మరో వారం రోజుల పాటు నీరు విడుదల చేస్తే పంట చేతికి వస్తుందని రైతులు ఎంతో ఆశతో ఉన్నారు. అయితే, 31వ తేదీకే కాలువలకు నీరు నిలిపివేయటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మోదేపల్లి మేజరు పరిధిలో ఆరు వందల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. ప్రస్తుతం పంట వెన్ను విరిసి ఉంది. ఈపరిస్థితుల్లో వరి పైరుకు నీరు ఎంతో అవసరం. లేకుంటే దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశాలు ఉండటంతో మేజరు పరిధిలోని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వారం రోజులపాటు నీటిని విడుదలచేయాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు. మేజరు పరిధిలోని వేముల, ఈదర, కొమ్మవరం, అయోధ్య నగర్, వేములబండ, ఉమా మహేశ్వర అగ్రహారం, పూరిమెట్లతో పాటు భీమవరం గ్రామాలకు చెందిన రైతులు వరి సాగు చేశారు. ఇప్పటికే రూ.25 వేల నుంచి రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వస్తుందన్న సమయంలో నీటి ఎద్దడి ఏర్పడింది. వారాబందీ విధానం పెట్టినా చివరి భూములకు నీరందక అవస్థలు పడ్డారు. ఆఖరి తడి కోసం నీటిని విడుదలచేయాలని కోరుతున్నారు. లేకుంటే దిగుబడి గణనీయంగా తగ్గటమే కాక ప్రస్తుతం వెన్ను విరిసిన వరి పైరు అంతా తాలు గింజలుగా మారతాయని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


రమణారెడ్డిపాలెం వద్ద మోదేపల్లి మేజరు కింద సాగుచేసిన వరి పైరు

వారం రోజులపాటు నిరివ్వాలి

- నూకతోటి కోటేశు, రమణారెడ్డిపాలెం



మోదేపల్లి మేజరు కింద రెండు ఎకరాల్లో వరి పైరు సాగు చేశాను. ప్రస్తుతం పంట వెన్ను విరిసింది. వారం రోజుల పాటు నీరు విడుదల చేస్తే కాని పైరు చేతికి అందదు. లేకుంటే దిగుబడి తగ్గటమే కాక తాలుగా ఏర్పడుతుంది. తక్షణమే రైతులు తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సాగర్ జలాలను విడుదల చేయాలి.

దిగుబడి సగానికిపైగా పడిపోతుంది

- మెరుగుమల్లి వెంకటేశ్వర్లు, రమణారెడ్డిపాలెం



ప్రస్తుతం వరి పైరు కంకి దశలో ఉంది. ఈ పరిస్థితుల్లో నీరు చాలా అవసరం. ఎన్ఎస్పీ అధికారులు సాగర్ జలాలను నిలిపివేయడంతో కాలువలు అడుగంటి పోయాయి. దీంతో ఏం చేయాలో అర్థంకావటం లేదు. దిగుబడి సగానికి పైగా పడిపోయే పరిస్థితి ఏర్పడింది. వారం రోజుల పాటు నీటిని విడుదలచేస్తేనే పంట చేతికి వస్తుంది.

గృహనిర్మాణాల పురోగతికి రూ.5 కోట్లు

- హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్

తాళ్లూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మంజూరైన గృహాలు నిధుల కొరతతో నిలిచిపోయాయని జిల్లా హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. గృహనిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం జిల్లాకు రూ.5 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశహాలులో తాళ్లూరు, ముండ్లమూరు మండలాల హౌసింగ్ ఎంఐసీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో నిలిచిన గృహనిర్మాణాల అసంపూర్తి పనులు పూర్తిచేసి పురోగతి సాధించేందుకు ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. వీటితోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఆయావర్గాల లబ్ధిదారులకు అదనంగా నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బీసీలకు రూ.50 వేలు, ఎస్సీలకు రూ.75 వేలు, ఎస్టీలకు లక్ష రూపాయల చొప్పున అదనంగా అందజేస్తున్నట్టు తెలిపారు. మేనెల 3వ తేదీనాటికి జిల్లాలో 8,839 అసంపూర్తి గృహ నిర్మాణాలు పూర్తిచేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే 2620 గృహనిర్మాణాలు పూర్తిచేసినట్టు చెప్పారు. నిధులకు కొరత లేనందున లబ్ధిదారులు త్వరిగతిన గృహనిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. వెంటనే లబ్ధిదారుల ఖాతాలకు బిల్లులు జమ చేస్తామన్నారు. గ్రామాల్లో గృహాలు నిర్మించుకోని వారిని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రోత్సహించాలన్నారు. నిధుల కొరత లేదన్న విషయాన్ని తెలియపరిచి త్వరితగతిన పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. పీఎం ఆవాస్ యోజన కింద మండలంలో 435 గృహాలు మంజూరయ్యాయని చెప్పారు.


తాళ్లూరులోని ఎన్టీఆర్ గృహసముదాయంలో నిలిచిన ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ హౌసింగ్ పథకం ద్వారా ప్రభుత్వం పెద్ద ఎత్తున పేదవర్గాలకు గృహాలు మంజూరు చేస్తున్నదన్నారు. జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతనిధులను అధికారులు సమన్వయం చేసుకుని, వారి సహకారంతో గృహనిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దారా హనుమంతరావు, ఎంఐసీ హనుమంతరావు, కార్యాలయ పర్యవేక్షకులు ఎస్.సత్యం, రజానగరం సర్పంచ్ కాలేషావలి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పీడీ శ్రీనివాసప్రసాద్‌ను ఎంపీపీ తాటికొండ, జడ్పీటీసీ మారం సత్కరించారు.

అనంతరం తాళ్లూరులోని ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీని సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. గృహనిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు గృహనిర్మాణాలు చేపట్టాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనేపూర్తి చేసి బిల్లులు పొందాలని లబ్ధిదారులకు సూచించారు.

దాహం తీరే దారేదీ!

- పైపులైన్‌కు తరచూ లీకులు
- పశువుల దాహార్తి కోసం పైప్‌లు పగులకొడుతున్న పశుపోషకులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- చేతులెత్తేస్తున్న ఎన్ఏపీ అధికారులు
- తాగునీటికి ప్రజల ఇబ్బందులు

దొనకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు సరఫరా జరిగే సాగర్ జలాల పైప్‌లైన్ పురాతనమై తరచూ పైపులు పగలటం, లీకేజీలతో సాగర్ నీరు వృథాగా పోతోంది. ఇటీవల కొందరు పశుపోషకులు మూగజీవాల దాహార్తి నిమిత్తం సాగర్ జలాలు సరఫరా జరిగే సమయంలో బాదాపురం గ్రామ సమీపంలో పైప్‌లైన్ పగులకొట్టి సాగర్‌నీరు గుంతలకు మళ్లించారు. గత రెండు నెలల్లో అదే ప్రాంతంలో దాదాపు ఎనిమిది సార్లు పైప్‌లైన్ పగులకొట్టటం, సిబ్బంది రెండు మూడు రోజుల తర్వాత మరమ్మతులు చేపట్టటం జరుగుతోంది. దీంతో పలు గ్రామాల ప్రజలకు సాగర్‌నీరు సరఫరా జరగక వేసవిలో మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము నీటి సరఫరా చేయలేమని సంబంధిత అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా ప్రజలు తమకు దాహం తీరే దారేదంటూ ప్రశ్నిస్తున్నారు. దొనకొండ మండలంలోని పలు గ్రామాల ప్రజల మంచినీటి అవసరాల నిమిత్తం చందవరం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చందవరం-1 సాగర్ జలాల స్టోరేజీ నిర్మించి దాదాపు 40 ఏళ్లు గడుస్తున్నది. మంచినీటి పథకం పురాతనమై పలు ప్రాంతాల్లో తరచూ పైప్‌లైన్లు పగులుతున్నాయి. ప్రస్తుతం దొనకొండలోని దర్శి వెళ్లే ప్రధాన రహదారి పక్కన కేజీబీవీ పాఠశాల సమీపంలో, హెచ్‌పీ పెట్రోల్‌బంక్ సమీపంలో పైపులు పగిలి నీరు వృథాగా పోయింది. సంబంధిత అధికారులు, సిబ్బంది స్థానికంగా ఉండి పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేకపోవటంతో పైప్‌లైన్ పగులకొట్టటం, అక్రమ కొళాయిలు వేసుకోవటం తదితర సంఘటనలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామాల్లో తాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పైప్‌లైన్లు పగలకొట్టకుండా తగిన చర్యలు చేపట్టి వేసవిలో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రధాన రహదారి పక్కన పైపు పగిలి వృథాగా పోతున్న సాగర్‌నీరు


బాదాపురం వద్ద పైప్‌లైన్ పగులకొట్టడంతో ఎగిసిపడుతున్న సాగర్ నీరు

మొక్కుబడిగా మండల సమావేశాలు

- అమలుకు నోచుకోని తీర్మానాలు

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. ప్రతి మూడునెలలకోమారు సమావేశాలు జరుగుతుంటాయి. ఈసందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న దాఖలాలులేవని ఆరోపణలు వస్తున్నాయి. శుక్రవారం సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం జరగనున్నది. ఈసమావేశంలోనైనా ప్రజాసమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశిస్తున్నారు.

ప్రధానంగా రెవెన్యూ శాఖలో సమస్యలు చాంతాడలా ఉన్నాయి. దీనికితోడు అవినీతి, అక్రమాలకు అడ్డేలేకుండా పోతుంది. గతంలో కురిసిన అకాలవర్షాలకు పంట నష్టం గురించి పలుసమావేశాల్లో చర్చించినా పరిష్కారంకాలేదు. గత ప్రభుత్వంలో పక్కా గృహాల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది మధ్యలోనే నిర్మాణాలు నిలిపివేశారు. మరికొంతమందికి పట్టాలు మంజూరు చేసినట్టు ఆన్‌లైన్‌లో ఉన్నా స్థలాలు చూపలేదు. పంచాయతీల్లో అస్తవ్యస్తంగా డ్రైనేజీలు ఉన్నాయి. సాగు కాలువల మరమ్మతులకు నోచుకోవడంలేదు. సాగు సమయంలో రైతులు నీరందక ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ నీటి సరఫరా అన్ని గ్రామ పంచాయతీలకు సక్రమంగా జరగటంలేదు. ప్రస్తుతం ఈసమస్య జఠిలంగా మారింది. ఈసమావేశంలోనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

వెలిగండ్ల, ఏప్రిల్ 3: (ఆంధ్రజ్యోతి) శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ సిబ్బందికి సూచించారు. గురువారం వెలిగండ్ల పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల స్థితిగతులను తెలుసుకున్నారు. సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఏర్పాటుచేసుకొనేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థినులతో సమావేశమయ్యారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థినులకు క్రీడా దుస్తులను అందజేశారు.

కార్యక్రమంలో డీఎస్పీ సాయి ఈశ్వర్, ఎస్బీ ఎన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, పామూరు సీఐ భీమానాయక్, ఎస్ఐ షేక్ జిలాని భాషా, అచ్చిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థినులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎస్పీ దామోదర్


ఉగ్రను కలిసిన కంభాలదిన్నె గ్రామస్థులు

రోడ్డు నిర్మాణం చేపడతాం!

పామూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులను తీరుస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం కనిగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కంభాలదిన్నె పంచాయతీ ప్రజలు కలిశారు. మండలంలోని కంభాలదిన్నె, రేణిమడుగు, అక్కంపేట, ఆర్ఎస్‌పేట గ్రామస్థులు సరైన రోడ్డులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రేణిమడుగు-రాజసాహెబ్‌పేట రోడ్డు దారుణంగా ఉంది. గుంతలమయమైన ఆ రోడ్డులో ప్రయాణిం చాలంటే నరకాన్ని చూస్తున్నామని ఏకరువుపెట్టారు.

త్వరలో రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బం దులు తొలగిస్తామని డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. ఉగ్రను కలిసిన వారిలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గద్దె గంగయ్యచౌదరి, తెలుగురైతు మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య, గోళ్ల వీరబాబు, గద్దె మోహన్, కమ్మ బాలకృష్ణ, జి.వెంకటేశ్వర్లు, కమ్మ మాల్యాద్రి, కొండలరావు, మాదవ, నాని, మహేష్, హజరత్, మాలకొండయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి

పామూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాల సర్వేలను సచివాలయాల సిబ్బంది సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. గురువారం పామూరు గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలంలో ఉపాధి పనులకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతిఒక్కరికి పనులు చూపించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కూలీ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో బి.మాల్యాద్రి, జూనియర్ సహాయకుడు ఎం.స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ నాయకుడు మృతి

పీసీపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలెవారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మందిరెడ్డి నాగిరెడ్డి(65) అనారోగ్యం తో గురువారం మృతిచెందాడు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషిచేశాడు. నాగి రెడ్డి కొంతకాలంగా మూత్రపిండాలవ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం ఆరోగ్యం విషమించి మృతిచెందాడు. టీడీపీ మండల నాయకులు, కార్యకర్త లు ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో కందులు విక్రయించుకోవాలి

దొనకొండ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రంలోనే కందులు విక్రయించుకొని రూ.7550 మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని ఆరవళ్లిపాడు గ్రామంలో ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కంది రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించుకుంటే మంచి ధరతో పాటు డబ్బులు కూడా వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయన్నారు.

ఖరీఫ్ సీజన్లో మండలంలో 2391 మంది రైతులు 5515 ఎకరాల్లో కంది పంటను సాగు చేసినట్లు తెలిపారు. కొను గోలు కేంద్రంలో ఇప్పటి వరకు 16 మంది రైతుల నుంచి 250 క్వింటాళ్ల కొనుగోలు చేసినట్లు కేంద్రం నిర్వాహకులు ఆచారి తెలిపారు.

వార్డు సభ్యుడు రాజీనామా

తాళ్లూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రపాటివారిపాలెం ఒకటో వార్డు సభ్యుడు కె.వెంకట్రావు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎంపీడీవో దారా హనుమంతరావుకు గురువారం రాజీనామా ప్రత్రాని అందజేశారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో వార్డు సభ్యుడిగా గెలుపొందాడు. గ్రామ సర్పంచ్ కె.శ్రీదేవి, భర్త రామయ్యలు గ్రామ పంచాయతీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, రోడ్డు వేసిన వారికి బిల్లులు చెల్లింపు చేయలేదన్న ఆరోపణతో రాజీనామా పత్రాన్ని చేయటం పై టీడీపీ శ్రేణులు విమర్శిస్తున్నారు.

గత కొంతకాలంగా వైసీపీ నాయకులతో సత్సంబంధాలు పెట్టుకున్నాడని పేర్కొన్నారు. వారి చెప్పినట్లుగా నడుచుకుంటూ అధికార పక్షాన్ని ఇబ్బంది పెట్టేందుకే ఇలా వ్యవహరిస్తున్నాడని టీడీపీ శ్రేణు లు ఆరోపిస్తున్నారు. గత వైసీపీ పాలనలో చేపట్టిన వారికి బిల్లులు చెల్లింపుల్లో ప్రభుత్వం నుంచి ఆలస్యమైతే వారికి వత్తాసుగా రాజీనామా చేయ డం విడ్డూరంగా ఉందని సర్పంచ్ శ్రీదేవి, రామయ్య తెలిపారు. వైసీపీ నా యకులను వెంట తీసుకుని వెళ్లి రాజీనామా సమర్పించటం అంటే ఎవరు అభివృద్ధిని అడ్డుకుంటున్నారో తెలుసున్నదన్నారు. ఇటీవల గ్రామానికి వ చ్చిన వైసీపీ ఎమ్మెల్యే బూచేపల్లిని వార్డు సభ్యుడు కలిసి వచ్చిన విషయం అందరికి తెలుసునని వారు పేర్కొన్నారు.

ఉపాధి సిబ్బంది బదిలీ

తాళ్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం ఏపీవో, టీపలు బదిలీ అయ్యారు. తాళ్లూరు ఏపీవో బి.మురళి దర్శికి బదిలీ అయ్యారు. హనుమంతునిపాడు ఏపీవో కె.వెంకటేశ్వర్లు తాళ్లూరుకు బదిలీపై వచ్చారు. బదిలీపై వచ్చిన దొనకొండ, దర్శి టీఏలు వి.హనుమానాయక్, వి.నాగేశర్వరావు బాధ్యతలు స్వీకరించారు. మర్రిపూడి నుంచి సీవో సుకన్య బదిలీపై వచ్చి విధుల్లో చేరారు.

రీసర్వేతో రైతులకు ప్రయోజనం

ముండ్లమూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే చేసి హద్దులు నిర్ణయించటం వల్ల రైతులకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండదని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండలంలోని తూర్పుకంభంపాడులో రీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో మాట్లాడుతూ రీసర్వే ద్వారా రికార్డుల్లో తప్పులు ఉంటే సరిచేస్తామన్నారు. ప్రతి రైతు తమ పొలాన్ని రీసర్వే చేసేటప్పుడు తప్పనిసరిగా యజమానితో పాటు చుట్టుపక్కల రైతులు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మూర్తి, మండల సర్వేయర్ సీహెచ్ కోటం రాజు, వీఆర్వో సుజాత, సర్వేయర్లు పరమేశ్వర రెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు పరిపూర్ణయ్య, టీడీపీ సీనియర్ నాయకులు చాగంటి రాంబాబు, హనుమం తరావు, మానం నాగేశ్వరరావు, నాగసూరి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కనిగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నీటి సమస్యను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఎం నాయకుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. శివారు కాలనీ ప్రజలకు సక్రమంగా నీటి సరఫ రా జరగటం లేదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ జోసఫ్ దానియేలుకు అందచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీసీ కేశవరావు, ప్రసన్న, నరేంద్ర, బషరా, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్‌పై ప్రజలకు వాస్తవాలు చెప్పాలి

కనిగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బయోగ్యాస్ ప్లాంట్‌పై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని సీపీఎం నాయకుడు జీవీ కొండారెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లీజుల పేరుతో రైతుల నుంచి తీసుకునే భూముల యజమాన్యానికి భద్రత ఏమిటని ప్రశ్నించారు. ఆయా భూములపై ఆధారపడి జీవిస్తున్న పశువులు, పెంపకందారుల పరిస్థితి ఇబ్బందిగా మారుతుందన్నారు.






అమరావతిలో స్టార్టప్ ఏరియా (ఊహాచిత్రం)

అమరావతి అభివృద్ధిపై సింగపూర్ ప్రత్యేకంగా ఆసక్తి చూపుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలోనూ ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో సింగపూర్ సంస్థలు అమరావతి అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలో రాజధానిలో సింగ్‌పూర్ ప్రతినిధి బృందం పర్యటించడం.. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకం భేటీ కావడంతో.. స్టార్టప్ ఏరియా అభివృద్ధి తాజాగా తెరపైకి వచ్చింది. స్టార్టప్ ఏరియా అభివృద్ధి ప్రణాళికకు మళ్లీ జీవం పోసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 40కిపైగా దేశాల్లో స్టార్టప్ ఏరియాలను అభివృద్ధి చేసిన సింగపూర్ సంస్థలు అమరావతిని కూడా అత్యద్భుతంగా తీర్చిదిద్దాలని పలువురు ఎదురుచూస్తున్నారు. ఏదేమైనా అమరావతి స్టార్టప్ ఏరియా అభివృద్ధి గురించి మరికొద్ది రోజుల్లోనే మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

స్టార్టప్ ఏరియా అభివృద్ధికి.. జీవం

- సింగపూర్ బృందం రాకతో చిగురిస్తున్న ఆశలు
- సరికొత్తగా మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై చర్చలు
- ఆర్థిక లావాదేవీలకు ప్రధాన కేంద్రంగా చేయాలని లక్ష్యం



అమరావతిలో స్టార్టప్ ఏరియా

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి) రాజధాని అమరావతి అభివృద్ధికి అందివచ్చే ఏ ఒక్క అవకాశాన్ని కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వదులడం లేదు. 2014-19లో అమరావతి నగర ప్రణాళికను మూడు దశలుగా అభివృద్ధి చేయాలన్న మాస్టర్‌ప్లానును ఇప్పుడు ఏకకాలంలో సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్న కార్యాచరణతో ముందుకువెళ్తున్నారు. ఈ క్రమంలో రివర్‌ఫ్రంట్ ఏరియా లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం ప్రాంతాలలో అంతకుముందు అనుకున్న విధంగా స్టార్టప్ ఏరియా అభివృద్ధి చేసే ప్రణాళికకు కూటమి ప్రభుత్వం మళ్లీ జీవం పోస్తుంది. ఇందుకోసం గత నాలుగు మాసాలుగా సింగపూర్ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరుపుతుంది. అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతూ సింగపూర్ బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమరావతికి ఆహ్వానించింది. దీంతో ఆ బృందం బుధవారం రాజధాని ప్రాంతంలో పర్యటించింది. తాజాగా గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయింది. రాజధాని అమరావతి నిర్మాణ పనులకు సమాంతరంగా ఓఆర్‌ఆర్.. తాజాగా స్టార్టప్ ఏరియా అభివృద్ధి కూడా జరగాలని ముఖ్యమంత్రి పథక రచన చేశారు. ఇందుకోసం సింగపూర్ కన్సార్షియంను మళ్లీ తెరమీదకు తీసుకువచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుంది. వాస్తవానికి సింగపూర్ కన్సార్షియంతో రాష్ట్రప్రభుత్వ ఒప్పందాలను గత వైసీపీ ప్రభుత్వం అవమానకరంగా రద్దు చేయించింది. అయినా చంద్రబాబు మళ్లీ వారితో సంప్రదింపులు చేసి మరోమారు పాత ఒప్పందాలను పునరుద్ధరించుకునే దిశగా ఆ బృందాన్ని ఒప్పించగలిగారు.

మూడు దశల్లో అభివృద్ధికి ప్రణాళిక


గతంలో స్విస్ ఛాలెంజ్ విధానంలో సుమారు 1691 ఎకరాలను పెట్టుబడులకు, వర్తక, వాణిజ్య సంస్థలకు కేంద్రంగా స్టార్టప్ ఏరియాను మూడు దశలుగా అభివృద్ధి చేయాలని ఓ యాక్షన్ ప్లాన్‌ను తయారుచేశారు. ఇందుకోసం కొన్ని ఒప్పందాలతో సింగపూర్ కన్సార్షియం ఏడీసీఎల్ కలిసి అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్ ప్రైవేటు లిమిటెడ్‌గా ఏర్పడి మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేయాలని భావించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్‌ను గతంలో మాదిరి యథారీతిన అనుసరిస్తారా! లేక ఏవైనా మార్పుచేర్పులతో సరికొత్త ప్రణాళికలను రూపొందించుకుని తదనుగుణంగా ముందుకు వెడతారా అన్నది మరికొద్ది రోజులో తేలనున్నది. గత ప్రణాళిక ప్రకారమైతే తొలిదశలో 656 ఎకరాలు, రెండోదశలో 514 ఎకరాలు, మూడో దశలో 521 ఎకరాలను అభివృద్ధి చేయాలని భావించారు. అప్పట్లో ఈ ప్రాజెక్టు పెట్టుబడిని రూ.3137 కోట్లుగా అంచనా వేశారు. గత కాలపు ఒప్పందం ప్రకారం తొలిదశలో ఎనిమిది లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం వచ్చేలా ఓ మెగా టవర్‌ను నిర్మించాలి. ఇంకో నాలుగువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వెల్‌కమ్ గ్యాలరీని నిర్మించాలి. రెండో దశలో ఇదే తరహా టవర్‌ను నిర్మించాలి. వీటిల్లో వచ్చే ఆఫీస్ స్పేస్‌ను లీజులకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రప్రభుత్వానికి 48 శాతం, సింగపూర్ కన్సార్షియం 52 శాతం వంతున పంచుకోవాలి. అలాగే మిగతా అభివృద్ధి చేసిన భూముల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో ప్రభుత్వానికి 75శాతం, సింగపూర్ కన్సార్షియంకు 25శాతం వంతున వచ్చేలా అప్పట్లో ఒప్పందాలు చేసుకున్నారు. తాజాగా ఈ నిబంధనలన్నీ మళ్లీ మారే అవకాశాలు ఉన్నాయి. భూమిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం వల్ల జాతీయ, అంతర్జాతీయ, వాణిజ్య, ఆర్థిక సంస్థలను ఇక్కడికి రప్పించి అమరావతి స్టార్టప్ ఏరియాను ఆర్థిక లావాదేవీలకు ఓ ప్రధాన కేంద్రంగా చేయాలన్నది కూడా ఓ లక్ష్యంగా ఉంది. దీనివల్ల ఆదాయం గణనీయంగా పెరగడంతోపాటు యువతకు పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి. భూములకు కూడా ప్రభుత్వం ఆశించిన విధంగా మంచి ధరలు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఈ భూములను విక్రయించే బాధ్యత కూడా స్టార్టప్ ఏరియా డెవలపర్‌కే అప్పగించారు.

అమరావతికి.. 21 తర్వాత మోదీ

- రూ.లక్ష కోట్ల పనులకు ప్రధాని శ్రీకారం
- వెలగపూడిలో 250 ఎకరాల్లో సభా ప్రాంగణం
- 'ఆంధ్రజ్యోతి'తో గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి



నాగలక్ష్మి, కలెక్టర్



గుంటూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఈ నెల 21 తర్వాత ఏరోజైనా ఉండొచ్చు. ఇందుకోసం ముందస్తుగా అన్ని సిద్ధం చేసి పెట్టుకుంటున్నాం..' అని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి గురువారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్‌డీఏ, ఇతర సంస్థలకు సంబంధించి రూ.40 వేల కోట్లకు పైగా విలువ చేసే పనుల టెండర్లు పూర్తి అయి గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలానే ప్రైవేటు విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, కళాశాలలకు సంబంధించి మరో రూ.60 వేల కోట్లకుపైగా ఉన్నాయన్నారు. మొత్తం కలిపి రూ.లక్ష కోట్ల విలువైన పనులకు ప్రధాని మోదీతో చేతుల మీదగా అంకురార్పణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరి, సీఎంవో నుంచి అందిన ఆదేశాలతో తాము ప్రధాని పర్యటన కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. వెలగపూడి సచివాలయం పక్కన ఉగాది నాడు జరిగిన పీ4 ప్రారంభోత్సవ వేదిక వద్దనే ప్రధానమంత్రి పర్యటన ఉంటుందని తెలిపారు. ఆ ప్రాంతంలోనే దాదాపుగా 250 ఎకరాల్లో ప్రధాని సభా ప్రాంగణం ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. మోదీచే ప్రారంభమయ్యే పనులన్నీ రెండు, మూడేళ్లలోనే పూర్తి అయ్యేలా కార్యాచరణ ప్రణాళికని కూడా రూపొందించడం జరిగిందన్నారు.

సృష్టికి హాని కాదు.. మేలు చేద్దాం

తాబేళ్లు విడుదలలో ఎమ్మెల్యే కొండయ్య పిలుపు



సముద్రతీరంలోకి తాబేళ్లను వదులుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రామాపురం(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూ ప్రపంచంలో ప్రతి జీవితో అనుబంధం ఉంటుంది.. అందువల్ల మనం జీవించి ఉన్నంత కాలం సృష్టికి హాని చేయకుండా వీలైనంత వరకు మేలు చేద్దాం.. అని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. తీర భద్రతకు సంబంధించి కో-ఆర్డినేటర్ చంద్రరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 1900 ఆలివ్ రిడ్లే తాబేళ్ల పిల్లలను ఎమ్మెల్యే కొండయ్య గురువారం తెల్లవారుజామున సముద్రంలోకి వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యసంపద ఉత్పత్తికి తాబేళ్లు ఉపయోగపడతాయన్నారు. పొట్టి సుబ్బయ్యపాలెం, రామాపురం, రామచంద్రపురం ప్రాంతాల్లో అటవీ అధికారులు తాబేళ్ల పెంపకానికి కృషి చేస్తున్నారన్నారు. దీనిద్వారా మత్స్యకారుల మనుగడ సులభంగా ఉండడమే కాకుండా భోజన ప్రియులకు మత్స్య సంపద అందుబాటులో ఉంటుందని చెప్పారు.

11 బీఈడీ కళాశాలలకు నోటీసులు

- పలు ఆరోపణల నేపథ్యంలో స్పందించిన ఎన్సీటీఈ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని 11 బీఈడీ కళాశాలలకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్సీటీఈ) నోటీసులు జారీ చేసింది. పనితీరు అంచనా నివేదికకు సంబంధించి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. వర్సిటీ పరిధిలోని గుంటూరు, నరసరావుపేట, రేపల్లె ప్రాంతాల్లోని కళాశాలలకు ఈ నోటీసులు జారీ అయ్యాయి. కొందరు అధికారుల తీరుతో వర్సిటీ పరిధిలో బీఈడీ కోర్సు నిర్వీర్యం అవుతోందనే ఆరోపణలున్నాయి. మార్చిలో బీఈడీ ప్రశ్నపత్రం లీకైన విషయం తెలిసిందే. బీఈడీ ప్రయోగ పరీక్షల తనిఖీ బృందాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లపై అసభ్యకర పోస్టులు పెట్టిన వారు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఇటువంటి వారికి ప్రయోగ పరీక్షల్లో కీలక బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వచ్చాయి. ఒక విడత పరీక్షల్లో ఎగ్జామినర్‌గా, తనిఖీ బృందాల్లో కీలక సభ్యులుగా ద్విపాత్రాభినయంపైనా విమర్శలు వస్తున్నాయి. కొన్ని బీఈడీ కళాశాలలు ఒక్కో విద్యార్థి నుంచి రూ.10,000 పైగా వసూలు చేసి పరీక్షలను పక్కదారి పట్టిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇలా బీఈడీ కళాశాల నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో ఎన్సీటీఈ నోటీసులు జారీ చేయడం గమనార్హం.



వేసవి ముందదస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

వడగాడ్పులు, తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడరాదు.. అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు వడగాడ్పులకు, తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. వేసవి ముందస్తు జాగ్రత్తలపై గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమీక్షించారు. జూన్ వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వడగాలులు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ పరిస్థితుల్లో ఎక్కడికక్కడ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. చలివేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఉంచాలని తెలిపారు. ఎండతీవ్రత తగ్గిన తర్వాత ఉపాధిహామీ పనులు చేపట్టాలన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విరామం ఇవ్వాలన్నారు. వడదెబ్బ మరణాలు జరగకుండా చూడాలన్నారు. ఆశావర్కర్లు ఒంటరి వృద్ధ మహిళల ఆరోగ్య పరిస్థితులను ప్రతిరోజు పర్యవేక్షించాలనిఆదేశించారు.

- గ్రామాల్లో, పట్టణాల్లో శానిటేషన్‌పై కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. శానిటేషన్‌పై ఐవీఆర్‌ఎస్ ద్వారా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. 42శాతం మంది అసంతృప్తి వ్యక్త పరిచినట్లు తెలిపారు. ప్రతిరోజు ఇంటింటా చెత్తసేకరణ చేపట్టాలన్నారు.
- వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌ల్లో నీటి నిల్వలపై కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. నీటి సరఫరాలో పైపుల లీక్‌లను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. తక్కువ లోతు బోర్ల నుంచి నీటిని వాడవద్దని, అవి కలుషితానికి గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలకు సూచించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, డీపీవో ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ అనంతరాజు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఎల్‌డీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

మూడేళ్లయినా.. తప్పటడుగులే

- బాపట్ల, పల్నాడు జిల్లాలు ఆవిర్భవించి నేటికి మూడేళ్లు
- ఇంకా అద్దె భవనాల్లోనే పలు కార్యాలయాలు
- పట్టాలెక్కని సమీకృత కలెక్టరేట్ల నిర్మాణం
- సిబ్బంది కొరత.. వసతుల లేమి సరేసరి
- జిల్లా అధికారుల నియామకాలు లేవు.. ఇన్‌చార్జిలే దిక్కు



రెండు నెలల క్రితం వేసిన కలెక్టరేట్‌లోని అంతర్గత రోడ్డు



జిల్లా కలెక్టర్ కార్యాలయం



అపార్ట్‌మెంట్‌లో అద్దెకు కొనసాగుతున్న మైనింగ్, అటవీ విభాగాల కార్యాలయాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి.. పాలన ప్రక్షాళన.. ప్రభుత్వ సేవలు ప్రజల దరికి చేర్చాలని.. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల విభజన చేపట్టింది. అయితే ఆయా లక్ష్యాల మాటేమో కానీ జిల్లాల విభజనలోని చిక్కుముడులు ఇంకా కొనసాగుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాను లోక్‌సభ నియోజకవర్గాల ప్రాతిపదికగా పల్నాడు, బాపట్ల జిల్లాల విభజన జరిగింది. శుక్రవారంతో జిల్లాల విభజన జరిగి మూడేళ్లు అవుతుంది. అయినా ఇంకా పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడంలేదు. 2022 ఏప్రిల్ 4న జిల్లాల విభజన జరగ్గా ఇంకా తప్పటడుగులతోనే పాలన సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా.. హడావుడిగా జిల్లా ఏర్పాటుతో సరిపెట్టింది. దీంతో ఇప్పటికీ ఉద్యోగుల విభజన మొదలు కార్యాలయాల ఏర్పాటు వరకు అన్నింటా అస్పష్టతే రాజ్యమేలింది. జిల్లా ఏర్పడిన ఆరు నెలల్లోపే సమీకృత కలెక్టరేట్ నిర్మిస్తామని, నిష్పత్తి ప్రకారం అన్ని విభాగాల్లో సిబ్బందిని నియమిస్తామని, ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని.. ఆర్భాటంగా ప్రకటించిన అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఆ తర్వాత ఆ ఊసే మరిచారు. గత ప్రభుత్వం చెప్పిన మాటలు ఏ ఒక్కటీ అమలుకాకపోగా అటు ఉద్యోగులు, ఇటు ప్రజల గోడు వినే నాధుడే కరువయ్యారు. ఇక జిల్లాల స్థాయిలో ప్రగతి పనులు అమలు కూడా వెనుకబాటు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అభివృద్ధిలో కొత్త జిల్లాల్లో పల్నాడు జిల్లా వెనకబడి ఉన్నట్లు ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి.

గాడిన పడని పాలన..

మూడేళ్లు అయినా అటు పల్నాడులో కానీ ఇటు బాపట్లలో కానీ పాలన ఇంకా గాడిలో పడలేదు. జిల్లా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడం లేదు. జిల్లా కార్యాలయాల్లో కనీస వసతులు లేక ఉద్యోగులు.. ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న కార్యాలయాలకు

(మిగతా 6వ పేజీలో)

సమస్యలు ఇలా..

- జిల్లా కేంద్రమైన బాపట్లలో ఓ సొసైటీ కళాశాల భవనాల్లోనే దాదాపు పది ప్రభుత్వ కార్యాలయాలు కొలువుదీరి ఉన్నాయి. మైనింగ్ విభాగం, జిల్లా అటవీ శాఖలు వివేకానందకాలనీలోనే ఓ ప్రైవేటు అపార్ట్‌మెంట్‌లో అద్దెకు నడుపుతున్నారు. ఫుడ్ సేఫ్టీ విభాగం, మార్క్‌ఫెడ్ తదితర కీలక శాఖల కార్యాలయాలు కూడా అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.
- దాదాపు డజను విభాగాలకు జిల్లా అధికారులుగా ఇన్‌చార్జులే ఉన్నారు. అత్యంత కీలకమైన ఏపీఎంఐపీ మొదలు డ్రగ్స్, మత్స్యశాఖ, టూరిజం, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ విభాగాలదీ ఎఫ్‌ఏసీల దారే. రెవెన్యూ విభాగంలో దాదాపు 6 మండలాల్లో ఇన్‌చార్జిలే తహసీల్దార్లుగా ఉన్నారు.
- జిల్లా వ్యాప్తంగా దాదాపు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండాల్సిన నిష్పత్తి మేరకు నియామకాలు జరిపితేనే దాదాపు 700 వరకు పోస్టులను తక్షణమే భర్తీ చేయాల్సి ఉంటుంది.
- ఇటీవల జరిగిన బదిలీల్లోనూ ఇక్కడకు రావడానికి ఉద్యోగులు ఆసక్తి చూపలేదు. అరకొరగా నియమించిన సిబ్బంది కూడా పైరవీలు చేయించుకుని ఉమ్మడి జిల్లా బాటే పట్టారు.
- కలెక్టరేట్‌లోని అంతర్గత రహదారుల బాగుపై గత ప్రభుత్వం కనీసం దృష్టి పెట్టలేదు. రెండు నెలల క్రితమే ఆ రోడ్లను సుందరంగా తీర్చిదిద్దారు.

అడ్డంగా దొరికారు

- ఆర్డీవో కారుకు సైడ్ ఇవ్వకుండా అసౌకర్యం కలిగించిన ఇసుక అక్రమ టిప్పర్
- అనుమానంతో తనిఖీ
- అనుమతులు లేకపోవడంతో వాహనం ఈపూరుపాలెం స్టేషన్‌కు తరలింపు

కావూరివారిపాలెం (చీరాల), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీవో కారుకు సైడు ఇవ్వకపోవడంపై ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆగ్రహానికి గురయ్యారు. ఈ క్రమంలో ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం తెలుసుకొని చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని కావూరివారిపాలెంలో ప్రభుత్వ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కారులో డ్రైవర్‌తో సహా వెళుతున్నారు. బాపట్ల మండలం వెదుళ్లపల్లి - చీరాల మండలం కావూరివారిపాలెం మధ్యలో ఆర్డీవో కారు వెళ్తుండగా వెదుళ్లపల్లి వైపు నుంచి గవినివారిపాలెం వైపు వెళుతున్న టిప్పర్ కొద్ది నిముషాలు ఆర్డీవోకు సైడ్ ఇవ్వకుండా అసౌకర్యం కలిగించింది. అప్పటికే కొన్నిసార్లు ఆర్డీవో డ్రైవర్ హారన్ ఉపయోగించినా ప్రయోజనం లేకపోవడంతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు అసహనానికి గురయ్యారు. దీంతో టిప్పర్‌ను ఓవర్ టేక్ చేసి నిలదీశారు. అంతలోనే చాకచక్యంగా వ్యవహరించిన ఆర్డీవో అసలు టిప్పర్ ఏమిటని ఆరా తీయగా.. అది ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్న వాహనంగా గుర్తించారు. వెంటనే సిబ్బంది సహాయం తో టిప్పర్‌ను ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతేకాకుండా యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతుంటే మీరే మి చేస్తున్నారంటూ వీఆర్వో తదితర రెవెన్యూ సిబ్బందిపై ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ఈపూరుపాలెం పోలీసులు టిప్పర్‌కు చలానా విధిం చి పంపనున్నట్లు సమాచారం.



ఈపూరుపాలెం పోలీసుల అదుపులో ఉన్న ఇసుక టిప్పర్

నేడు మంత్రి గొట్టిపాటి అర్జీల స్వీకరణ

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం అద్దంకిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. ఉదయం 8-45 గంటలకు బల్లికురవ మండలం వేమవరం వద్ద హరిబాలాజీ గ్రానైట్స్ ప్రారంభించనున్నారు. ఉదయం 9-30 గంటలకు అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6, 7 తరగతులు చదువుతున్న 300 మంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. అనంతరం 10-30 గంటల నుంచి అద్దంకి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి మంత్రి రవికుమార్ అర్జీలను స్వీకరించనున్నారు.


కొంగపాడుడొంక వద్ద పాత స్తంభాల పక్కనే ఏర్పాటు చేస్తున్న కొత్త విద్యుత్ స్తంభాలు

మళ్లీ అదే పొరపాటు

- పాత విద్యుత్ లైన్‌ల స్థానంలో కొత్తవి
- టవర్‌లను ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో సమస్యలుండవని అభిప్రాయం
- కేబుల్ వైర్ల తొలగింపుపై ఆందోళన

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పాత విద్యుత్ లైన్‌ల స్థానంలో పలు చోట్ల కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే విద్యుత్ లైన్‌లు నామ్ రోడ్డు క్రాస్ చేసే ప్రాంతంలో ఎత్తైన టవర్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో సమస్యలు లేకుండా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. అయితే కొత్త లైన్‌లు ఏర్పాటు చేస్తూ కూడా పాత విద్యుత్ స్తంభాల ఎత్తులోనే మరలా కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రయోజనం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేసే సమయంలో ఆయా ప్రాంతాలలో కేబుల్ వైర్‌లు తొలగించకుండా కట్ చేస్తుండడంతో కేబుల్ ఆపరేటర్‌లు ఆందోళన చెందుతున్నారు. కేబుల్ వైర్‌లు కట్‌చేయడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఏయే ప్రాంతాలలో ఎప్పుడు కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారో ముందస్తు సమాచారమైన ఇస్తే తొలగించుకునే వీలుంటుందని కేబుల్ ఆపరేటర్‌లు తమ ఆవేదన వ్యక్తం పరుస్తున్నారు.

డీజిల్ చోరీపై వాగ్వివాదం

యువకులను హెచ్చరించిన సీఐ


యువకులను హెచ్చరిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : టిప్పర్లలో డీజిల్ చోరీపై డ్రైవర్‌లు, యజమానుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. విజయవాడ - బెంగళూరు హైవే నిర్మాణ పనులకు అద్దంకి పట్టణానికి చెందిన వ్యక్తులు టిప్పర్‌లను ఏర్పాటు చేశారు. తాళ్లూరు మండలం గుంటిగంగ వద్ద టిప్పర్‌లు గ్రావెల్ తరలింపునకు ఉంచగా, డ్రైవర్‌లు డీజిల్ దొంగలించి అమ్ముకుంటున్నట్లు యజమానులకు సమాచారం అందింది. దీంతో గురువారం మధ్యాహ్నం అద్దంకి పట్టణంలోని మేదరమెట్ల రోడ్డులో టిప్పర్‌ల యజమానులు, డ్రైవర్‌లు వాగ్వివాదానికి దిగారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాజు ఘటనా స్థలానికి చేరుకొని హెచ్చరించి పంపించివేశారు.

కూలీల ఆటోను ఢీకొన్న పొట్టు లారీ

ఐదుగురు మహిళా కూలీలకు గాయాలు


ప్రమాదానికి కారణమైన పొట్టు లారీ

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కూలీలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా పొట్టు లారీ ఢీకొనటంతో 5 గురు మహిళా కూలీలకు గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. అద్దంకి మండలం ధర్మవరానికి చెందిన మహిళా కూలీలు మిర్చి కోతలకు ఆటోలో అద్దంకి వైపు వస్తున్నారు. అద్దంకి పట్టణానికి సమీపంలోని కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీల వద్ద గురువారం ఉదయం ఎదురుగా వస్తున్న పొట్టు లారీ అంచు బయటకు ఉండడంతో కూలీల ఆటోను తగిలింది. దీంతో ఆటోలో ఉన్న నాగిపోగు మరియమ్మ, జంగ్రాజుపల్లి కోటేశ్వరమ్మ, ఎం. మరియమ్మ, బిరుదు చిట్టెమ్మ, మురికిపూడి శ్రీదేవికి గాయాలు కావడంతో అటు వైపు వస్తున్న మరో ఆటోలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాగిపోగు మరియమ్మ, జంగ్రాజుపల్లి కోటేశ్వరమ్మ లను ఒంగోలు వైద్యశాలకు తరలించారు.


పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అక్కయ్యపాలెం కాలువ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి వద్ద రూ.17వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు

కారంచేడు (పర్చూరు), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆటోలు, మినీ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని బాపట్ల జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు హెచ్చరించారు. కారంచేడు గ్రామంలో గురువారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఓవర్ లోడ్ ప్రయాణికులతో వెళ్తున్న 3 ఆటోలను సీజ్ చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి కూలీలకు అవగాహన కల్పించారు. సీజ్ చేసిన వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు.


నామ్ రోడ్డులో వెలగని సెంట్రల్ లైటింగ్ లైట్లు

అద్దంకిలో సెంట్రల్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తం

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డులో ఉన్న సెంట్రల్ లైటింగ్ లైట్లు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నల్లవాగు నుంచి శింగరకొండ సమీపంలోని 99 అడుగుల విగ్రహం వరకు నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ కొంత దూరం, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొంత దూరం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైటింగ్ నిర్వహణ కూడా అటు నామ్ నిర్వహణ సంస్థ, అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అయితే నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. తరచూ లైట్లు మొరాయిస్తుండడంతో చీకటిగా మారుతుంది. అద్దంకి పట్టణ పరిధిలో తరచూ చీకటిగా ఉంటుండడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెంటర్ లైటింగ్ లైట్లు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


పరదాలు కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్ద బారులు తీరిన రైతులు

అన్నదాతల ఉరుకులు.. పరుగులు

- వర్ష సూచనతో పంటలను రక్షించుకునేందుకు పాట్లు
- పరదాల కోసం దుకాణాల వద్ద బారులు

పర్చూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) 3 : మారిన వాతావరణ పరిస్థితులు వర్షపు హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు కలవరానికి గురవుతున్నారు. చేతికి అందివచ్చిన పంటలను రక్షించుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. గురువారం ఒక్కసారిగి వాతావరణ పరిస్థిలు మారడంతో పొలంలోనే ఉన్న పంటలను కాపాడుకునేందుకు పరదాల కోసం దుకాణాల వద్ద బారులు తీరారు. నియోజకవర్గంలో వేల ఎకరాల్లో సాగుచేసిన వైట్‌బర్లీ అధిక శాతం పొలాల్లోనే ఎండపెట్టారు. మిర్చి ఎక్కువ భాగం కల్లాల్లోనే ఉండగా, మరి కొంత మిర్చి కాయలు కోతకు వచ్చి ఉన్నాయి. దీంతో ఏమిచేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. కనీసం చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు వేలకు వేలు వెచ్చించి మరీ పట్టలను కొనుగోలు చేసుకుంటున్నారు. ఒకపక్క రైతుల్లో ఆందోళన నెలకొని ఉంటే మరోపక్క వ్యాపారులు అధిక ధరలు పెంచి పట్టలు అమ్ముతూ జోష్‌గా ఉన్నారు.

రేపు పుట్టంరాజుకు సన్మానం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ సందర్భంగా ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్న పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తికు ఈ నెల 5వ తేదీన ఉదయం 10గంటలకు చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవా సదన్‌లో సాహితీ కౌముది, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సత్కార సభ జరుగుతుందని నిర్వాహకు లు గురువారం ప్రకటన ద్వారా తెలిపారు. పట్టణంలో సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థల పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


అంజమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

అంజమ్మకు ఏలూరి నివాళి

ఇంకొల్లు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ వజీఈ సభ్యుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజి వెంకట్రావు మాతృమూర్తి అంజమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పూలమాలవేసి నివాళులర్పించారు. గురువారం ఇంకొల్లు ప్రాంతంలో ఎమ్మెల్యే ఏలూరి పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయుడు హనుమంతరావు, వీరగంధం ఆంజనేయులు, కరి శ్రీను, మార్క్, శ్రీహరి, నాయకులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ బిల్లును ఆమోదించడం అన్యాయం


నిరసనలో పాల్గొన్న బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : లోక్ సభలో పాత పెన్షనర్స్ ప్రయోజనాలను విస్మరించి ఫైనాన్స్ బిల్లును ఆమోదించడం అన్యాయమని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. గురువారం చీరాల శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వృద్ధులపై నిర్లక్ష్యం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మోహన్‌రావు, బొయాజ్, వెంకటేశ్వరరావు, భాస్కరరావు, ఐజాక్, యోహాను, లింగారావు, కిషోర్, ప్రభాకరరావు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో బీటెక్ విద్యార్థులకు వీడ్కోలు సభ

చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ (ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్) చదువుతున్న విద్యార్థులకు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. అవలంబించిన విద్యతో భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని సూచించారు. అనంతనం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సీఎస్ రావు, మేనేజర్ రమణమూర్తి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై కొనసాగుతున్న ఆంక్షలు

- పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు
- పెద్ద మొత్తంలో స్వాధీనం


సోదాల అనంతరం దుకాణాల్లో దొరికన ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకొని ట్రాక్టర్‌లో కార్యాలయానికి తరలిస్తున్న పంచాయతీ అధికారులు

పర్చూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విచ్చలవిడిగా ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో ఇటు ప్రజలకు ఆరోగ్య సమస్యలతోపాటు డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారుతోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. రోడ్లపై, మురుగు కాలువల్లో పెద్ద ఎత్తున కవర్లు కుప్పలుగా కన్పిస్తున్నాయి. వ్యాపారులు, ప్రజలు ప్లాస్టిక్‌ను విపరీతంగా వాడుతుండడంతోపాటు ఉపయోగించిన కవర్లను మురుగు కాలువల్లో పడేస్తున్నారు. దీంతో తరచూ మురుగు నీరు కదలక డ్రైనేజీ సమస్య ఉత్పన్నమవుతోంది. మరోపక్క మురుగు కదలకపోవడంతో దోమల బెడద ప్రజలను పట్టిపీడిస్తోంది. పలు ప్రాంతాల్లో ప్రజలు రోగాలతో సతమతమవుతున్నారు. పర్చూరు పంచాయతీ పారిశుధ్య కార్మికులు నిత్యం కాలువలను శుభ్రం చేస్తున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. ఈ సమస్యపై స్పందించిన పం చాయతీ అధికారి మస్తాన్‌రావు నేతృత్వంలోని శానిటరీ అధికారులు, సిబ్బందితో ప్లాస్టిక్ నిషేధానికి శ్రీకారం చుట్టా రు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలంటూ ఆదేశాలిచ్చారు. పలు దుకాణాల్లో సోదాలు చేసి పెద్ద మొత్తంలో ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికైనా ప్రజలు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని స్వచ్ఛందంగా మానుకోవాలని, అలాగే వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా వస్త్ర సంచులను వినియోగదారులకు అలవాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

భార్య, అత్తపై కత్తితో దాడి

- అపస్మారక స్థితిలో భార్య, రక్త గాయాలతో అత్త
- భర్త రేపల్లె యడ్లలంక వాసి


ఏరియా హాస్పిటల్లో అపస్మారక స్థితిలో ఉన్న సంధ్య

పేరాల(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కొంత కాలంగా కుటుంబంలో నెలకొన్న మనస్పర్థల కారణంగా కట్టుకున్న భార్యను, అడ్డు వచ్చిన అత్తను కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ఈ ఘటన గురువారం రాత్రి పేరాల్లోని మసీదు సెంటర్ సమీపంలో చోటు చే సుకుంది. బాధిత కుటుంబ సభ్యు లు, టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా పరిధిలోని రేపల్లె యడ్లలంకకు చెందిన తోకల కరుణాకర్, పేరాలకు చెందిన సంధ్య 2013లో ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం వీరికి ఒక బాబు. గత రెండు సంవత్సరాల కిందట నెలకొన్న వివాదాల కారణంగా భార్య సంధ్య తల్లి లక్ష్మి వద్దకు వచ్చేసింది. అయితే అప్పటి నుంచి అప్పుడప్పుడు భర్త కరుణాకర్ భార్య వద్దకు వచ్చి గొడవపడుతుంటాడు. ఈక్రమంలోనే పథకం ప్రకారం కత్తితో భార్య పొట్టలో, తొడపై కత్తితో పొడిచాడు. అడ్డు వచ్చిన అత్త లక్ష్మి రెండు చేతులపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. అయితే అపస్మారకంగా ఉన్న భార్యను. తీవ్ర రక్త గాయాలైన లక్ష్మిని స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. సంధ్యను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ నాగభూషణం హాస్పిటల్‌కు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రామకూరులో అందని ఫైబర్ నెట్ సేవలు

- కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేసినా లభించని పరిష్కారం
- వినియోగదారుల ఆరోపణ

పంగులూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రామకూరు గ్రామంలో ఫైబర్‌నెట్ సేవలు సరిగా వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. నెల రోజులుగా పగటి పూట నెట్ సేవలు అందక ఇబ్బంది పడుతున్నామని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు చెప్తున్నారు. ఫైబర్‌నెట్ ద్వారా నెట్ సేవలు నిరంతరం అందుతాయనే భావనతో రామకూరులో సుమారు 80 మందికి పైగా ఫైబర్‌నెట్ వినియోగిస్తున్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ విధులు నిర్వహించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు 15 మందికి పైగా ఉండగా, టీవీ, టచ్ ఫోన్, ఇతర సేవలు వినియోగించుకునే వారు 70 మంది వరకు ఫైబర్‌నెట్ కనెక్షన్ తీసుకున్నారు. నెల రోజులుగా ఉదయం కొంత సమయం తరువాత నెట్ పనిచేయని పరిస్థితి ఏర్పడిందని కాల్ సెంటర్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా సాంకేతిక సమస్యను గుర్తించి సరిదిద్దే పరిస్థితి లేదని ఆరోపిస్తున్నారు. పగటి పూట నెట్ సేవలు అందకపోవడంతో వరపర్ల ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగ తమ బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నెలకు రూ.650 ప్యాకేజీని వినియోగిస్తుండగా, మిగిలిన సేవలు పొందేవారు నెలకు రూ.350 ప్యాకేజీని వినియోగిస్తున్నారు. ఫైబర్‌నెట్ ద్వారా నాణ్యమైన సేవలు పొందవచ్చని భావించిన వినియోగదారులు, సాంకేతిక సమస్యలతో స్మార్ట్ ఫోన్‌లు పనిచేయక, పొరుగు ప్రాంతాలకు వెళ్ల లేక అవస్థలు పడుతున్నారు. సాంకేతిక సమస్యను గుర్తించలేక పోవడంపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వలపర్లలో కూలి డబ్బుల పంపిణీపై వివాదం

మార్టూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పచ్చాకు పనులకు సంబంధించి కూలి డబ్బులు పంచుకునే విషయంలో బంధువుల మధ్య వివాదం జరిగిన ఘటన గురువారం రాత్రి మండలంలోని వలపర్ల గ్రామంలో జరిగింది. ఈ విషయమై వారు డయల్ 100కు కాల్ చేయడంతో, అక్కడ నుంచి స్టేషన్‌కు సమాచారం రాగా, సీఐ ఎం.శేషగిరిరావు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి వివాదానికి కారణమైన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అందిన సమాచారం మేరకు.. గత రెండు నెలలు కిందట వలపర్లలోని ఎస్‌సీ కాలనీకి చెందిన వారు పచ్చాకు పనులు నిమిత్తం నెల్లూరు సమీపంలోని ఒక గ్రామానికి వెళ్లారు. మరలా వారు రెండు రోజులు కిందట పనులు ముగియడంతో నెల్లూరు నుంచి మరలా వలపర్ల గ్రామానికి వచ్చారు. అయితే వారితో పనులు చేయించుకున్న రైతు కూలీల కోసం రూ.2లక్షలు పంపిస్తానని కేవలం రూ.70 వేలను గురువారం పంపించారు. దాంతో రూ.70 వేలు పంచుకునే విషయంలో వారి మధ్య వివాదం జరిగింది. వారిలో ఒకరు 100కు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం వారిని అదుపులోకి తీసుకున్నామని, కాలనీలో ఎలాంటి గొడవలు లేవని, వారికి కౌన్సెలింగ్ చేసి పంపిస్తామని సీఐ శేషగిరిరావు తెలిపారు.

మూడేళ్లయినా.. తప్పటడుగులే

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దె చాలక సొంతంగా చెల్లించాల్సిన దుస్థితి చాలా మంది అధికారులు ఎదుర్కొంటున్నారు. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, కలెక్టర్, ఎస్పీ నివాసాలకే వసతులు పరిమితమయ్యాయి. కొన్ని కార్యాలయాలకు నేటికి కనీసం పర్నిచర్ కూడా ఇవ్వలేదు. కార్యాలయాలకు కనీస వసతులు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చిక్కుముడులు వీడేనా

గత ప్రభుత్వం ఆదరాబాదరాగా జిల్లాలు ఏర్పాటు చేయడంతో అనేక సాంకేతికపరమైన చిక్కులు కూడా ఇమిడి ఉన్నాయి. ఒక అధికారి రెండు పోస్టులను నిర్వహించాల్సి ఉండటంతో వారు ఏ విభాగానికీ న్యాయం చేయడంలేదు. సరిపడా సిబ్బంది లేకపోవడం, ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొన్ని ఖాతాలు నిర్వహిస్తున్నారు. మెప్మా, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, యువజన సర్వీసుల వంటి విభాగాలన్నీ ఇంకా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతున్నాయి. కొన్ని విభాగాలకు చెందిన అధికారులకు అయితే గుంటూరులోని ప్రధాన కార్యాలయాల నుంచే జీతాలు తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో గెజిటెడ్ హోదా కలిగిన జిల్లా అధికారులు లేక అధికారులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా ఏర్పాటు సమయంలో సాంకేతికంగా ఉన్న చిక్కులను తొలగించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా జిల్లా పోస్టుల భర్తీకి ప్రతిబంధకంగా ఉన్నట్లు సమాచారం. కార్యాలయాల్లో సిబ్బంది అయితే ఉండాల్సిన నిష్పత్తిలో ఏ ఒక్క విభాగంలోనూ లేరు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణం ఆచరణలో రాకపోగా పలు ప్రభుత్వ విభాగాలకు అద్దె భవనాలే ఇప్పటికీ దిక్కుగా ఉన్నాయి. ఇలాంటి ఎన్నింటినో సరిచేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ప్రణాళిక లేకుండా వైసీపీ కొలువుదీర్చిన జిల్లాలను గాడిలో పెడతామని కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మెరుగుపడతాయని అటు యంత్రాంగం, ఇటు ప్రజలు ఆశించారు. అయితే పది నెలలైనా జిల్లా సమస్యలపై ప్రభుత్వం విధానాన్ని ప్రకటించలేదు. అయితే ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. కొత్త జిల్లాల అధికారులకు పూర్తి పాలనా పరమైన వెసులుబాటు కల్పించడంతో పాటు సమీకృత కలెక్టరేట్ నిర్మాణం కూడా పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే ఎప్పటికి సమస్యలు పరిష్కారమవుతాయో చూడాలి.

చీరాల మున్సిపాలిటీలో అవిశ్వాసానికి సిద్ధం?

- నిన్న, మొన్నటి దాకా చైర్మన్‌పై వాడీవేడి చర్చ
- గత శుక్రవారం సజావుగా సాగిన బడ్జెట్ సమావేశం
- తాజాగా తెరపైకి అసమ్మతి స్వరం
- ఇప్పటికే తీర్మానంపై టీడీపీ కౌన్సిలర్‌ల సంతకాలు
- మరో రెండు రోజుల్లో కలెక్టర్ దృష్టికి
- చైర్మన్ స్థానంపై మళ్లీ ఆశావాహుల్లో చిగురించిన ఆశలు

చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై టీడీపీ కౌన్సిలర్‌లు ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. రెండు మాసాలుగా చీరాల మునిసిపాలిటీలో జరిగిన కౌన్సిల్ సమావేశాలు, వివిధ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను గమనిస్తే చాలా వరకు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టనున్నట్లు జోరుగానే ప్రచారం జరిగింది. అయితే ఇటీవల ఆ పరిస్థితిపై అందరూ గుట్టు చప్పుడుకాకుండా ఉన్నారు. పైగా అదే సమయంలో ఇటీవల మునిసిపాలిటీలో వైసీపీ హయాంలో ఆబ్కాస్ ఉద్యోగాల్లో చేరిన వారిని తొలగించే క్రమంలో ఓ రెండు స్థానాలపై ఎమ్మెల్యే కొండయ్య, మాజీ ఎమ్మెల్యే బలరాం చరవాణీ ద్వారా సంభాషించుకున్నట్లు జోరుగా ప్రచారం జరిగింది. ఈ విధంగా చూసుకుంటే చీరాల్లో చైర్మన్ స్థానంపై అవిశ్వాసం లేనట్లేనని అందరూ గట్టిగా నమ్మారు. అయితే తిరిగి మూడు రోజుల క్రితం ఎమ్మెల్యే తన వర్గం కౌన్సిలర్‌లతో చర్చలు జరిపిన క్రమంలో మళ్లీ అవిశ్వాసం అంశం తిరిగి తెరపైకి వచ్చింది.



చీరాల మునిసిపల్ కార్యాలయం

జంజనంకు అదృష్టం వరించిందిలా

వైసీపీ హయాంలో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో 33 వార్డులకు సంబంధించి వైసీపీకి 21, స్వతంత్రులుగా-11, టీడీపీ-1 స్థానం దక్కించుకున్నారు. అయితే బాలినేని చొరవతో స్వతంత్రులు, టీడీపీ ఏకైక స్థానం వైసీపీకి మద్దతు తెలపడంతో అప్పటి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అండదండలతో జంజనం శ్రీనివాసరావు చైర్మన్ స్థానాన్ని దక్కించుకున్నారు. అయితే అప్పట్లోనే కొందరు చైర్మన్ స్థానంపై ఆశావాహులు స్పష్టంగా బలమైన ప్రయత్నాలు సాగించినప్పటికీ అదృష్టం జంజనంను వరించింది. ఇలా సాగుతున్న పురపాలక సంఘం పాలక వర్గంలో టీడీపీ కూటమి అధికారంతో చాలా మార్పులు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొందరు, గెలుపు అనంతరం మరికొందరు మొత్తంగా ప్రస్తుతం 15 మంది కౌన్సిలర్‌లు ఎమ్మెల్యే కొండయ్య వెంట ఉన్నారు. ఈ నేపథ్యంలో కొనసాగుతున్న పాలన సమయంలో కొన్నిసార్లు స్వల్పంగాను, మరికొన్ని సార్లు జరిగిన వాడివేడి చర్చలతో అవిశ్వాసం అంశం తెరపైకి వచ్చింది. ఈక్రమంలో ప్రస్తుతం టీడీపీకు 15, వైసీపీకి 13 కౌన్సిలర్‌లు, ఆమంచి వర్గానికి సంబంధించి 5గురు కౌన్సిలర్‌లు ఉన్నారు. అయితే మునిసిపాలిటీలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలను కలుపుకుంటే టీడీపీ బలం ఇప్పటికే 17కు చేరింది. ఈక్రమంలో చైర్మన్ పగ్గాలు చేపట్టేందుకు కనీసం 22 మంది కౌన్సిలర్‌లు ఉండాల్సి ఉంది.

తారస్థాయికి చేరిన అవిశ్వాస అంశం

గత ఫిబ్రవరిలో జరిగిన కౌన్సిల్ సమావేశంతో వివాదం తార స్థాయికి చేరింది. ఆసమయంలో అవిశ్వాసం జరుగుతుందని ఎమ్మెల్యే కొండయ్య కూడా ఘంటా పథంగా చెప్పారు. దీంతో కొంతమేరకు ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయనే చెప్పాలి. అదే సమయంలో ఆశావాహులు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే ఒకవేళ అవిశ్వాసం జరిగినా ఆశావాహుల్లో ఎవరో ఒకరికే అదృష్టం ఉంటుంది కాబట్టి చైర్మన్ స్థానంపై ఆసించి భంగపడిన వారిని తృప్తి పరిచే క్రమంలో కచ్చితంగా సమస్యలు మళ్లీ తీవ్రమయ్యే అవకాశం లేకపోలేదు. ఇదిలావుంటే సంతకాల సేకరణ అనంతరం శని, ఆది రెండు రోజులు సెలవులు రావడంతో వచ్చే సోమవారం సేకరించిన సతకాలతో కలెక్టర్‌ను టీడీపీ కౌన్సిలర్‌లు కలువనున్నట్లు సమాచారం. అయితే దీనిపై పూర్తి క్లారిటీ కోసం వేచి చూడాల్సిందే.


రైతుల ఫిర్యాదు మేరకు గ్రానైట్ క్వారీ ఆక్రమించిన దారిని పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

గ్రానైట్ క్వారీ ఆక్రమణలో పురాతన దారి

- మల్లాయపాలెం రైతులు అధికారులకు ఫిర్యాదు
- పరిశీలించిన మైనింగ్, రెవెన్యూ అధికారులు

బల్లికురవ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పురాతన కాలం నుంచి పొలాలకు వెళ్లే దారిని ఆర్డా గ్రానైట్ క్వారీ అడ్డగోలుగా ఆక్రమించి పంట భూములకు వెళ్లకుండా చేస్తుందని కొత్త మల్లాయపాలెం గ్రామానికి చెందిన జూపల్లి గంగాధర్ మరి కొందరు రైతులు అధికారులకు వరుస ఫిర్యాదులు చేశారు. రైతుల ఫిర్యాదులపై గురువారం జిల్లా మైనింగ్ ఆర్ఐ రాజేంద్రప్రసాద్, సర్వేయర్ నాగలక్ష్మి ఆర్డా గ్రానైట్ క్వారీని పరిశీలించారు. ఈసందర్భంగా గ్రానైట్ క్వారీ యజమాని అయిన బాచిన కృష్ణచైతన్యతో అధికారులు మాట్లాడారు. క్వారీ యజమాని వద్ద ఉన్న రికార్డులు అందించాలని వారు కోరారు. అనంతరం రైతులతో వారు మాట్లాడారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ తమకు ఎన్నో దశాబ్దాల నుంచి పొలాలకు వెళ్లే దారి సర్వే నెంబరు 871లో ఉందని, వైసీపీ హయాంలో కొందరు అధికారులు తమకు దారి లేకుండా చేశారని తహసీల్దార్, ఆర్డీవో రికార్డుల్లో పురాతన దారి ఉందని నివేదిక ఇచ్చారని తక్షణమే తమకు దారిని కేటాయించాలని లేకుంటే ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ పరిశీలనలో రెవెన్యూ సర్వేయర్ నారాయణరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి పాల్గొన్నారు. ఈ ఫిర్యాదులపై మైనింగ్ ఆర్ఐ రాజేంద్ర ప్రాద్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. సర్వే చేసేందుకు మండల సర్వేయర్ లేక పోవ డంతో మరో మారు వస్తామని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

సాధారణ కాన్పులతో తల్లీబిడ్డ క్షేమం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సాధారణ కాన్పులతో తల్లికి, బిడ్డకు క్షేమంగా ఉండడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని గర్భిణీ, స్త్రీత వైద్య నిపుణురాలు డాక్టర్ కె.వాహిల చౌదరి తెలిపారు. గురువారం అద్దంకి సీహెచ్‌సీలో గర్భిణులు, ఆశా కార్యకర్తలకు కాన్పులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ కాన్పులను ప్రోత్సహించాలన్నారు. ఆపరేషన్ జరగడం వలన అంటు వ్యాధులు, రక్త స్రావణ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తద్వారా తల్లికి ఆరోగ్య పరంగా ఇబ్బంది అని తెలియజేశారు. గర్భిణులను ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించండంతో పాటు సాధారణ కాన్పుల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని డాక్టర్ వాహిల సూచించారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉడుత్త సూర్యారావు జ్ఞాపకార్థం కుమారుడు లక్ష్మణ్ కుమార్ ఉమ సౌజన్యంతో ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి అనుమతించిన ఆర్టీసీ డిపో మేనేజర్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తేలియజేస్తూ సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ ఐతా రాజా, జోన్ చైర్మన్ వీవీ ఆదినారాయణ, మోహన్‌వంశీనాథ్, విజయలక్ష్మి, ఎస్వీ రమణ, హరిబాబు, జయరామ్, సురేష్ పాల్గొన్నారు.

పంచాయతీలో పన్నుల వివరాలను ఇవ్వాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలోని పంచాయతీ కార్యదర్శులు అందరూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వసూలు చేసిన పైకము 100శాతం పంచాయతీ సాధారణ నిధులకు జమచేయాలని ఈవోఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. పన్నుల వివరాలను ఈ నెల 5వ తేదీలోగా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శి విఫలమైతే నిధులు దుర్వినియోగం చేసినట్లు భావించి వారిపై శాఖాపరమైన చర్యల కోసం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నిరుపేద బాలింతకు ఆర్థిక సాయం

- ఒకే కాన్పులో ముగ్గురికి జన్మనిచ్చిన తల్లి
- వారిలో మగ శిశువు మృతి, మరో ఇద్దరికి వైద్యం


చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ రోడ్డులో నివాసముంటున్న ఓ నిరుపేద బాలింత కోమట్ల ధనలక్ష్మి ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే వారిలో ఒక మగ బిడ్డ మృత్యువాత పడగా, మరో మగ బిడ్డ, ఆడ బిడ్డకు వైద్యం పొందేందుకు అవసరం ఉంది. ఈక్రమంలో బాలింత, చిన్నారులను కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. దీంతో ఆ కుటుంబానికి కుమ్మరి కోటిరెడ్డి (కేకేఆర్) చారిటబుల్ ట్రస్టు ఓటికుండల విజయభాస్కరరెడ్డి (యూఎస్‌ఏ) మిత్రులతో కలిసి రూ.లక్ష చెక్కును బంధువులకు అందజేశారు. అలాగే మరో దాత రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, అంజిరెడ్డి, వేజెండ్ల శ్రీనివాసరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్

పరారీలో మరో నిందితుడు జీఆర్పీ కానిస్టేబుల్

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురిని అరెస్ట్ చేయగా, మరో నిందితుడు జీఆర్‌పీ కానిస్టేబుల్ పరారీలో ఉన్నారు. గురువారం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎండి మొయిన్ ఆ కేసు వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని గవినివారి పాలెంకు చెందిన చీదరబోయిన నాగేశ్వరరావు ప్రస్తుతం ఢిల్లీలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల సెలవులపై వచ్చారు. ఇతనికి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, వీరయ్య, భరత్, వేణు, కుమార స్వామి, జీఆర్పీ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణకు గతంలో స్థలం వివాదం ఉంది. ఈక్రమంలో గత నెల 30వ తేదీన జరిగిన గొడవలో ఆరుగురు ఇతనిపై కత్తితో దాడిచేసి గాయపరిచారు. దీనిపై నమోదైన కేసులో ఐదుగురుని ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే జీఆర్పీ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ శేషగరిరావు, ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.


ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్, పక్కన శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్


భవనాసి చెరువులో విరబూసిన తామర పువ్వులు

భవనాసికి తామర పువ్వుల శోభ

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలోని భవనాసి చెరువులో తామర పువ్వులు విస్తారంగా ఉన్నాయి. ఆకాశంలో నక్షత్రాలు విరాజిల్లినట్లు చెరువు నీటిపై తామర పువ్వులు తెల్లగా మెరుస్తున్నాయి. శింగరకొండ వచ్చే భక్తులతో పాటు నామ్ రోడ్డున ప్రయాణించే ప్రజలు భవనాసి లోని తామరపువ్వుల అందాన్ని చూసి మురిసి పోతున్నారు.

ముప్పవరం ఉన్నత పాఠశాలలో జిమ్, గ్రంథాలయం ఏర్పాటు

పంగులూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామంలోని పీఎస్ఎన్‌సీసీ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో విద్యార్థుల వ్యాయామం కోసం జిమ్, జ్ఞానసముపార్జన కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సీఎస్ఆర్ గ్రూప్, ఇంటరైజ్ సంస్థ, సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు జిమ్‌కు అవసరమైన పరికరాలు, ఇతర ఆటవస్తువులతో పాటు గ్రంథాలయ నిర్వహణకు అవసరమైన పుస్తకాలు, కుర్చీలు, బల్లలు సమకూర్చారు. దాతల సాయంతో సమకూరిన సామగ్రితో ఏర్పాటు చేసిన జిమ్, గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభించారు. వ్యాయామ గదిని రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ప్రతినిధి వెంకటేష్ ప్రారంభించగా, గ్రంథాలయాన్ని సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధలు ప్రారంభించారు. దాతలకు హెచ్ఎం పుచ్చకాయల ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్, వెంకటేష్, సింహపురి హైవే ప్రతినిధులు కిరణ్‌కుమార్, ఆనంద్‌సింగ్, కోటేశ్వరరావు, గిరి, రోటరీ ఆంధ్ర చైర్మన్ గరిమిడి జగన్మోహన్‌రావు, పాఠశాల కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల సింగయ్య, పీడీ శేషగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ హైవే ప్రతినిధులు

తెలుగు సంప్రదాయాలను గౌరవించండి


భానుచంద్రమూర్తిని సత్కరిస్తున్న ప్రతినిధులు

చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రాత్రి స్థానిక మహిళా మండలిలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో భాగంగా కవి సమ్మేళనం జరిగింది. దీంతో కవులు, సైన్స్ ఉపాధ్యాయులు, రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పవని భానుచంద్రమూర్తి, శేష వరలక్ష్మిని ఘనంగా సత్కరించారు. మదర్ సర్వీస్ సొసైటీ, ఆలమూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సుబ్బరాజు, శ్రీనివాసరెడ్డి, బత్తుల బ్రహ్మారెడ్డి, అబ్రహాం, బ్లెస్సీ డా.సజ్నా, వడలి రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించండి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఐదు సంవత్సరాలు నిండిని ప్రతి చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందించి వసతులు, పథకాలను సద్వినియోగ పర్చుకోవాలని హెచ్ఎం ఎంవీ రమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిధిలోని గ్రామాలల్లో పర్యటించి విద్యార్థులను బడిలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలల్లో నూతన బోధన, వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నం భోజనం వంటి వసతులను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలలోని మీ పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంతో, సీర్పీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూముల రీ-సర్వే ప్రారంభం



రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, పోలూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ రవికుమార్

- సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

కావూరివారిపాలెం(చీరాల), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు రీ-సర్వేలో పాల్గొని సమస్యలకు పరిష్కారం పొందాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని కావూరివారి పాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా, హద్దులు, తదితర సమస్యలకు సర్వేలో వేగంగా పరిష్కారం ఉంటుందని చెప్పారు. అందుకు సంబంధించి శుక్రవారం గవినివారిపాలెంలో నిర్వహించే గ్రామ సభలో భూ యజమానులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ అర్జున్, వీఆర్వో సోమయ్య, స్థానికులు పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి

మార్టూరు : రైతులు రీసర్వేపై పూర్తి అవగాహనతో ఉండాలని, అధికారులకు సహకరించాలని ఆర్డీవో గ్లోరియా అన్నారు. గురువారం యద్దనపూడి మండలంలోని యనమదల,పోలూరు గ్రామాలలో రీసర్వేపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలూరు గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామ సభకు ఆర్డీవో గ్లోరియా ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ సభలో మాట్లాడుతూ గ్రామాలలో రైతులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తున్నదన్నారు. రైతులు సహకరించాలని,వారి భూములు, పొలాలవివరాలును సక్రమంగా నమోదు చేయించుకోవాలన్నారు. అంతకుముందు గ్రామ సచివాలయం వద్ద తహసీల్దార్ కే రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ విష్ణుప్రసాద్, మండల సర్వేయర్ సాంబశివరావు, పలువురు సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు రావిపాటి సీతయ్య పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని కొండమూరు, బూదవాడ గ్రామాలలో భూముల రీసర్వే ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గురువారం రెండు గ్రామాలలో తహసీలార్ సింగారావు నేతృత్వంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సింగారావు మాట్లాడుతూ ఈ ఏడాది తొలివిడతగా బైటమంజులూరులో రీ-సర్వే చేపట్టి కొనసాగిస్తున్నామన్నారు. కొండమూరు, బూదవాడ గ్రామాలలో గురువారం నుంచి రీసర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. రీసర్వే ప్రక్రియ పూర్తి చేసేందుకు వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్‌ఏలతో ఒక్కో గ్రామానికి మూడు బృందాలను నియమించినట్లు తెలిపారు. అవగాహన ర్యాలీలో తహసీల్దార్ సింగారావు, డీటీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ సురేష్‌బాబు, ఆర్ఐ శ్వేత, గ్రామ నేతలు అంజయ్య, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. గురువారం మండలం నూతలపాడులో రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ, సర్పంచ్ చిన్నయ్య, మండల సర్వేయర్, వీఆర్వోలు, వీఎస్ఎస్‌లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

చినగంజాం : గ్రామాల్లో నిర్వహిస్తున్న రీ సర్వేని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని చినగంజాం, సంతరావూరు గ్రామాల్లో రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేపై రైతులకు ముందుగా సమాచారం తెలియజేస్తామన్నారు. సర్వే సమయంలో తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు రా యని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్య, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఏలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : భూ సర్వేను వినియోగించుకోవాలని తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హనుమంతరావు, సాంబయ్య,మార్క్ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం విక్రయాలపై జాగ్రత్తలు పాటించండి

చీరాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బెల్లం విక్రయాలు జరిపే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్టేషన్‌లో బెల్లం దుకాణ దారులతో సమావేశం నిర్వహించారు. విక్రయాలకు సంబంధించి కచ్చితంగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, దుకాణదారులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి


అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాలలో జరుగుతున్న నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి పట్టణంలోని గరటయ్యకాలనీ సమీపంలో అర్బన్ హెల్త్ సెంటర్ భవనం నిర్మాణ పనులు గురువారం కమిషనర్ పరిశీలించారు. శ్మశానం పక్కన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రహరీ గోడ, రేణింగవరం రోడ్డు వెంబడి కల్వర్టు పనులను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. మొండితోకపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న సైడ్ డ్రైన్ పనులు పరిశీలించారు. బంగ్లా రోడ్డులోని శ్రీ చైతన్య స్కూల్‌లో ఫుడ్ స్టాల్ పై విద్యార్థుల తల్లిదండ్రులు, కౌన్సిలర్‌ల నుంచి ఫిర్యాదులు అందడంతో రవీంద్ర పరిశీలించారు. ప్యాకింగ్ లేని తినుబండారాలు అమ్మవద్దని తెలిపారు. శానిటేషన్, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు.

వైభవంగా రామాలయంపై శిఖర కలశ ప్రతిష్ఠ

భక్తులకు అన్నదానం

మార్టూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులో ఈశాన్య రామాలయం పైభాగాన శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమం వేదపండితుల మంత్రోచ్ఛ రణతో గురువారం వైభవంగా జరిగింది. ఉదయం గణపతిపూజ నిర్వహించారు. వివిధ రకాల పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠను చేశారు. ఈ సందర్భంగా శ్రీసీతారామచంద్రస్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసీతా రామలక్ష్మణాంజనేయ స్వామి ఉత్సవ విగ్ర హాలకు ప్రత్యేక పూజలు చేశారు. కొన్నేళ్ల నుంచి శిథిల దశలో ఉన్న రామాలయంలో మరలా ప్రత్యేక పూజలు జరగడం పట్ల తూర్పుబజారులోని ప్రజానీకం సంతోషం వ్యక్తం చేశారు. శ్రీరామనవమి పండుగ రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాలు అనంతరం భక్తులకు అన్న వితరణ చేశారు.


రామాలయంపై శిఖర కలశ ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు, భక్తులు

8 నుంచి స్వామివార్ల కల్యాణ మహోత్సవం

ఉప్పుటూరు (పర్చూరు), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ చెన్న కేశవస్వామివార్ల కల్యాణ మహోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు గురువారం ప్రకటనలో తెలిపారు. బ్రహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈనెల 8 నుంచి 12 వరకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 11వ తేదీన స్వామి వార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



శ్రీరామ.. జైజైరామ

6న శ్రీరామ నవమి

జానకీరామ ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు

ఈ నెల 6వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలోని రామ మందిరాల్లో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయాలకు రంగులద్ది, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆదివారం జరిగే సీతారాముల కల్యాణాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు, తరలివచ్చే భక్తజనానికి ఏలోటూ రానీయకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రం వేడుకలకు ముస్తాబయ్యింది. రామస్తూపం ఉన్న మైదానంలో కల్యాణం జరిపేందుకు చలువ పందిళ్ల వేస్తున్నారు. అలాగే ట్రంకురోడ్డుపై డివైడర్ల మధ్యలో సీతారామ లక్ష్మణులతోపాటు ఆంజనేయుల ప్రతిమలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)

రామస్తూపం ఉన్న మైదానంలో ముస్తాబైన సీతారాముల కల్యాణ వేదిక, ట్రంకురోడ్డులోని డివైడర్ల మధ్యలో విద్యుద్దీప వెలుగుల్లో దేవతామూర్తులు



శబరి శ్రీరామక్షేత్రానికి విద్యుద్దీప అందాలు

రైళ్లలో చోరీలపై దర్యాప్తు వేగవంతం

- రెండు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- టోల్‌ప్లాజాల వద్ద సీసీ ఫుటేజ్‌ల సేకరణ
- విజయవాడ రైల్వే స్టేషన్‌లోనూ పరిశీలన
- అనుమానితుల గుర్తింపు

నెల్లూరు(క్రైం)/ బిట్రగుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అల్లూరు రోడ్డు వద్ద రైల్లో జరిగిన చోరీ కేసులో నెల్లూరు జీఆర్‌పీఎస్ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. డీఎస్పీ మురళీధర్ పర్య వేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం ఒక బృందం జిల్లాలోని గౌర వరం, వెంకటాచలం టోల్ ప్లాజాల వద్ద సంఘటన జరిగిన గంట ముందు, గంట తర్వాత సీసీ ఫుటేజ్‌లను సేకరించారు. మరో బృందం విజయవాడకు చేరుకొని మధురై ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కిన ప్రయాణికుల సీసీఫుటేజ్‌లను సేకరించారు. ఈ క్రమంలో కొంతమంది అనుమాని తులను గుర్తించినట్లు సమాచారం.

ఐదు నిమిషాల్లో పని పూర్తి

జిల్లాలోని అల్లూరు రోడ్డు సమీపంలో సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైలును ఆపి దొంగతనానికి పాల్పడిన విధానాన్ని గమనించిన పోలీసులు ఇది తప్పనిసరిగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన గ్యాంగ్ పని అని చెబుతున్నారు. వేసవిలో ఇలాంటి గ్యాంగ్ లు దక్షిణాది రాష్ట్రాలకు వచ్చి ఇలాంటి చోరీలకు పాల్పడి పరారవుతా యని చెబుతున్నారు. ఇలాంటి గ్యాంగ్‌లో ఐదు నుంచి పది మంది లోపు సభ్యులు ఉం టారని తెలుస్తున్నది. ఇలాంటి గ్యాంగ్‌లు రాత్రి పూట మాత్రమే రైలు లో దొంగతనాలు చేస్తాయి. గ్యాంగ్ సభ్యులు ఓ రైలును దొంగతనం చేసేందుకు ఎంపిక చేసుకొని ఆ రైలులో ప్రయాణికులతో కలిసి ప్రయాణం చేస్తారు. రైల్లో ప్రయాణం చేసే సమయంలోనే ఆ బోగీలో ఎంత మంది ఉన్నారు, ఎవరు మంచి నిద్రలో ఉన్నారు, ఎవరి మెడల్లో ఎంత బంగారు ఉంది...? నగదు ఉన్న బ్యాగులు ఉన్నాయా, సెల్‌ఫోన్‌లు జేబులో పెట్టుకొని నిద్రించే వారు ఎవరు... ఇలా గంటల సమయంలోనే పక్కా ప్లాన్ వేసుకుంటారు. రైలులో ఎక్కిన గ్యాంగ్ సభ్యులు వారి పనిలో వారు ఉంటే రైలు నిలిపే ప్రాంతంలో ఉన్న సభ్యులు ట్యాంపరింగ్‌చేసేందుకు సిద్ధంగా ఉంటారు. వారు ఎంపిక చేసుకున్న రైలు ఎక్కడ వస్తుందో తెలుసుకుంటూ సరిగా రైలు వారి అనుకున్న ప్రాంతంకు వచ్చే ఐదు నిముషాల ముందు సిగ్నెల్ ట్యాంపరింగ్ చేస్తారు. రెడ్ లేదా ఎల్లో సిగ్నిల్ పడుతూనే రైలు ఆగుతుంది. రైలు ఆగిన వెంటనే అప్పటికే పట్టాలపై సిద్ధంగా ఉన్న గ్యాంగ్ సభ్యులు రైలు బోగీల్లోకి ఎక్కుతారు. రైలులో ఉన్న వారు, పట్టాలపై నుంచి ఎక్కిన వారు అందరూ కలిసి అప్పటికే ఎంపిక చేసుకున్న బంగారు చైన్‌లు, సెల్‌ఫోన్‌లు, బ్యాగ్‌లను లాక్కొని రైలు దిగి పరుగులు తీస్తారు. సరిగ్గా మూడు నిమిషాల నుంచి ఐదు నిమిషాల మధ్య దొంగతనం పూర్తి చేస్తారు. ప్రయాణికులు ఎదురు తిరిగినా, వారిని పట్టుకునేందుకు ప్రయత్నించినా, పట్టాలకు పక్కనే ఉన్న రాళ్లను విసురుతూ తప్పించుకుంటారు. ఇలా వేసవిలో ఈ గ్యాంగ్‌లు వరుస చోరీలకు పాల్పడుతూ దొరికినకాడికి దోచుకుంటారు.



నేడు జిల్లాకు గృహ నిర్మాణశాఖ మంత్రి రాక

నెల్లూరు (హరనాధపురం) ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30గంటలకు నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలోని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసానికి ఆయన చేరుకుంటారు. 9.30గంటలకు సోమిరెడ్డితో కలిసి తోటపల్లిగూడూరు మండలం వరిగొండలోని లేఅవుట్‌ను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. 11.30గంటలకు పొదలకూ రుకు చేరుకుంటారు. అక్కడ హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడ తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా అధికా రులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహి స్తారు. అనంతరం సంతపేటలోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసానికి చేరుకుంటారు. తదుపరి ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. సాయంత్రం ఆరుగంటలకు తిరుపతి జిల్లా గూడూరు సమీపంలోని ఆది శంకర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొం టారు. అక్కడ మహర్షి మహేష్ యోగీ విగ్ర హాన్ని ఆవిష్కరిస్తారు. రాత్రి 9గంటలకు తిరుపతి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని హైదరాబాద్‌కు వెళతారు.



గూడు గుట్టు విప్పేనా..!?

- గాడితప్పిన గృహ నిర్మాణశాఖ
- అధికారులతో నేడు మంత్రి పార్థసారథి సమీక్ష

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'పేదలకు సొంతింటి కల నేరవేరుస్తాం... కాలనీలు కాదు.. ఊర్లు ఏర్పాటు చేస్తున్నాం... పేదింటిలోని ప్రతి అక్కాచెల్లెమ్మకు సొంత ఆస్తిని కల్పిస్తున్నాం'... అంటూ గత వైసీపీ ప్రభుత్వంలో రూ.వేల కోట్లతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. అంతేకాక పక్కా ఇళ్ల నిర్మాణానికి అప్పటి నాయకులు శ్రీకారం చుట్టారు. ఇక్కడే ఆ నేతలు పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు.

అక్రమాలకు అంతేలేదు...

జగనన్న కాలనీల పేరుతో తక్కువ ధరకు భూములు కొని, ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మేశారు. పేదల పేరుతో రూ.కోట్ల నిధులను వైసీపీ నేతలు దిగమిం గారు. గృహ నిర్మాణాల పేరుతో ఇసుక, స్టీలు, సిమెంటు వంటి మెటీరియల్ బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకొని పాలకులు, కొంత మంది అధికారులు, ఉద్యోగులు భారీ అక్రమాలకు పాల్పడ్డారు. జగన్ ప్రభుత్వం రూ.వేల కోట్ల నిధులు ఖర్చు చేశామని చెబుతున్నా, పేదవాడికి మాత్రం సొంతింటి కల నేరవేర లేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగనన్న లేఅవుట్లు, పక్కా ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి, అక్రమాలపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. దీంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో జిల్లాలోని విజిలెన్స్ యం త్రాంగం అన్ని లేఅవుట్‌ల్లో జరిగిన పక్కా ఇళ్ల నిర్మాణాలపై విచారణ చేపట్టింది. ఈ విచారణలో గత ప్రభుత్వంలో జరిగిన భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా ఇళ్ల నిర్మాణాలకు వినియోగించాల్సిన ఇసుక, సిమెంటు, స్టీలు పెద్దఎత్తున మాయమైనట్లు విచారణలో తేలింది.



వెంకటాచలంలోని జగనన్న కాలనీ

రూ.110 కోట్ల అవినీ

జిల్లాలోని అన్నీ లేఅవుట్లను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు దాదాపుగా రూ.110 కోట్ల మేర నిధులను అటు నాయకులు, కాంట్రాక్టర్లు, ఇటు అధికారులు, ఉద్యోగులు కొల్లగొట్టినట్లు లెక్కలు తేల్చారు. ఇందులో సుమారుగా 300 మందికి పైగా అధికారులు, ఉద్యోగుల పాత్ర ఉన్నట్లుగా తేల్చారు. అయితే అవినీతికి పాల్పడ్డ అధికారులు, ఉద్యోగులు ప్రస్తుత పాలకులను ప్రసన్నం చేసుకుంటుండడంతో భారీ స్థాయిలో అవినీతి బయటపడినా చర్యలు మాత్రం పెద్దగా కనిపించడం లేదు. విజిలెన్స్ అధికారలు ఇచ్చిన నివేదికను ప్రభుత్వ పెద్దలు ఎందుకో పట్టించుకోవడం లేదు. కేవలం జిల్లా యంత్రాంగం అక్కడక్కడ కొంత మేరకు విచారణ జరిపి కలెక్టర్‌కు ఇస్తున్న నివేదికలపై అరకొరగా చర్యలు ఉంటున్నాయి. దీంతో హౌసింగ్‌లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించిన ప్రభుత్వ పెద్దలు ఆ తర్వాత దాన్ని పక్కన పెట్టారు. దీంతో భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన నాయకులు, అధికారులు, ఉద్యోగులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటున్నారు.

లేఅవుట్లలో అక్రమాలు నిజమే..!

- నివాసయోగ్యం కాని భూముల్లో పేదలకు పట్టాలు
- అధిక ధరలకు పొలాల కొనుగోలు
- విజిలెన్స్ విచారణలో వెలుగు చూసిన నిజాలు
- కొనసాగుతున్న డ్వామా అధికారుల విచారణ

నెల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో వేసిన లేఅవుట్ల మాటున భారీ అక్రమాలు జరిగాయని నిర్ధారణ అయ్యింది. తక్కువ ధర ఉన్న భూములను ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం, నివాసయోగ్యం కాని చోట లేఅవుట్లు వేయడం వంటి అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. అంగేకాక లేఅవుట్లలో లెవలింగ్ పేరుతో కూడా భారీ దోపిడీ జరిగినట్లు డ్వామా అధికారుల విచారణలో బయటపడింది.

తొలి నుంచి ఆరోపణలు

పేదల ఇళ్ల స్థలాల వ్యవహారంలో మొదటి నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరు ద్ధంగా భారీ ధరలు ఖరారు చేసి దోచిపెట్టారన్న ప్రచారం జరిగింది. నివాస యోగ్యం కాని భూములను కూడా అధిక ధరలతో కొనుగోలు చేశారన్న ఫిర్యాదులున్నాయి. అప్ప ట్లోనే ఎన్ని ఆరోపణలు వచ్చినా పట్టించుకున్న వారు లేరు. ప్రస్తుతం జిల్లా పరిధిలో 852 లేఅవుట్లు వేయగా, అందుకు 2832 ఎకరా లను వినియోగించారు. ఇందులో 1052 ఎకరాలను ప్రైవేటు వ్యక్తుల నుంచి భూసే కరణ ద్వారా తీసుకున్నారు. ఇందుకు రూ.210 కోట్లు ఖర్చు చేశారు. ఈ కొను గోలుకు ప్రభుత్వం కొన్ని విధివిధా నాలు రూపొందించింది. కానీ చాలా చోట్ల అవేవీ పాటించలేదని ఆ లేఅవుట్లను చూస్తేనే అర్థమవుతోంది. తహసీల్దార్ నుంచి కలెక్టర్ స్థాయి వరకూ ప్రతీ ఒక్కరూ ఇందులో పాత్రధారులుగా ఉన్నారు.

పేదల ఇళ్లపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఇళ్లపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో అనేక చోట్ల నివాసానికి పనికి రాని లేఅవుట్లను వేసి ప్రజాధనాన్ని దోచుకున్నారన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ఈ లేఅవుట్లకు అవసరమైన భూమి కొనుగోలు దగ్గర నుంచి ఆ భూమిని చదును చేయడం వరకూ అవినీతి జరిగిందన్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలోనే భూమి కొనుగోళ్ల, లేఅవుట్ల స్వభావంపై విచారణకు విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది. ప్రైవేటు వ్యక్తుల నుంచి భూమిని కొనుగోలు చేసి వేసిన లేఅవుట్లను పరిశీలించగా నాలుగో వంతు లేఅవుట్లలో అవకతవకలు గుర్తించారు. కొన్ని అధిక ధరలకు కొనుగోలు చేయగా, మరికొన్ని చెరువులు, శ్మశానాలు ఆనుకొని వేశారని తేల్చారు. ఇక్కడ నివాసం ఉండేందుకు పేదలు ముందుకు రావడం లేదని, దాని ఫలితంగా రూ.కోట్లు ప్రజాధనం దుర్వినియోగమైనట్లు విజిలెన్స్ విభాగం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.



చదును పేరుతో దోపిడీ

ఉమ్మడి జిల్లా పరిధిలో డ్వామా నుంచి 1170 లేఅవుట్లను గ్రావెల్‌తో చదును చేసినట్లుగా చూపించి ఇప్పటికి సుమారు రూ.60 కోట్లను బిల్లులుగా తీసేసుకున్నారు. ఎంబుక్‌ల ప్రకారం ఇంకా రూ.33 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే చాలా లేఅవుట్లలో లెవలింగ్ అవసరం లేకపోయిన్పటికీ పైపైనే లెవలింగ్ చేసి భారీగా బిల్లులు పెట్టుకున్నట్లు అధికారుల విచారణలో బయటపడింది. లేఅవుట్ల చదునుకు గానూ క్యూబిక్ మీటర్ గ్రావెల్‌కు రూ.135 చెల్లించేలా వైసీపీ ప్రభుత్వంలో నిర్ణయించారు. అప్రూవ్డ్ క్వారీ నుంచి తీసుకొచ్చిన గ్రావెల్‌కే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. అలా కాకుండా తహసీల్దార్ల అనుమతితో ప్రభుత్వ భూముల్లో నుంచి గ్రావెల్‌ను తీసుకెళితే రూ.50 తగ్గించి క్యూబిక్ మీటర్‌కు రూ.85 చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో మెజారిటీ లేఅవుట్లకు ప్రభుత్వ భూముల నుంచే గ్రావెల్‌ను తరలించారు. కానీ బిల్లుల దగ్గరికి వచ్చే సరికి రూ.135 చొప్పున చెల్లించారు. ఇలా రూ.కోట్లు పక్కదారిపట్టి నట్లు తెలుస్తోంది. డ్వామా అధికారుల విచారణ కూడా పూర్తయితే ఆ నివేదిక కూడా ప్రభుత్వానికి చేరనుంది. ఈ నివేదికల ఆధా రంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తిగా మారింది.



ఉదయగిరిలో కురుస్తున్న వర్షం

మెట్టలో ఈదురు గాలులతో వర్షం

- ఉదయగిరిలో నేలకొరిగిన ఫ్లెక్సీలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండధాటికి తట్టుకోలేని ప్రజలు సాయంత్రం సమయంలో వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. వర్షంతోపాటు ఈదురు గాలులు బలంగా వీయడంతో బస్టాండ్ ప్రాంతం, వీధులు దుమ్ముధూళితో నిండాయి. గాలుల దెబ్బకు ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు నేలకొరిగి, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మామిడి చెట్లకు అరకొరగా ఉన్న కాయలు, పూత సైతం నేల రాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

విధులకు డుమ్మా!

- తొలిరోజే 1,558గాను 899 మందే హాజరు
- 'స్పాట్'కు రాకుండా ఉండేందుకు టీచర్ల యత్నం
- ఎండ తీవ్రత, సెలవులే కారణం
- 'పది' మూల్యాంకనం ప్రారంభం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 9 వరకు ఈ ప్రక్రియను నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. వివిధ జిల్లాలకు చెందిన 1,92,920 సమాధాన పత్రాలు జిల్లాకు చేరాయి. వీటిని కట్టుదిట్టమైన భద్రత మధ్య మూల్యాంకనం చేపట్టేందుకు విద్యాశాఖ 1,558 మంది సిబ్బందిని నియమించింది. ఎండ తీవ్రంగా ఉండడం, సెలవులు కావడంతో ఎక్కువమంది ఉపాధ్యాయులు వివిధ కారణాలను చూపుతూ స్పాట్‌కు డుమ్మా కొట్టేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వీరిలో కొంతమందిని అధికారులు రిలీవ్ చేయగా, మరికొంత మంది తప్పనిసరి పరిస్థితుల్లో విధులకు హాజరు కావాల్సి వచ్చింది.

కచ్చితంగా హాజరవ్వాలి

విధులకు నియమించిన ప్రతీ ఉపాధ్యాయుడు కచ్చితంగా హాజరు కావాల్సిందేనని అధికా రులు పేర్కొన్నారు. అయితే ఎక్కువ మంది వివిధ కారణాలతో విధులకు హాజరు కాలేమని రాతపూర్వ కంగా అధికారులకు తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొంతమందిని రిలీవ్ చేశారు. స్పాట్‌కు హాజరువారిని వెంటనే హాజరయ్యేలా ఆదేశాలు జారీచేయాలని ఎంఈవోలకు అధికారులు సూచించారు. చీఫ్ ఎగ్జామినర్స్, అసిస్టెంట్ ఎగ్జామినర్స్, స్పెషల్ అసిస్టెంట్‌లతోపాటు విద్యాశాఖ సిబ్బంది కూడా ఈ విధులు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు మూల్యాంకనం నిర్వహించనున్నారు. తొలిరోజు మాత్రం ఉపాధ్యాయుల గైర్హాజరు, వివిధ కారణాలతో డుమ్మాయత్నాలతో 899 మంది సిబ్బందితోనే స్పాట్‌ను నిర్వహించారు. రెండోరోజు నుంచి పూర్తిస్థాయిలో సిబ్బంది హాజర య్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.



మూల్యాంకనానికి హాజరైన ఉపాధ్యాయులు

మూల్యాంకనానికి ప్రత్యేకంగా నిధులు

పదోతరగతి పరీక్షల నిర్వహణ సమయంలో కేటాయించిన రీతిలోనే మూల్యాంకన సమయంలో కూడా సిబ్బందికి ప్రత్యేక నిధులు కేటాయించారు. వివిధ విభాగాల్లో రోజువారీ వేతనాలను అందించనున్నారు. వీరిలో క్యాంప్ ఆఫీసర్‌కు రూ.578లు, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్స్‌కు రూ.495లు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు 429లు, చీఫ్ ఎగ్జామినర్‌కు రూ.396లు, అసిస్టెంట్ ఎగ్జామినర్‌కు పేపర్‌కు రూ.10లు, స్పెషల్ అసిస్టెంట్‌కు రూ.300లు, క్లరికల్ అసిస్టెంట్‌లకు రూ.132లు, సబార్డినేట్స్‌కు రూ.83లు, చీఫ్ కోడింగ్ ఆఫీసర్స్‌కు రూ.330లు, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్‌కు రూ.297లు, అందించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే విధులకు హాజరయ్యే సిబ్బంది ప్రతి ఒక్కరూ కూడా బయోమెట్రిక్‌లో వేలిముద్రలు తప్పనిసరిగా వేయాలి.

కట్టుదిట్టమైన చర్యలు

మూల్యాంకనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. సిబ్బంది పనితీరు, మూల్యాంకనం చేసే విధానాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఈ కెమెరాలను ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్‌కు అనుసంధానం చేశాం. ఉపాధ్యాయులు విధులు నిర్వహించకపోయినా, గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నా, ఇతర సమస్యలేమన్నా సరే ఈ కెమెరాల ద్వారా గుర్తిస్తాం. విధుల్లో ఉన్న సమయంలో సెల్‌ఫోన్‌ను అనుమతించం. నిర్దేశించిన సంఖ్య మేరకు మూల్యాంకనం పూర్తికాకపోతే అదనపు సమయమైనా తీసుకుని పని పూర్తి చేస్తాం.

- డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	246

కోడిగుడ్ల ధర (100): 440



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు

గ్రామసభలకు 25 వినతులు

కొండాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూములకు సంబంధించిన నోషనల్ ఖాతాలు కలిగిన రైతుల ఖాతాలను రెగ్యులరైజ్ చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు గురువారం గ్రామసభలు నిర్వహించారు. నేకునాంపేట సచివాలయంలో జరిగిన గ్రామసభకు 5వినతులు, సాయిపేట సచివాలయంలో జరిగిన గ్రామసభకు 20వినతులు అందినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు. వినతులను పరిశీలించి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నేడు గుడవళ్లూరు, పార్లపల్లిలో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగసముద్రం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఆర్ కోట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ షేక్ ఫిరోజ్ గురువారం చెప్పారు.ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగి ఉన్నాయని, వీటికి సపోర్టుగా మరికొన్ని స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కారణంగా వీఆర్ కోట, తూనుగుంట, అన్నెబోయినపల్లి, అంగిరేకులపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఆయన తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏకే నగర్ సెంటరులోని తపాలా కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని సంఘ విద్రోహశక్తులు ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంగం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విగ్రహం పాక్షికంగా దెబ్బతిందని ఈ ఘటన అంబేడ్కర్ వారసుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని వివరించారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని పేర్కొన్నారు.

ఉపాధి పథకం కింద మొక్కలు నాటుదాం



ప్రభుత్వ భూములు పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు

కలిగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకం కింద మండలంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు. క్లస్టర్ ఏపీడీగా నూతన బాధ్యతలు స్వీకరించిన మృదులతో కలిసి పెద్దకొండూరు పంచాయతీ పరిధిలోని పెద్దపాడులో గురువారం ప్రభుత్వ భూములు పరిశీలించారు. ఏ ప్రాంతాల్లో మొక్కలు నాటాలో, ఎన్ని మొక్కలు అవసరమవుతాయనే విషయాలను చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొక్కా హజరత్ రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యసాధనకు కృషి చేయాలి



నియామక పత్రాలు అందజేస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

అల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే లక్ష్య సాధనకు కృషి చేయాలని తహ సీల్దారు లక్ష్మీనారా యణ అన్నారు. అల్లూరులోని రామకృష్ణ డిగ్రీ కళా శాలలో గురువారం చెన్నై, హైదరాబాద్‌లకు చెందిన ఐదు కంపెనీలు 2020 నుంచి 2025 వరకు ఈ కళాశాలలో విద్యనభ్యసించిన డిగ్రీ, పీజీ, బిటెక్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రస్తుతం డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహిం చారు. ఎంపికైన విద్యార్థులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. రామకృష్ణ కళాశాల విద్యార్థులు కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొని తమ ప్రతిభను చాటి ఉద్యోగాలు సాధించడం గర్వించతగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన 50మంది విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ హరిప్రసాద్ మాట్లాడారు. 75మంది విద్యార్థులు పాల్గొనగా 50మంది ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ అవకాశం కల్పించేందుకు కృషి చేసిన కరస్పాండెంట్ అల్లంపాటి ఇందిరమ్మ, అల్లంపాటి లోకేశ్వర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు పి.మల్లికార్జున, ఎం.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు సచివాలయంలో గ్రామసభ నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

జీరో ఖాతా భూములకు పాసుపుస్తకాలు

ఉలవపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల్లో జీరో ఖాతాలో నమోదైన భూములకు సంబంధిత రైతు సరైన ఆధారాలు చూపించి పట్టాదారు పాసుపుస్తకం పొందవచ్చని తహసీల్దార్ శ్రీనివాసులు రైతులకు సూచించారు. గురువారం స్థానిక సచివాలయం-1లో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూమి హక్కుదారుడై ఉండి పట్టాదారు పాసుపుస్తకం లేకుంటే సంబంధిత హక్కు పత్రాలను పరిశీలించి పట్టాదారు పాసుపుస్తకాలు కల్పించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉలవపాడు-2 సచివాలయంలో జరిగే గ్రామసభలో అవకాశం ఉన్న రైతులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగలక్ష్మీ, మండల సర్వేయర్ ఖాదర్ హుస్సేన్, వీఆర్వో పీరయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మేత పోరంబోకును మేసేశారు...!

- కొన్నేళ్ల నుంచి యథేచ్ఛగా భూముల ఆక్రమణ
- ఇతరులకు కౌలుకు ఇస్తున్న వైనం
- జోరుగా పంటల సాగు... పట్టించుకోని అధికారులు

లింగసముద్రం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురానికి చెందిన మేత పోరంబోకు భూములు కొన్నేళ్ల నుంచి ఆక్రమణలకు గురయ్యాయి. ఈ ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు చాలా ఏళ్ల నుంచి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా వారు పట్టించుకోవడం లేదు.

ఆక్రమిత భూముల్లో పంటల సాగు

గ్రామ సర్వే నంబర్లు 155/1, 155/2లలో సుమారు 155 ఎకరాల మేత పోరంబోకు భూములు ఉన్నాయి.గ్రామంలోని పశువులు, మేకలు, గొర్రెలు ఈ భూముల్లో మేత మేస్తుంటాయి.అయితే ఈ భూములను గ్రామానికి చెందిన పలువురు ఆక్రమించి, పంటలు సాగు చేయడంతోపాటు బాటలు కూడా ఆక్రమించారు. అయితే గ్రామానికి చెందిన కొందరు ఈ భూములను ఆక్రమించి పొగనారు, పొగాకు, కంది, వరి పైర్లు సాగు చేస్తున్నారు. వీరు 5 నుంచి 10 ఎకరాల వరకు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాక మరికొందరు పొగనారు సాగు చేస్తూ, వాటిని రక్షించుకునేందుకు నీటినిల్వ కోసం పెద్ద పెద్ద గుంతలు తీశారు. అంతేకాక 10 వరకు బోర్లు కూడా వేసుకొని విద్యుత్ కనెక్షన్లు కూడా తీసుకున్నారు.



వెంగళాపురం మేత పోరంబోకు భూమిలో సాగు చేసిన పొగాకు



ఆక్రమిత భూముల్లో వేసిన బోరు

కబ్జానేకాదు కౌలుకు కూడా...

భూములను కబ్జా చేయడ మేకాదు... ఈ భూములను తిమ్మారెడ్డిపాలెం, మాలకొండ రాయునిపాలెం, ఎర్రారెడ్డిపాలెం రైతులకు పొగనారు సాగుకు కౌలుకు ఇస్తున్నట్టు చెబుతున్నారు.ఒక్కో ఎకరాకు రూ.5 వేలు కౌలు తీసుకుంటున్నట్టు చెప్పారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారుల నుంచి భూములను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పొగ నారుకు నీటి కోసం తీసిన పెద్ద గుంత

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కందుకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్‌కు ఉచిత శిక్షణతో పాటు మెటీరియల్ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె మస్తానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమైనందున పదవ తరగతి ఉత్తీర్ణులై పాలీసెట్ పట్ల ఆసక్తి ఉన్నవారంతా సద్వినియోగం చేసుకోవాలని, కళాశాలలో ఉచిత ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈనెల 30న పాలిసెట్ పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు.

104 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 438పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో ఏడు కంపెనీ ప్రతినిధులు పాల్గొని 334బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-59, ఆర్ఆర్-3, నీఆర్-15, జంపింగ్‌లాట్స్-27 కారణాలతో 104బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.235, సగటు ధర రూ.266.58గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ. మేకపాడు ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం పదవ తరగతి పూర్తయిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ యు దాస్ ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, ఎంబైపీసీ గ్రూపులు అందుబాటు లో ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు మే 22లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫీజు ఓసీ, బీసీలకు రూ. 200, ఎస్సీ, ఎస్టీలకు రూ. 150 మాత్రమేనని ఆయన తెలిపారు.

ఆదరణ కేంద్రానికి మతిస్థిమితం లేని మహిళ



బిట్రగుంట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో మతి స్థిమితం లేని మహిళను సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బందిని గుర్తించి గురువారం సాయంత్రం ఆదరణ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళా పోలీసు జయశ్రీ మాట్లాడారు. గ్రామంలో 35ఏళ్ల ఒంటరి మహిళ తిరుగుతుందని స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. ముంగమూరు పంచాయతీలోని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు సింహాద్రిరావు, భవానీలను సంప్రదించి ఆమెను చేర్పించామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బాలత్రిపురసుందరి, నిర్మల ఉన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుదాం

- జన్మభూమికి చేయూతనిద్దాం
- ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఆంజనేయస్వామి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో కాకర్ల దంపతులు

కలిగిరి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జన్మభూమికి సేవ చేయడంతో పాటు గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మండలంలోని ఎరుకులరెడ్డిపాలెంలో షేక్ ఖాజామస్తాన్-నూర్జహాన్ దంపతులు గ్రామాభివృద్ధికి చేసిన సహాయ సహకారాలు అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి విగ్రహానికి శంకుస్థాపన, షేక్ నూర్జహాన్ వాటర్‌ప్లాంటు ప్రారంభోత్సవంలో కాకర్ల సురేష్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఎరుకలరెడ్డిపాలెం, గుడ్లదొన ప్రాంతాల్లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. భూముల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యేకు పలువురు మహిళలు తమ బాధలు విన్నవించుకోగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే తహసీల్దారుతో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యేక రెవెన్యూ సదస్సు నిర్వహించి భూసమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల విజయలక్ష్మి, బిజ్జం కృష్ణారెడ్డి, బీవీ రామారావు, చీమల తాతయ్య, బాసం నరసింహులునాయుడు, బొట్టా రాధయ్య, కాలపనేని వెంకటరమణయ్య, షరీఫ్, మధు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు పట్టణాభివృద్ధి, సుందరీకరణకు రూ. 26 కోట్లు

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర టీడీపీ నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ సమగ్ర అభివృద్ధి, సుందరీకరణ కోసం 26 కోట్ల రూపాయలు తక్షణం కేటాయించేందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పి నారాయణ హామీ ఇచ్చారని, ఈమేరకు అత్యవసరంగా ప్రతిపాదనలు ఇవ్వాలని కోరారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 15న స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కందుకూరు పట్టణ అభివృద్ధికి రూ. 50 కోట్లు నిధులు మంజూ రుచేస్తున్నట్లు ప్రకటించారని, హామీ నెరవేర్చే క్రమంలో 26 కోట్ల రూపాయలు కేటాయించేందుకు నిర్ణయించారని తెలి పారు. ఈనిధులు పట్టణ అభివృద్ధి, సుందరీకరణకు వినియోగించనున్నట్లు వివరించారు. అమృత్ 2.0 పథకం కింద కందుకూరు మున్సిపాలిటీ ఎంపికైనందున 49 కోట్ల రూపాయల నిధులు కేటాయించబడతాయని, ఆ నిధులతో కుంటల సుందరీకరణ, ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం కల్పించటం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి చేయనున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాదు, గోచిపాతల మోషే, రెబ్బవరపు మాల్యాద్రి, షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

దినేష్‌కు నివాళులు

వలేటివారి పాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) మండలంలోని శింగమనేనిపల్లెలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాళం దినేష్ దశదిన ఖర్మకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెంట గుర్రం మాల్యాద్రి, సోమినేని రవీంద్ర, ఉప్పుటూరి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కందుకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 2వ వార్డు ఉర్దూ స్కూల్ వద్ద రూ. 35 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. అనంతరం జనార్ధన కాలనీ పుట్టవద్ద సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వర రావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాదు, ముచ్చు శ్రీను, వడ్డెళ్ల రవి చంద్ర, రావూరి రామ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రామాయపట్నం పోర్టు రహదారికి భూములిచ్చిన రైతులను ఆదుకోవాలి

- సీపీఎం డిమాండ్



నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న దళిత రైతులు

గుడ్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు నిర్మాణంలో భాగంగా భూములు ఇచ్చిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం గుడ్లూరు ఏరియా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం చేవూరు గ్రామసచివాలయ కేంద్రంలో భూములు వివరాలతో కూడిన వినతిపత్రం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేవూరు దళితవాడకు చెందిన 28 మంది చిన్నకారు రైతుల దగ్గర నుంచి గ్రామ సర్వే నెంబర్లు 553లో 13 ఎకరాల 50 సెంట్లు భూమిని పోర్టు అధికారులు తీసుకొని నష్టపరిహారం చెల్లించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సాగు భూమిని కోల్పోయి నిరాశ్రయులైన దళితులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు చేవూరి రాజగోపాల్, చేవూరి ఇస్సాక్, లేళ్లపల్లి అంకయ్య, లేళ్లపల్లి కోటేశ్వరరావుతో పాటు గ్రామ సీపీఎం నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతారామాలయంలో పూజలు



భీమవరప్పాడు రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొండాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని గురువారం భీమవరప్పాడు తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని సీతారామాలయంలో ఐదు రోజుల పాటు జరిగే తిరునాళ్లలో భాగంగా తొలిరోజు ఉభయకర్తలు అంకురార్పణ కార్యక్రమం సందర్భంగా సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఉభయకర్త మామిళ్లపల్లి మాల్యాద్రి, తిరుపతమ్మ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సీతా, రాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. నేడు హనుమంతసేవ, శనివారం గరుడసేవ, ఆదివారం కళ్యాణం, సోమవారం పారు వేటతో తిరునాళ్ల ముగుస్తాయని అర్చకుడు సురేష్‌కుమార్ శర్మ తెలిపారు.

శ్రీరామ నవమి ఉత్సవాల ప్రారంభం



విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా కోదండరామస్వామి ఆలయం

అల్లూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకొని అల్లూరు పేటలోని కోదండ రామ స్వామి ఆలయంలో గురువారం ధ్వజా రోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వ హించారు. అర్చక బృందం భార్గవాచా ర్యులు, ఫణిసాగర్ దీక్షితులు, అనంత నారాయణాచా ర్యులు, సుదర్శనం నాగ గోపాలాచార్యులు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామివారు పొన్నవాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహన సేవలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు అల్లంపాటి వంశస్థుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

కావలి టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో భాగంగా ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగులు గురువారం డిపో గ్యారేజ్ ఎదుట ఎర్ర బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఎన్ఎంయూ గ్యారేజ్ సెక్రటరి కలాం మాట్లాడారు. ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ ఆర్టీసీ ఎండీకి ఇచ్చిన వినతిపత్రంలోని అంశాలైన 1-2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని నైట్‌ఔట్ అలెవెన్స్ రూ.400 చేయాలని, ఎస్ఆర్‌బీఎస్ పునరుద్ధరించాలన్న డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎన్ఎంయూ రీజినల్ పబ్లిసిటీ సెక్రటరి మీరామొహిద్దీన్, ప్రెసిడెంట్ పీవీ రావు, రవికుమార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు రీ సర్వే ర్యాలీ, గ్రామసభలు

బిట్రగుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ, బిట్రగుంట పంచాయతీలో శుక్రవారం రీ సర్వే ర్యాలీ, గ్రామ సభలు నిర్వహిస్తునట్లు తహసీల్దారు సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మండల కార్యాలయంలో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10గంటలకు కడనూతల సచివా లయ పరిధిలో అధికారులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. తరువాత (పాత) బిట్రగుంట సచివాలయంలో ఉదయం 11గంటలకు ర్యాలీ, రీ సర్వేపై గ్రామసభ నిర్వహిస్తామని తహసీల్దారు తెలిపారు. గ్రామాల పరిధిలోని రైతులు రెవెన్యూ, సర్వే అధికారులకు సహకరించాలని కోరారు.

సంగమేశ్వరుడి దర్శనం !

సకల పాపహరణం..

- రేపటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- 15 వరకు నిర్వహణ, ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తులు



దక్షిణ కాశీగా పేరుగాంచిన సంగమేశ్వరాలయం



సంగమేశ్వర ఆలయ శిఖరంపై ఉన్న శివుడు

సంగం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీరాపేరు, బొగ్గేరు, పెన్నానది కలిసేచోట (త్రివేణి సంగమం) పెన్నా ఒడ్డున పరశురాముడు ప్రతిష్ఠించిన ఆలయం సంగమేశ్వరాలయం. దీన్ని దక్షిణ కాశీగా కూడా వ్యవహరిస్తారు. ఇక్కడున్న త్రివేణి సంగమేశ్వరుడిని దర్శించుకుంటే సకల పాపహరణం జరుగుతుందని భక్తుల నమ్మకం. సంగంలోని శ్రీసంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.ఈ ఉత్సవా లలో కామాక్షిదేవి సమేత సంగమేశ్వరుడు రోజుకొక వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసింది.

• 12న రథోత్సవం

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం అంకురార్పణ, రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాలతో ప్రారంభ కానున్నాయి. 6న రాత్రి శేషవాహనసేవ, 7న అశ్వవాహనసేవ, 8న సింహవాహనసేవ, 9న వీరభద్రస్వామి హోమం, 10న రావణసేవ, 11న నందిసేవ, 12న ఉదయం రథోత్సవం, రాత్రికి పురుషామృగ వాహనసేవ, 13న గిన్నెభిక్ష, రాత్రికి కల్యాణం, 14న మేష సంక్రమణ, పుణ్యకాల తీర్థవాది, అలకలతోపు, ధ్వజావరోహణం, 15న గంధ ఒడి ఉత్సవం, ఏకాంతసేవలతో ఉత్సవాలు ముగుస్తాయి. ప్రతి రోజూ సాయంత్రం స్వామి, అమ్మవారికి పూలంగిసేవలు, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కూడా ఉంటుంది.



ఆలయంలో ఉన్న పాతాళ శివలింగం



బ్రహ్మోత్సవాల్లో సంగమేశ్వరస్వామి వారిని దర్శించుకుంటే పాప విమోచనం కలుగుతుంది. పరశురాముడు ఇక్కడ శివలింగ ప్రతిష్ఠించి పూజలు చేయడంతో పాప పరిహారం జరిగిందని పురాణాలు చెబుతున్నాయి. దీంతో భక్తులు సంగమేశ్వరస్వామిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివస్తారు.

- టీ. గోపాలకృష్ణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకుడు

స్వామివారిని దర్శించుకుంటే పాప పరిహారం

ప్రతిఒక్కరూ సౌర విద్యుత్ వినియోగించాలి

- అభివృద్ధి పనులకు కలెక్టర్ భూమిపూజ

మర్రిపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీసీపల్లి, నందవరం, రామనాయుడుపల్లి గ్రామాల్లో గురువారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. తొలుత పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఏర్పాటుచేసిన సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌర విద్యుత్‌ను ఉపయోగించుకునేందుకు గృహ యజమానులకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద బ్యాంకుల్లో సబ్సిడీ రుణాలు ఇస్తున్నారని, 400 యూనిట్ల పైబడి విద్యుత్ వినియోగించే ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని తప్పక ఉపయోగించుకోవాలని సూచించారు. అందుకు తొలుత జిల్లాలో 639 యూనిట్ల సోలార్ ప్లాంట్‌లు మంజూరు చేశామన్నారు. కాగా, డీసీపల్లిలో ఓ ఇంటిపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న ఇంటి యజమానిని కలెక్టర్ అభినందించారు. అనంతరం ఉపాధిహామీ పథకం ద్వారా పశువులకు నీటి తొట్టిలు నిర్మించేందుకు భూమిపూజ చేశారు. వేసవి దృష్ట్యా పశువులు నీటి కోసం ఇబ్బందులు పడకూడదని ఒక్కో తొట్టికు రూ. 3300 ఖర్చుతో జిల్లాలో 1600 తొట్టిలను నిర్మించేందుకు శ్రీకారం చుట్టామని, ఈపనులు 15రోజుల్లో పూర్తిచేస్తామని తెలిపారు. అనంతరం నందవరం ఎస్టీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో ఇంకుడు గుంతను, రామనాయుడు పల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో మాధవిలత, ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, తహసీల్దారు అనీల్‌కుమార్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సోలార్‌ప్లాంట్ వినియోగదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

63 రకాల వైద్య పరీక్షలు చేయాలి

- ల్యాబ్ టెక్నీషియన్లతో డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్లు(ఎల్‌టీ) 63 రకాల వైద్య పరీక్షలు నిర్వ హించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. గురువారం ఆమె కార్యాలయంలో ఎల్‌టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్య పరీక్షల ఫలితాలు త్వరగా ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. సమయపాలన పాటించాలని, విధిగా ఎఫ్ఆర్ఎస్ నమోదు చేయాలని హెచ్చరించారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, ఫలితాలను నిశ్చయ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ రికార్డులను జిల్లా అంతటా ఒకే విధంగా నిర్వహించాలన్నారు. అనంతరం మాసాంతపు రికార్డులను డీఎం హెచ్‌వోకు అందచేశారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమా మహేశ్వరి, అదనపు జిల్లా మలేరియా అధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



మాసాంతపు రికార్డులను అధికారులకు అందచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

నెల్లూరు (విద్య), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పని చేస్తున్న ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను మెరిట్ ప్రాతిపదికన విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీటితోపాటు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి కోసం సబ్జెక్టుల వారీగా సీనియారిటీ జాబితాను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఉపాధ్యాయులు తెలిపి న అభ్యంతరాల పరిశీలన తరువాతనే తుది జాబితాను విడుదల చేశామన్నారు. వెబ్‌సైట్‌లో పొందుపరిచిన జాబితాలపై కూడా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11వతేదీ వరకు తగిన ధ్రువపత్రాలతో విద్యాశాఖ కార్యాలయంలో అందచేయాలన్నారు.

ఆరోగ్యకర పశువులే... రైతుకు లాభం!

- వేసవిలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం
- త్వరలో పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు
- అందుకు పశుబీమా తప్పనిసరి
- 'ఆంధ్రజ్యోతి'తో పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్‌నాయక్

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత నిస్తోంది. పశువుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే గోకులాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అలాగే పశుగ్రాస క్షేత్రాలు, బీమా పథకాలను అందిస్తోంది. అంతేకాక వేసవిలో పశువుల ఆరోగ్య రక్షణకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి చేపడుతున్న కార్యాచరణను ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.



?: వేసవిలో పాల ఉత్పత్తి తగ్గడంతోపాటు పశువులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువ. వీటిని అధిగమించాలంటే..

!: అధిక ఉష్ణోగ్రతల వల్ల పాల ఉత్పత్తి తగ్గుతుంది. కాబట్టి పశువులను ఎండలో ఎక్కువ సమయం లేకుండా చూసుకోవాలి. ఉదయం 10 లోపు సాయంత్రం 5గంటల తరువాత మాత్రమే మేతకు బయటకు వదలాలి.

?: వేసవిలో ఎలాంటి మేత అందించాలి.

!: వేసవిలో అధిక వేడి వల్ల పశువులు తీవ్ర ఒత్తిడికి గురవు తాయి. ముఖ్యంగా తగినంత నీరు అందించాలి. ఖనిజ లవణాల మిశ్రమాన్ని 30 నుంచి 50గ్రాములు దాణాతో కలిపి ఇవ్వాలి. గడ్డిని ముక్కలుగా కోసి వేయవడం వల్ల త్వరగా జీర్ణించుకుంటాయి.

?: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటిని అందించే కార్యక్రమాలు చేపట్టారా...

!: పశువులకు నీటిని అందించేందుకు నీటి తొట్టెల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాకు 963 నీటి తొట్టెలు అవసరమని నివేదికలు పంపాం. ఉపాధిహామీ ద్వారా వీటిని ఏర్పాటు చేస్తాం.

?: పచ్చిగడ్డి అందించేందుకు తీసుకుంటున్న చర్యలు

!: పశువులకు పచ్చగడ్డి అందించేందుకు ప్రభుత్వం పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో 1200 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటికే 603 ఎకరాల్లో గ్రాసం పెంచేందుకు దరఖాస్తులు వచ్చాయి. 100శాతం రాయితీపై ప్రభుత్వం గ్రాసం పెంపకానికి ప్రోత్సహిస్తోంది.

?: మినీ గోకులాల పరిస్థితి ఏమిటీ

!: జిల్లాలో 1300 మినీ గోకులాలు ఏర్పాటు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 1160 ప్రారంభమయ్యాయి.

?: పాడిరైతులకు రుణాలు అందిస్తారా..

!: పశుకిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా పాడిరైతులకు రుణాలు అందించేందుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అతి త్వరలోనే అర్హులైన అందరికి రుణాలు అందిస్తాం. పాడి రైతులు పశుబీమా పథకంలో చేరాలి. ప్రతి రైతు బీమా చేయించుకోవాలి.

రైతులంతా సహకరిస్తేనే రీసర్వే విజయవంతం: కలెక్టర్

దుత్తలూరు(ఉదయగిరి), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులంతా సహకరిస్తేనే రీసర్వే విజయవంతంగా ముందుకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని నందిపాడు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో సక్ష్యం పథకం కింద చేపట్టిన ఇంకుడు గుంత, పెరటితోట, చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్త భోగ్యం సరస్వతి సెల్‌ఫోన్ తీసుకుని యాప్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వెంకటంపేట సచివాలయంలో రీసర్వేపై రైతులతో గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించి ర్యాలీ చేపట్టారు. గ్రామానికి సమీపంలో ఉపాధి హామీ పథకం కింద నీటితొట్టి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే దుత్తలూరులో పీఎం సూర్యఘర్ పథకం కింద వినియోగదారుడు ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జీపీఎస్ విధానంలో రీసర్వే చేస్తుండడంతో ఎలాంటి తప్పిదాలు ఉండవని, రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో మల్లికార్జున, సీడీపీవో సునీత, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు మణికుమార్, రామకృష్ణరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రక్రియ వేగవంతం చేయాలి

దుత్తలూరులోని సీడ్స్ స్వచ్ఛంద సంస్థ క్యాంపస్‌ను జిల్లా కలెక్టర్ ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ అమలు చేస్తున్న సేంద్రీయ వ్యవసాయ సాగు, విద్యా, నైపుణ్య శిక్షణ తరగతులు తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, వ్యవసాయాధికారులతో సమీక్షించారు. రైతులకు కేటాయించే విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రక్రియను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రీ సర్వేతో రైతులకు ప్రయోజనం

మనుబోలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రఘురామరాజు అన్నారు. మండలంలోని మడమనూరులో రీసర్వేపై నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతులు రీసర్వే జరిగే సమయంలో ఏ పొలం వద్ద జరుగుతుందో ఆ రైతు దగ్గరుండి పత్రాలు సరిచూసుకుని సిబ్బందికి సహకరించాలన్నారు. అలా చేస్తే రీసర్వేలో తప్పులు ఉండవన్నారు. ఏ పొలంలో సర్వే జరుగుతుందో ఆ పొలం రైతులు తప్ప మిగతా రైతులు వెళ్లకూడదన్నారు. రీసర్వే తరువాత రైతులకు కొత్త పాస్‌పుస్తకాలు, కొత్త ఖాతానెంబర్లు వస్తాయన్నారు. కావున రీసర్వే అయ్యేంతవరకు రైతులు రీసర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి రీసర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య, రీసర్వే డీటీ మంజుల, సర్వేయర్ శ్రీనువాసులు, వీఆర్వోలు, టీడీపీ నాయకులు నూనె లక్ష్మయ్య, ఉడతా విజయ్‌కుమార్, చెమర్తి సుధీర్ పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల గ్రేడింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి

- బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్

కందుకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు గ్రేడింగ్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు వేలంకు తీసుకొచ్చే ముందు బేళ్లను పరిశీలించుకుని నాణ్యతగా తేవటం ద్వారా గిట్టుబాటు ధరలు పొందాలని పొగాకుబోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ సూచించారు. కందుకూరు 2 పొగాకు వేలంకేంద్రంలో గురువారం ఆయన వేలంతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులతో మాట్లాడుతూ రైతులకు ఈఏడాది పెట్టుబడి విపరీతంగా పెరిగినందున గిట్టుబాటు ధరలు ఇవ్వటం ద్వారా రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. ఆయన వెంట పొగాకుబోర్డు వైస్ చైర్మన్ బ్రహ్మయ్య, రైతు నాయకులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.



కందుకూరులో పొగాకువేలంను పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్

సాల్వేషన్ ఆర్మీ ద్వారా ఎన్నో సేవలు

- సంస్థ అంతర్జాతీయ కమిషనర్లు ఎడ్వర్డ్ హెల్, షెల్లీ హిల్

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సాల్వేషన్ ఆర్మీ ద్వారా ఎన్నో రకాల సేవలు అందిస్తున్నామని ఆ సంస్థ అంతర్జాతీయ కమిషనర్లు ఎడ్వర్డ్ హెల్, షెల్లీ హిల్ వెల్లడించారు. నెల్లూరులోని సాల్వేషన్ ఆర్మీ చర్చి పరిశీలనకు గురువారం వారు వచ్చారు. చర్చి ద్వారా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు చర్చి బాగా పనిచేస్తోందని అభినందించారు. కాగా, ఇంటర్నేషనల్ కమిషనర్లకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి బాలసుధాకర్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రూథర్ శామ్యూల్, విజయకుమార్, విజయప్రసాద్, మేరి గ్రేసి, చంద్ర రాజు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎడ్వర్డ్ హెల్, షెల్లీహిల్‌కు స్వాగతం పలుకుతున్న బాలసుధాకర్ తదితరులు

ఉరేసుకుని బాలిక బలవన్మరణం

- ఆత్మకూరులో విషాదం

ఆత్మకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): బడికి వెళ్లి చదువుకోవాల్సిన 11 ఏళ్ల బాలిక బల వన్మరణానికి పాల్ప డిన విషాద ఘటన ఆత్మకూరు పట్టణంలో చోటుచేసుకుంది. పోలీ సుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని కారి ప్రకాష్, రత్నమ్మ దంపతుల కుమార్తె కాకి నిహారిక (11) ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. రోజులాగానే గురువారం స్కూల్‌కు వెళ్లి 12-45 గంటలకు ఇంటికి వచ్చిన నిహారిక బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంతపిలిచినా పలక్కపోవడంతో అనుమానం వచ్చి తలుపును పగులగొట్టి చూడగా బాత్‌రూమ్‌లో ఉన్న కమ్మీకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందింది. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ షేక్ జిలాని సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. 11 ఏళ్ల కూడా నిండని చిన్నారి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడడానికి కారణం ఏమిటా అన్నది అంతుచిక్కడం లేదు.

7 నుంచి అడ్మిషన్ల ప్రారంభం

పొదలకూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశా లలో ఇంటర్ అడ్మిషన్లు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం అమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసు నమోదు చేయాలి : ఆర్‌జేసీ

- 'నీలకంఠేశ్వర మాన్యంలో మళ్లీ దొంగలు' కథనంపై స్పందన
- మాన్యం భూములు పరిశీలించిన ఆర్‌జేసీ

ఉలవపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 1వ తేదీన ప్రచురితమైన 'నీలకంఠేశ్వర మాన్యంలో మళ్లీ దొంగలు' శీర్షిక కథనంపై ఎండోమెంట్‌కు చెందిన రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) ఆజాద్ చంద్రశేఖర్ స్పందించారు. గురువారం ఆయన ఆలయ భూములను పరిశీలించారు. మాన్యంలో సేకరించి కుప్పలుగా పోసిన గ్రావెల్‌ను తరలించకుండా చూడాలని వేణుగోపాల స్వామి ఆలయాల గ్రూపు కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులును ఆదేశించారు. 30.05 ఎకరాలకు సంబంధించి ఈనెల 11వ తేదీన స్థానిక దేవస్థానంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆర్‌జేసి పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఆలయ భూమలకు పక్కనే భువనేశ్వరి ఎంటర్ ప్రైజెస్ పేరుతో గ్రావెల్ మైనింగ్ చేస్తూ పనిలో పనిగా ఆలయ భూముల్లో విలువైన సంపద కొల్లగొట్టిన ఫణికుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్‌జేసి ఆదేశించడంతో ఈవో శ్రీనివాసులు గురువారం సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వక పిర్యాదు అందచేశారు. దేవస్థానానికి చెందాల్సిన సొమ్మును దొపిడీ ముఠా నుంచి రాబట్టేవరకు చట్టపరంగా ముందుకు వెళతామని ఆర్‌జేసి ఈ సందర్భంగా తెలిపారు.

డంప్ చేసిన గ్రావెల్ సీజ్

ఆలయ భూముల్లో కొల్లగొట్టిన గ్రావెల్ స్టోన్ ఉలవపాడులోని జాతీయ రహదారిపక్కన లారీ అసోసియేషన్ వెనుక డంప్ చేసి ఉంది. స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈవో శ్రీనివాసులు ఎస్సై అంకమ్మతో కలిసి పరిశీలించి సీజ్ చేశారు.



నీలకంఠేశ్వరుడి మాన్యం భూములను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్

ఎక్సైజ్ విశ్రాంత ఉద్యోగికి ఆర్థిక సాయం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో ఎస్ఐగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన కే సాయికృష్ణ కుమారుడి కిడ్నీ మార్పిడి చికిత్సకు ఆ శాఖ అధికారులు ఆర్థిక సాయం చేశారు. వారందరూ కలిసి సమకూర్చిన రూ.3,67,616కు చెక్కును గురువారం ఎక్సైజ్ కార్యాలయంలో డీసీ శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్లు జే రమేష్, జగదీశ్వర్‌రెడ్డి, ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎన్ ప్రభాకర్ రావు, జిల్లా అధ్యక్షుడు జీవీ ప్రసాద్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు

చెత్త సేకరణ కేంద్రాల పరిశీలన

ఉలవపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మేజర్ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న చెత్త సేకరణ కేంద్రాన్ని గురువారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ఎల్ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ఉలవపాడు ప్రధాన రహదారిపై కూరగాయలు, పండ్ల మార్కెటు యజమానులను రోజువారి చెత్త సేకరణ విధానంపై ఆరాతీశారు. అదేవిధంగా వేణుగోపాల స్వామి దేవస్థానం బజారులోని ఇళ్ల వద్దకు వెళ్లి మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఇళ్ల పన్నుల విషయంలో జాప్యం చేయొద్దని, అదేవిధంగా వేసవికాలం నీటి ఎద్దడి లేకుండా అప్రమత్తంగా ఉండాలని, చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణలో అశ్రద్ధ చేయవద్దని ఎంపీడీవో విజయ, ఈవోఆర్డీ శ్రీనివాసులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.



చెత్త సేకరణ కేంద్రం తొట్టెల్లో నిల్వచేసిన చెత్తను పరిశీలిస్తున్న డీపీవో శ్రీధర్‌రెడ్డి

ఇద్దరు వార్డెన్లకు చార్జ్ మెమోలు

నెల్లూరు (హరనాథ పురం), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వార్డెన్లు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో వారికి కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకట లక్ష్మమ్మ గురువారం చార్జ్ మెమోలు అందజేశారు. విడవలూరు, మైపాడు బీసీ బాలుర వసతి గృహాల్లో వార్డెన్లుగా విధులు నిర్వహిస్తున్న ఇరువురు పలు అక్రమాలకు పాల్పడ్డారని 2023లో ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై జిల్లా కలెక్టర్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని విచారణకు ఆదేశించారు. ఆ విచారణ నివేదిక ఆధారంగా సదరు వార్డెన్లకు చార్జ్ మెమోలు అందజేశారు.